


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 348 పేజీలు: 10+4 వెల: 6.50


**ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్** 2

ఆరుగురు మావోయిస్టులు మృతి

వారిలో నలుగురు మహిళలు









# 'సింగరేణి' టెండర్లు రద్దు చేస్తున్నాం



### ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారంటూ డి.సిఎం భట్టి ఆగ్రహం

### గాలికి రాలేదు.. 40 యేళ్లుగా ప్రజల కోసం పనిచేశా..

### దోపిడిదార్లు, క్రిమినల్స్ నుండి రాష్ట్రాన్ని రక్షిస్తాం

### ప్రజాభవన్‌లో మీడియాతో డి. సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** క్రిమినల్స్, దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను రక్షిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడించారు. తెలంగాణను, ఆస్తులను వనరులను పరిరక్షించి, వాటిని ప్రజలకు అందజేయడం కోసమే లక్ష్యమని పేర్కొన్నారు. పజాభవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడము కోసమో, అధికారం హోదాను అనుభవించడం కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని తేల్చిచెప్పారు. ఒక ప్రత్యేక లక్ష్యం కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. టెండర్లకు సంబంధించిన నిబంధనలు సింగరేణి పాలకవర్గం ఖరారు చేస్తుందని, ఇందులో తనకు ఎటువంటి సంబంధం ఉండదని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనుల విషయంలో ఆరోపణలు వచ్చిన వెంటనే వాటి టెండర్లు రద్దు చేయాలని సూచించినట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆస్తులు, వనరులను పేదలకు సమానంగా పంచడమే తమ లక్ష్యమన్నారు. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతానని ప్రకటించారు. సింగరేణి సంస్థ, నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను పిలిచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ >>2

### మేడారంలో జరిగిన ప్రత్యేక కేబినెట్ భేటీలో గ్రీన్‌సిగ్నల్



**2027 జూలై 27 నుంచి గోదావరి పుష్కరాలు**

**మెట్రో-2ఎ, 2బి కోసం భూసేకరణ, రూ.2787 కోట్ల అంచనా**

**పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, రూ.143 కోట్ల అంచనా**

**మహాత్మాగాంధీ వర్సిటీలో లా, ఫార్మసీలలో 52 కొత్త పోస్టులు**

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క**

# ఫిబ్రవరిలో మున్సి'పోల్స్'



ఆదివారం మేడారంలో జరిగిన కేబినెట్ భేటీలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి18:** వీలైనంత తొందరగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2996 వార్డులు, డివి జన్లలో ఎన్నికలు జరపాల్సి ఉంది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి అయింది. అందుకే ఫిబ్రవరిలోనే మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.ఫిబ్రవరి 15న శివరాత్రి,16 రంజాన్ పండుగలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఎన్నికల షెడ్యూల్ రూపొందించుకోవాలని కేబినెట్ అధికారులకు సూచించింది. సీఎం ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మేడారంలో ఆదివారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. >>2

### మీడియా పోరులోకి మమ్మల్ని లాగకండి -సిఎం రేవంత్

**ఖమ్మం, ప్రభాతవార్త, జనవరి 18:** మారీచులు.. సుబాహులు అసెంబ్లీకి వస్తున్నారు.. కుట్రలు కుతంత్రాలు పన్నే శకుని మామలాంటి కెసిఆర్ మాత్రం >>2

# నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి

### 24 నుంచి అమెరికా పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి18:** సోమవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విదేశాలలో పర్యటించనున్నారు. ఆదివారం మేడారంలోనే బస చేసి సోమవారం ఉదయం హెలికాప్టర్ ద్వారా నేరుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు చేరుకుంటారు. అక్కడ 4 రోజుల పాటు రాష్ట్రానికి పెట్టుబడుల సేకరణకు వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చలు చేస్తారు. ఇప్పటికే విదేశీ పర్యటనలో ఉన్న పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సిఎం చేరుకునే సమయానికి దావోస్‌లో దిగుతారు. 20 నుంచి 23 వరకు జరిగే ప్రపంచ ఆర్థిక పెట్టుబడుల అంతర్జాతీయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పాల్గొంటుంది. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఈఎఫ్) వార్షిక సదస్సు వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచ పారిశ్రామివేత్తలకు వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్శించే తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ-2026-30, తెలంగాణ ఏఐ హబ్‌ను కూడా సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను >>2



ఆదివారం ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో అభివాదం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, సిపిఐ అగ్రనేతలు డి.రాజా, నారాయణ, కూనంనేని తదితరులు

# రాహుల్‌ని ప్రధాని చేద్దాం

### కలిసి పనిచేద్దామని కమ్యూనిస్టులకు సిఎం పిలుపు

### బిజెపి అంటే బ్రిటిష్ జనతా పార్టీ

### రాజ్యాంగాన్ని చెరబట్టడానికి ఆ పార్టీ యత్నం

### ఖమ్మం సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో సిఎం రేవంత్‌రెడ్డి

**ఖమ్మం, జనవరి 18, ప్రభాతవార్త:** బిజెపి అంటే బ్రిటిష్ జనతా పార్టీ అనిరాజ్యాంగాన్ని చెర పట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, ప్రజలకు పని చూపించకుండా ఆదాని, అంబానీలకు ఈ దేశాన్ని ప్రధాని మోడీ దోచిపెడుతున్నాడని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బిజెపి అది ఒక పాసిస్ట్ పార్టీ అని, హరిజన, గిరిజన బడుగు బలహీన వర్గాల పై బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, దేశంలో నిరుపేదలకు పట్టడు అన్నం పెట్టలేక ఉపాధి హామీ పనులు చూపలేక ఉన్న పథకాన్ని రద్దు చేశాడని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల హక్కుల పోరాటాల్లో ప్రాణాలు కోల్పోతామే కానీ ఎర్ర జెండా వదలమని ప్రకటించిన కామ్రేడ్లకు వందనం అని, రైతులు, రైతు కూలీలు, హరిజనులు, గిరిజనులుకోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. దున్నే వాడిదే భూమి అని కమ్యూనిస్టులు పిలుపునిస్తే దానిని అమల్లోకి తెచ్చింది ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు అన్నారు. రైతులు ధర నిర్ణయించలేనప్పుడు కనీస మద్దతు ధర కోసం కమ్యూనిస్టులు పోరాడారని, 4 వేల అమర వీరుల త్యాగాలతో హైదరాబాద్ రాష్ట్రం నిజాం నుంచి విముక్తి అయిందని గుర్తు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, శేషగిరి రావు వంటి వారెందరో నాడు పోరాటం చేశారని, కమ్యూనిస్టులు చేసే పోరాటంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు అవటం ఆనాటి నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉందని అన్నారు. కాంగ్రెస్.. కమ్యూనిస్టులు కలిసి ఉపాధి హామీ పథకం తెస్తే బీజేపీ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని, ఉపాధి హామీ రద్దుతో అగ్గువకో సగ్గువకో అదానీ అంబానీలకు కూలీలు దొరికే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీషర్ల కు వ్యతిరేఖంగా నాడు పోరాటం చేశాం పేదల హక్కులు కొల్లగొట్టడానికి, రాజ్యాంగం మార్చడానికి 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు కోరుతున్నారని, పేదల ఓటు హక్కు రద్దు చేసేందుకు సార్ తీసుకొస్తున్నారని విమర్శించారు. ఓటు హక్కు లేకపోతే రేషన్ కార్డు, ఇల్లు, పింఛన్ పోతుంది. అందుకే కాంగ్రెస్, కమ్యూనిస్ట్ తేడా లేకుండా మోదీకి వ్యతిరేకంగా దండు కట్టాలి. ఆ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. నేటి ఈ ప్రభుత్వంలో మీ శ్రమఉంది అని, నరేంద్ర మోదీ, >>2



### మేడారం బస్సుల్లోనూ

# మహిళలకు ఫ్రీ

### జాతర కోసం 4 వేలుపైగా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 18:** తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గిరిజన పండుగ మేడారం జాతరకు తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను నడపనుంది. జాతర కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగించాలని నిర్ణయించింది. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ఆర్‌టిసి సుమారు 4వేలకు పైగా స్పెషల్ సర్వీసులు నడపనుంది. సాధారణంగా స్పెషల్ బస్సుల్లో ఉన్న ఛార్జీల కంటే అదనపు ఛార్జీలను వసూలు చేస్తారు.. అలాగే స్పెషల్ బస్సుల్లో ఎలాంటి మినహాయింపులు ఉండవు. కానీ ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆర్‌టిసి ప్రకటించింది. ఈ మేరకు జాతర స్పెషల్ బస్సులకు టికెట్ ధరలను ఖరారు చేస్తూ ఆర్‌టిసి ఓ ప్రకటన విడుదల చేసింది. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్‌టిసి తెలిపింది. వరంగల్, హనుమకొండ నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో మేడారం జాతరకు వస్తారని అంచనా వేసిన >>2

### హార్వర్డ్ విద్యార్థిగా సిఎం రేవంత్‌రెడ్డి

ప్రత్యేక కోర్సులో చేరిక

లీడర్‌షిప్ ఫర్ 21 సెంచరీ కోర్స్ చేయనున్న సిఎం 7

# పాఠశాల విద్యలో సిబిఎస్ఇ సిలబస్!

### సైన్స్, మ్యాథ్స్‌లో పూర్తి అమలుకు సర్కార్ యోచన

### సోషల్ స్టడీస్‌లో 70% సిబిఎస్ఇ 30 % స్టేట్ సిలబస్

### ప్రభుత్వ ఆమోదం తరువాత అమలు చేసే అవకాశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 18:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సిబిఎస్‌సి సిలబస్‌ను అమలు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే సిబిఎస్‌ఈ సిలబస్‌ను అన్ని సబ్జెక్టుల్లో కాకుండా కేవలం సైన్స్, గణితంలో అమలు చేస్తూ.. సోషల్ స్టడీస్‌లో 70 శాతం సిబిఎస్‌ఈ సిలబస్ ఉండేలాగా..



మిగిలిన 30 శాతం స్టేట్ సిలబస్ ఉండేలాగా కరికులమ్‌ను రూపొందించాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు కారణం.. కేంద్రం నిర్వహిస్తున్న జాతీయ పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్ వంటి వాటితోపాటు సివిల్స్‌లోనూ ఎక్కువగా ఎన్‌సిఈఆర్‌టీ రూపొందించిన సిబిఎస్‌ఈ సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తుండటంతో ఆయా పోటీ పరీక్షల్లో సిబిఎస్‌ఈ సిలబస్‌లో చదివిన విద్యార్థులు ఎక్కువ మంది అర్హత సాధిస్తున్నారని.. అందుకే రాష్ట్రంలో కూడా సిలబస్‌ను మార్చి సిబిఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. 1వ తరగి నుంచి 10వ తరగతి వరకు సైన్స్, >>2



ఆదివారం ఖమ్మం సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భారీ ర్యాలీ దృశ్యం

## రాహుల్‌ని ప్రధాని చేద్దాం

>> అమిత్ షా కలిసి వచ్చినా బీజేపీ ఒక్క సీటు రాలేదని, తులసీ వనంలో గంజాయి మొక్కకు చోటు లేదు.. ఖమ్మం జిల్లాలో బీజేపీకి చోటు లేదన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీకి ఒక సర్పంచులు కూడా లేదని భవిష్యత్తులో కూడా ఉండాలని అందుకో కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీ కలిసి పోరాడితే ఈ పాసిస్ట్ పార్టీ పతనం కావడం ఖాయం అన్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్ కలిసి పనిచేసి భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని అందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనమినేని సాంబశివరావు, 40 దేశాలకు చెందిన ప్రతినిధులు, జాతీయ నాయకులు పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెండర్లు రద్దు చేస్తున్నాం

>> నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించామని, తాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిని కావడంతో ఆయనపై ఉన్న కోపం తన మీద చూపిస్తున్నారని అన్నారు. తాను ఆత్మగౌరవం కోసం బతుకుతామని తెలియచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, మంత్రులందరం రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని చెప్పారు. చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. తాను రాజకీయాల్లోకి గాలికి రాలేదని 40 సంవత్సరాలుగా సభలో, బయట ఉండి ప్రజల కోసం పోరాటాలు చేసి వచ్చానని వెల్లడించారు. ఒకరి వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదని, నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టు కథలు రాశారని డిప్యూటీ సీఎం దుయ్యబట్టారు. దీనికి భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదని, సింగరేణి ప్రజల ఆస్తి అని, బొగ్గు గనులు ప్రజల ఆత్మ గౌరవమని, పదవుల కోసం కాదని, ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. క్లిష్ట ప్రాంతాల్లో గనులున్నందున ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి అని, ఇలాంటి నిబంధనలు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉన్నాయని తెలిపారు.

## మహిళలకు ఫ్రీ

>> అధికారులు.. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ నుంచి మేడారానికి టికెట్ ధర బస్సుల ఆధారంగా రూ.250 నుంచి రూ.500 వరకు .. హైదరాబాద్ నుంచి మేడారంకు రూ.600 నుంచి రూ. 1,110 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ స్పెషల్ బస్సుల్లోనూ మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లకు 'మహాలక్ష్మి' పథకం వర్తిస్తుందని ఆర్‌టిసి స్పష్టం చేసింది.

## నేటి నుంచి జూనియర్, డిగ్రీ కాలేజీలు పునః ప్రారంభం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 16:** తెలంగాణ రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కాలేజీలు సంక్రాంతి సెలవుల అనంతరం నేడు(సోమవారం) తిరిగి ప్రారంభం కానున్నాయి. జూనియర్ కాలేజీలకు ఈనెల 13 నుంచి 18 వరకు.. ఆరు రోజులపాటు సంక్రాంతి సెలవులు కొనసాగగా.. డిగ్రీ కాలేజీలకు ఈ నెల 10 నుంచి 18 వరకు 9 రోజుల సంక్రాంతి సెలవుల అనంతరం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీలు పునః ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌కి ఈ నెల 10 నుంచి శుక్రవారం(16) వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వగా శనివారం నుంచే తిరిగి పాఠశాలలు ప్రారంభమైన విషయం తెలిసిందే.

## పోరులోకి మమ్మల్ని లాగకండి

>> ఫామ్ హౌస్‌లో పండుకుంటున్నాడని సిఎం రేవంత్ ఆరోపించారు. పాలేరు నియోజకవర్గం మద్దెలపల్లిలో మాట్లాడుతూ.. రెండు మీడియా సంస్థల పోరులోకి మమ్మల్ని లాగకండి.. మీ మధ్య గొడవలు ఉంటే మీరే పరిష్కరించుకోవాలి.. మాపైన మంత్రులపైన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ పైన ఆపాదిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి అంశంలో అనుభవజ్ఞుడైన మంత్రి తుమ్మల సూచనలు సలహాలు తీసుకుంటామని, మంత్రి పొంగులేటి మేడారం పనులు త్వరితగతిన చేయిస్తున్నారని, మేం అంతా కలిసి పని చేస్తున్నామని అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఆరుగురు మావోయిస్టులు మృతి

### వారిలో నలుగురు మహిళలు

**రాయ్‌పూర్, జనవరి 18:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లోజరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. వారిలో నలుగురు మహిళా కేడర్ మావోలు కూడా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. బీజాపూర్‌జిల్లాలో గత రాత్రినుంచి భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. డిఆర్‌జి, కోబ్రా, ఎస్టీఎఫ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఆపరేషన్‌లో ఆదివారం రాత్రి పదిగంటలప్రాంతంలోనే మావోయిస్టులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుల్లో మావోయిస్టు కమాండర్ డివిసిఎం దిలీప్ బెద్‌జా, ఎసిఎం మాడ్వి కోసా, మహిళా ఎసిఎం లఖీ మాడ్కమ్, పార్టీ సభ్యుడు రాదాలుగా ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన ఇద్దరినీ గుర్తించాల్సి ఉంది. ఇంద్రావతి రిజర్వు, నేషనల్‌పార్క్ ప్రాంతాల్లో దిలీప్ చురుకుగా మావోయిస్టు కార్యకలాపాలునిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా విస్తృత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ మాట్లాడుతూ బెద్‌జా లొంగిపోడానికి అవకాశం కల్పించినా తిరస్కరించాడని, పదేపదే హెచ్చరికలు జారీచేసి ఆయుధాలతో లొంగిపోవాని హెచ్చరించినా కూడా లెక్కచేయలేదని, చివరకు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ప్రాంతంలో భారీ సంఖ్యలో ఆయుధాలు, రెండు ఎకె 47 తుపాకులు, ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు 303 రైఫిళ్లు, ఆరుగ్రేనేడ్‌లను స్వాధీనంచేసుకున్నారు. మావోయిస్టులు భారీ ప్లాన్‌తో ఉన్నట్లు గుర్తించామని అందుకే నిఘా వ్యవస్థను పటిష్టంచేసి ఆపరేషన్ కొనసాగించినట్లు బీజాపూర్‌ఎస్‌పి డా.జితేంద్రయాదవ్ తెలిపారు. బస్తర్‌రేంజి ఐజి సుందర్‌రాజ్ పట్టిలింగమ్ సాయుధదళాల కృషిని ప్రశంసించారు.

## నేడు ఢిల్లీకి బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి18:** బిజెపి జాతీయ అధ్యక్షుల ఎన్నికల సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావుసోమవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరనున్నారు. జాతీయ అధ్యక్షులు ఎన్నికలలో బిజెపిరాష్ట్ర శాఖ తరపున పాల్గొననున్నారు. బిజెపి అధ్యక్షుడి నామినేషన్ ప్రక్రియలో బిజెపిరాష్ట్రశాఖ తరపున పాల్గొంటారు.

## సిబిఎస్ఇ సిలబస్!

>> గణితంతోపాటు సోషల్ స్టడీస్‌లో 70 శాతం సిబిఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తే తెలంగాణ విద్యార్థులు కూడా జాతీయ పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్ పరీక్షలతోపాటు యుపిఎస్‌సి నిర్వహించే సివిల్స్‌లోనూ ర్యాంకులను సాధించే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇదే అంశంపై కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన విద్యా శాఖ సమీక్ష సమావేశంలోనూ చర్చించినట్టు తెలిసింది. అయితే ఆ సందర్భంగా ప్రభుత్వం ఇప్పటికే సిలబస్ మార్పుతోపాటు తెలంగాణ విద్యా విధానం రూపకల్పన కోసం కమిటీని ఏర్పాటు చేసిందని.. కమిటీ నివేదిక ఇంకా రావల్సి ఉందని చెప్పిన ఉన్నతాధికారి.. కమిటీ నివేదిక అనంతరం ఈ ప్రతిపాదనపై ఆలోచిద్దామని చెప్పినట్టు సమాచారం. అయితే సూచన ప్రాయంగా రాష్ట్రంలో 10వ తరగతి వరకు సైన్స్, గణితంలో పూర్తిస్థాయిలో అలాగే సోషల్ స్టడీస్‌లో 70 శాతం సిబిఎస్ఈ సిలబస్‌ను అమలు చేయాలనే ప్రతిపాదనకు అంగీకారం తెలిపినట్టు తెలుస్తోంది. ఒకవేళ సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్‌ను మార్చాల్సి వస్తే 2026-27 విద్యా సంవత్సరంలో వీలు కాదు. ఎందుకంటే ఇప్పటికే 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాల ముద్రణకు సంబంధించిన టెండర్లు ఫైనల్ కావడంతోపాటు ప్రింటింగ్ వర్క్‌ను కూడా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి ఇది అమలు చేయడం సాధ్యం కాదు. పైగా రాష్ట్రంలో ఒకేసారి 1వ తరగతి నుంచి 10 తరగతి వరకు సిలబస్‌ను సిబిఎస్ఈగా మార్చాలంటే ఎటువంటి అభ్యంతరాలు వస్తాయి.. విద్యా వేత్తలు, ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఎలా స్పందిస్తాయి, విద్యార్థిసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు ఇతర విదారంగ నిపుణులు ఎలా స్పందిస్తారనే ఆలోచన కూడా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. అయితే వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయిన తరువాత ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిపై వచ్చే అభిప్రాయాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాలు సిబిఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నాయి.. వాటి ఫలితాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది.

### వారం - వర్జ్యం

19-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాషాఢ కార్తె
పాడ్యమి రా.2.12
ఉత్తరాషాఢ ఉ.11.50
వర్జ్యం : సా.4.02-5.43
దు.ము.12.41-1.26,
2) మ.2.56-3.41
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** వీసా, పాస్‌పోర్ట్ అంశాలు ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి. వృత్తి పరంగా అభివృద్ధి సాధిస్తారు.

**వృషభం:** మీ వారెవరో, మీకు అపకారం చేసేవారెవరో స్పష్టంగా తెలుస్తుంది. తగాదాలు విడిపిస్తారు.

**మిథునం:** ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో కాస్త జాప్యం జరిగుతుంది. మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది.

**కర్కాటకం:** నమ్మకాలకు తావివ్వకుండా రోటిన్ సంతకాల విషయంలో వ్యక్తిగత బంధుత్వాలకు అతీతంగా వుండండి.

**సింహం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో ఏర్పడిన పరిచయాలను మీకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తారు.

**కన్య:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. సహచర వర్గం కరువవుతారు. ధనలాభం.

**తుల:** వాహనం నడిపేటప్పుడు, మధ్యవర్తిత్వము, వివాదాలు మొదలయిన వాటి విషయవ్యవహారాలలో జాగ్రత్త.

**వృశ్చికం:** అనుకూలాంశాలు ఉంటాయి. కుటుంబ పురోభివృద్ధి సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి.

**ధనుస్సు:** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేసారు. వస్త్ర లాభం.

**మకరం:** ప్రయాణాలలో వస్తుభద్రత పట్ల విశేష జాగ్రత్తలు పాటించండి. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కుంభం:** సంబంధ బాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి. మిత్రులలో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మీనం:** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకో గలుగుతారు. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బిఆర్ఎస్ గద్దెలు కూల్చాలి

### కాంగ్రెస్ శ్రేణులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు

### రాక్షసుల కుల గురువు శుక్రాచార్యుడిలా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో ఉండి కెసిఆర్ కుట్రలు చేస్తున్నారు.. సింగరేణిలో అవినీతి లేదు

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జండా రెపరెపలాడాలి: ఖమ్మం, మద్దులపల్లి బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

**ఖమ్మం జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని చూసిన బిఆర్ఎస్ పార్టీ దిమ్మెలను కుల్చివేయాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో దిమ్మతిరిగే ఫలితాలు ఇవ్వాలని, రాక్షసుల కుల గురువు శుక్రాచార్యుడు లా ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కెసిఆర్ ను 100 మీటర్ల లోతులో బొంద పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం మద్దెలపల్లి లో ఆదివారం రూ.362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మద్దెలపల్లిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం జిల్లాకు వచ్చిన ప్రతిసారి మనస్ఫూర్తిగా ప్రజలు తనను ఆశీర్వదించారని, కానీ బిఆర్ఎస్ పాలనలో అన్ని ప్రాంతాలను ఒక్క ముఖ్యమంత్రి పోషిస్తూ ఏకపాత్రాభినయం చేశారని, ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో పండుకొని కేసీఆర్ అనేక కుట్రలు కుతంత్రాలు చేశారని, పేదలకు మేలు చేసే ప్రయత్నం చేస్తుంటే మారీచులు, సుబాబుడు మాదిరిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

పేదల కళ్లలో ఆనందం చూడాలనే లక్ష్యంతో కడుపునిండా అన్నం పెట్టేందుకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, గతంలో ఎవరైనా చనిపోతేనే మరొకరికి కార్డు ఇచ్చేవారు. ఇప్పుడు మేము అడిగిన ప్రతి ఒక్కరికి కార్డు ఇస్తున్నాం..

ఇంకా ఎవరైనా పేదలు ఉంటే కార్డులు ఇస్తాం.. కడుపు నిండా తినే అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని చూసిన బీఆర్ ఎస్ నాయకులను అధికారానికి దూరంగా ఉంచాలని, మున్సిపల్ ఎన్నికల్లో సరైన జవాబు ఇవ్వాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. ఉచిత విద్యుత్ అందజేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిదని, గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పేరుతో పేదలను దగా చేసిందని, రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లను కొనసాగిస్తున్నామని ఇందిరమ్మ ఇళ్లను ఈ జిల్లాలోనే ప్రారంభించామని గుర్తు చేశారు.

ఖమ్మం జిల్లా ప్రజలు తెలివైన వారని, అందుకే 2014, 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ ఎస్ కి ఒక్కో సీటు ఇచ్చారని, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 85 శాతం మంచి పలితాలు ఇచ్చారని గుర్తు చేశారు. భద్రాచలం రాముడిని గత ముఖ్యమంత్రి మోసం చేశారని, తమ ప్రభుత్వం భద్రాచలాన్ని మరో అయోధ్యలా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లే అని నాటి ముఖ్యమంత్రి అంటే ఇప్పుడు సన్నవడ్లు వేయండి బోనస్ ఇస్తామని మంత్రులు ఉత్తమకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారనిమేం వచ్చాక 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం ఉద్యోగ పత్రాలు ఇచ్చేటప్పుడు వారి తల్లిదండ్రులను పిలిచాం ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించడంతో పాటు 1000 బస్సులకు యజమానులు చేశామని వివరించారు. ఆడ బిడ్డలకు సున్నా వడ్డీ నిధులు త్వరలోనే విడుదల చేస్తామని, రుణమాఫీ చేయడంతోపాటు బోనస్ ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సింగరేణిలో ఎటువంటి అవినీతి కి తావు లేకుండా చూస్తామని, బొగ్గు గనుల వ్యవహారంలో పారదర్శకంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని లేనిపోని ఆరోపణలు చేస్తూ గందరగోళం సృష్టించవద్దని వివరణ కావాలి అంటే తనను సంప్రదించవచ్చని మీడియా సంస్థలకు సూచించారు.

వాడో వీడో వస్తానని చెబుతున్నారు.. వాళ్లు వచ్చేది లేదు.. వచ్చినా ఓటేసేవాళ్ళు లేరు పదేళ్లు టీడీపీ.. పదేళ్లు కాంగ్రెస్, పదేళ్లు బీఆర్ ఎస్ పాలించాయి మనం 2023 లో అధికారంలోకి వచ్చాం. 2033 వరకు అధికారంలో ఉంటామని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ప్రసంగించారు.

## ఫిబ్రవరిలో మున్సి'పోల్స్'

>> మేడారంలో రెండున్నర గంటల పాటు మంత్రి మండలి సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా 18 అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రెవెన్యూ, గృహ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. 2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాల అభివృద్ధి, ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు త్వరలో కేబినెట్ సబ్ వేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఒక సర్క్యూట్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయం చేశారు. దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురాతత్వ శాఖల సంయుక్తంగా డీటేయిల్ రిపోర్ట్ తయారు చేయాలని అధికారులకు కేబినెట్ ఆదేశించామని, మార్చి 31 నాటికి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సిఎం ఆదేశించారని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు సంబంధించి ఇంతవరకు జరిగిన పురోగతిని కేబినెట్ సమీక్షించిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు, కాగా, మెట్రో ఫేజ్-2 ఏ లోని నాలుగు కారిడార్లు, ఫేజ్-2బిలోని మూడు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఈలోపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ మేరకు రూ.2,787 కోట్ల అంచనా వ్యయమయ్యే భూ సేకరణ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24 కొత్త పోస్టులు, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టులు మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ లో రిజిస్ట్రార్ పోస్టుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ మండలంలో ఎకో టౌన్ డెవలప్మెంట్‌కు టిజిఐఐసికి 494 ఎకరాల భూమిని కేటాయించేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చిందన్నారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బంజారా హిల్స్‌లోని ఐసిసిసి నుంచి శిల్పాలే అవుట్ రోడ్డు వరకు కొత్తగా 9 కి.మీ. కొత్త రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కాగా, జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేయాలని కేబినెట్ నిర్ణయించింది. మేడారంలో శాశ్వత భవనాల నిర్మాణానికి ఆమోదించింది. 2004-2005లో అప్పటి ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నపుడు మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఏర్పాటుకు నేను కృషి చేశాను.. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల తర్వాత అంత పెద్ద యూనివర్సిటీ మహాత్మాగాంధీ యూనివర్సిటీ అక్కడ వృత్తి విద్యా కోర్సులు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వాన్ని 10యేళ్ళు కోరిన పట్టించుకోలేదు.. కానీ విద్యా శాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నా కోరిక మేరకు లా, ఫార్మసీ కోర్సులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24 కొత్త పోస్టులు, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టులు మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో మట్టి రోడ్లు అనేవి ఉండవుహ్యామ్ రోడ్లు టెండర్ స్పీడప్ చేయాలని క్యాబినెట్ లో చర్చ జరిగిందన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా హ్యామ్ రోడ్లు పనులకు టెండర్ పూర్తి చేసి వేగంగా పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 6వేల కి.మీ 11,399 కోట్లు రూపాయలతో హ్యామ్ రోడ్లు పనులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. .పంచాయతీ రాజ్ శాఖ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా గ్రామాల నుండి మండల కేంద్రాలకు..మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు, రాష్ట్ర రాజధానికి సింగిల్, డబుల్, ఫోర్ లేన్ రహదారులు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

**కేబినెట్‌లో చారిత్రక నిర్ణయాలు: మంత్రి సీతక్క**

రాష్ట్ర కేబినెట్‌నే మేడారానికి తీసుకొచ్చామని మంత్రి సీతక్క తెలిపారు. ములుగు ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకురాబోతున్నామని వెల్లడించారు. సీఎంకు, ఈ గుడికి కుటుంబ బంధం లేదని, కుల బంధం లేదని.. ఇది భావోద్వేగ బంధమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ప్రశంసించారు. కేబినెట్‌లో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నామని, రూ.143 కోట్లతో ములుగుకు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను తీసుకురావాలని నిర్ణయించామని సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. రామప్ప చెర్వు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతో పాటు 7500 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించనుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వివరించారు. రూ.143 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్కీం చేపట్టనున్నామని పేర్కొన్నారు.



మేడారం బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు

## మున్సిపల్ ఎన్నికలపై ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి18:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అనుమతి తెలుపుతూ స్పష్టతను ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, రిజర్వేషన్ల నివేదికను కూడా ఖరారు చేసి పంపినట్లు పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిన నివేదికలో 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్ల రిజర్వేషన్లు ఖరారు చేసిన వివరాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ప్రకారం మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.

## నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి

>> 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ ఆ పర్య టలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గత రెండేళ్లలో దావోసన పర్యటనల ద్వారా సుమా రు రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. ఈసారి భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్ వంటి మెగా ప్రాజెక్టులను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించి భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకురావాలని సిఎం ప్రణాళికలు సిద్ధం చేశారు. 24న దావోస్ నుంచి అమెరికాకు సిఎం రేవంత్ బృందం వెళ్లనుంది. అమెరికాలో వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చలు చేసి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిదిగా కోరుతారు. తర్వాత సిఎం బృందం ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి రానుంది. జీనోమ్ వ్యాలీ, హైదరాబాద్‌లో 1బయో - వృద్ధి దశ సంస్థల కోసం తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న గ్రోత్‌ఫేజ్ సెంటర్, బయోఫార్మా స్కేల్ అప్ తయారీ కేంద్రం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ సెంటర్ హైదరాబాద్‌లో స్థాపితం తదితర వివరాలతో పాటు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించనుంది. అధునాతన చికిత్సలు, డేటా ఆధారిత పరిశోధనలు, ప్రిసిషన్ మెడిసిన్, సస్టైనబిలిటీ వంటి అంశాల ఆధారంగా ప్రపంచ లైఫ్ సైన్సెస్ రంగం వేగంగా మార్పులు చెందుతున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్రం పరిమా ణానికి మాత్రమే కాకుండా విలువ, ఆవిష్కరణలు, గ్లోబల్ సమగ్రత ద్వారా నాయకత్వం వహించాలనే స్పష్టమైన, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతోంది. తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను సిఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు సమక్షంలో, ప్రపంచ పరిశ్రమల సీవోలు, సీనియర్ ప్రభుత్వాధి కారుల మధ్యదావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026లో ఆవిష్కరించనున్నారు. ఈ విధానం రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో కీలక మలుపుగా నిలవనుంది. తెలంగాణకు ఉన్న బలమైన తయారీ రంగ పునాదులను మరింత సమీకరించడంతో పాటు, అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి రంగంలో గ్లోబల్ స్థాయిలో పోటీ చేయగల కేంద్రంగా రూపాంతరం చెందేందుకు ఈ పాలసీ దిశానిర్దేశం చేస్తుంది. హైదరాబాద్ ఇప్పటికే ఇలీ లిల్లీ, సానోఫీ, ఎంఎస్‌డీ, నోవార్టిస్, ఆమెజాన్, బీఎంఎస్ వంటి అనేక ప్రముఖ గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీల కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. భారతదేశ ఔషధ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటా కలిగిన తెలంగాణ, దశాబ్దాలుగా ఫార్మా తయారీ రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని సాధించి, ఆర్థిక శక్తి కేంద్రంగా, చురుకైన పారిశ్రామిక హబ్‌గా పేరు తెచ్చుకుంది.

ఈ బలమైన పునాదిపై ఆధారపడి సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణను గ్లోబల్ వేదికపై ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల భవిష్యత్తును రూపకల్పన చేసే నాయకత్వ స్థానానికి తీసుకెళ్లాలనే దృష్టిని వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాస్యూటికల్ తయారీ, ఆర్‌అండ్‌డీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా ప్రపంచ స్థాయి, సుస్థిర పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణ అభివృద్ధి చేస్తోంది. కొత్త పాలసీ ద్వారా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను ప్రకటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ (టిఏఐహెచ్) ను దావోస్‌లో ప్రారంభించనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో ఈనెల 20న ఈ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఎఐ పరిజ్ఞానాన్ని ఇమడ్చటం, ఎఐ ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన స్వతంత్ర సంస్థగా, టిఏఐహె ప్రపంచంలోనే తొలి 'ప్రపంచ ఏఐ ప్రయోగ వేదిక'గా పనిచేస్తుంది. ఇప్పటిదాకా భారతదేశపు టెక్నాలజీరంగపు కేంద్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు ప్రపంచ నూతన ఆవిష్కరణల రాజధానిగా మారిపోయిందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. దావోస్‌లో తాము కేవలం పెట్టుబడులు మాత్రమే అడగడం లేదని, భాగస్వామ్యాలకై చేయి చాస్తున్నామని వివరించారు. నూతన ఆవిష్కరణలు, ప్రతిభల మేలుకలయికగా ఉన్న తెలంగాణలో ఏఐ భవిష్యత్‌ను నిర్మించడానికి ప్రపంచదేశాలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్, చిప్ డిజైన్ వంటి డీప్‌టెక్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు చోదక శక్తిగా పనిచేసేలా టిఏఐహెచ్ రూపొందించబడింది. తెలంగాణ ప్రగతిశీల ఏఐ వ్యూహంలో భాగంగా, విధానాల రూపకల్పన నుండి భారీస్థాయి అమలు దిశగా ఒక నిర్ణయాత్మక మార్పును టిఏఐహెచ్ సూచిస్తుంది. ప్రపంచానికి మరో ఇంక్యుబేటర్ అవసరం లేదని, ఒక ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్ అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టిఏఐహెచ్ ప్రారంభంద్వారా తాము ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో డీప్‌టెక్ రంగాలలో అత్యాధునిక ఆవిష్కరణలకు వేదికను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ అత్యంత సురక్షితమైన, ఎంటర్‌ప్రైజ్‌గ్రేడ్ ఉత్పత్తులు తెలంగాణలో రూపుదిద్దుకుంటాయని చెప్పారు.

నూతన ఆవిష్కరణల వేగానికి అనుగుణంగా విస్తృత స్థాయిలో పనిచేయగల కొత్త సంస్థాగత నమూనాగా టిఏఐహెచ్ రూపుదిద్దుకుంది. ప్రభుత్వ సంస్థలు ఎలా రూపకల్పన చేయబడతాయి, నిర్వహించబడతాయి అనే దానిని పునర్నిర్మించడం ద్వారా, వేగవంతమైన ప్రయోగాలు, వేగవంతమైన అమలు, ప్రైవేట్ రంగంతో లోతైన భాగస్వామ్యాన్ని టిఏఐహెచ్ సాధ్యం చేస్తుంది. టిఏఐహెచ్ ప్రత్యేక బలం దాని రూపకల్పనలోనే ఉందని, ఇది వేగం, స్థాయి, ప్రభావం కోసం రూపొందించిన సంస్థ అని ఐటీ, పరిశ్రమలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్ అన్నారు. స్టార్టప్ చురుకుదనం, ఎంటర్‌ప్రైజ్ సామర్థం, ప్రభుత్వ విశ్వసనీయత, విస్తృతిని సమన్వయం చేయడం ద్వారా, ఇది వేగవంతమైన ఇన్నోవేషన్‌ను సాధ్యం చేస్తుందని తెలిపారు. ఉత్ప త్తి-మార్కెట్ సరిపోలికను వేగవంతం చేస్తుందని, వెంచర్ క్యాపిటల్‌ను ఆకర్షిస్తుందని, పైలట్ దశను దాటి విభిన్న రంగాల్లో విస్తృత స్థాయి వాణిజ్య అమలుకు పరిష్కారాలను తీసుకెళ్తుందని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా, డీప్-టెక్ భవిష్యత్తుకు స్వాగతం పలికేవిధంగా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇన్నోవేషన్-ఫస్ట్ దృక్పథాన్ని ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు.




సెలవు దినాలు ప్రపంచవ్యాప్తంగా

# భారత్‌లోనే ఎక్కువ

## యేడాదిలో 42 రోజులు సెలవులే

**న్యూఢిల్లీ, జనవరి 18:** ప్రభుత్వ రంగంలో పనిచేసేవారికైనా ప్రైవేట్ రంగంలో పనిచేసే వారికైనా సెలవులు తప్పనిసరిగా ఆయా శాఖలు, సంస్థలు కేటాయిస్తాయికార్మిక శాఖ నిబంధనలను అనుసరించి నిర్దేశించిన తేదీల్లో సెలవులు ఉంటాయి. ఇవికాకుండా ప్రభుత్వం పూర్తి హాలిడేలు కూడా ప్రకటిస్తుంది. ఈ జాబితాలో. కొన్ని దేశాలు ఏటా ఎక్కువ సెలవులను ప్రకటిస్తుంటే మరికొన్ని పరిమిత సెలవులే ప్రకటిస్తాయి. ఈ సెలవులు జాతీయ కార్యక్రమాలు, సాంస్కృతిక వైవిధ్యం, మతపరమైన సంప్రదాయాలపై ఆధారపడి ఉంటాయి. అత్యధిక సెలవులున్నదేశాల జాబితాలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. అన్ని రకాల సెలవులు (జాతీయ, గెజిటెడ్, రిస్ట్రిక్ టెడ్, మతపరమైన, ప్రాంతీయ) కలిపి, భారతదేశం ప్రపంచంలోనే 42 అత్యధిక సెలవులను కలిగి ఉంది. ఇది భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని ప్రతిబిం బిస్తుంది. భారతదేశం మల్టీ రెలిజియస్ స్ట్రక్చర్ పండుగల పట్ల గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. తర్వాతి స్థానంలో నేపాల్ 35 సెలవులు ఇస్తోంది. క్యాలెండర్ కూడా మతపరమైన పండుగలతో నిండి ఉంది. ప్రధాన పండుగల సమయంలో లేదా వాటి చుట్టూ దీర్ఘ సెలవులు వస్తాయి. ఇరాన్ 26 సెలవులతో మూడవ స్థానంలో ఉంది. ఇక్కడ సెలవులు ఇస్లామిక్ క్యాలెండర్ ఆధారంగా ఉంటాయి. వీటిలో నౌరూజ్ (ఇరానియన్ నూతన సంవత్సరం), ఇతర మతపరమైన సెలవులు ఉన్నాయి. మయన్మార్‌లో ఇరాన్‌తో సమానమైన సెలవులు ఉన్నాయి 26. ఇవి ప్రధానంగా బౌద్ధ మతపరమైన పండుగలతో ముడిపడి ఉన్నా యి. థింగ్యాన్ నూతన సంవత్సరం, నీటి ఉత్సవం వంటి ప్రధాన పండుగల సమయంలో ఎక్కువ సెలవులు ఉంటాయి. శ్రీలంక 25 సెలవులతో ఐదవ స్థానంలో ఉంది. దీపావళి, ఈద్, క్రిస్మస్ వంటి పండుగలతో సహా మతపరమైన, పౌర సెలవుల సమతుల్యత ఉంది. అతి తక్కువ సెలవులు ఉన్న దేశాల గురించి ప్రస్తావిస్తే బ్రిటన్‌లో 10, నెదర్లాండ్స్‌లో 9, సెర్బియాలో 9, మెక్సికోలో 8, వియత్నాంలో 6 సెలవులు మాత్రమే ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటిస్తాయి.


అభివాదం తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య, ర్యాగ అరుణ్‌కుమార్, నీల వెంకటేష్, సతీష్, రాజేందర్ తదితరులు

# కోర్టు తీర్పు వచ్చాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

## లేకుంటే సహించం, పెద్దఎత్తున ఉద్యమం చేపడతాం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల విషయంలో కోర్టులో తీర్పు రాకముందే మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపకపోతే కేంద్రం నుంచి వచ్చే మూడు వేల కోట్ల నిధుల గ్రాంట్ రాదని ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని, ఇప్పుడు మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో 14 బిసి సంఘాల ఆధ్వర్యంలో సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. కోర్టు తీర్పు రాకుండా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని, రాష్ట్ర వ్యాపంగా ఆందోళనలు చేపడతామని, రాష్ట్రాన్ని స్తంభింప జేస్తామని, నిత్యావసరాలైన నీరు, విద్యుత్, రైళ్ళు, బస్‌లు బంద్ చేస్తామని ఆయన హెచ్చరించారు. న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగ బద్ధంగా కోర్టులో కేసు బిసిలకే బలంగా ఉందని, గెలవడానికి సర్వశక్తులతో పోరాడుతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేసును గెలిపించడానికి గట్టిగా ప్రయత్నం చేయకుండా ఎన్నికలకు తొందరపడటం ఎందుకని నీలదీశారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించినప్పుడు లేని సిలీంగ్ బిసిలకు ఎందుకనా న్నరు. బిసిలకు 68 మున్సిపాలిటీలు రావాల్సి ఉండగా కేవలం 38 మాత్రమే కేటాయించి చేతులు దులుపుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు. దీనిపైన ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ర్యాగ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలపై చిన్న చూపు చూస్తున్నదని, ఇప్పటి వరకు బిసిలకు కేటాయించిన నిధులు, పథకాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించకపోతే మరోక ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేష్, పగిళ్ళ సతీష్, సి.రాజేందర్, అనంతయ్య, మోదీ రాందేవ్, మొగిలి కృష్ణయ్య, మొకపిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ తీరుపై ఐరోపా దేశాల అత్యవసర భేటీ

**బ్రస్సెల్స్, జనవరి 18:** గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలిపేసుకోవాలన్న తమ అభీష్టాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఈయూ కూటమిలోని 8 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ 10 శాతం టారిఫ్ లు విధించారు. ఈ నిర్ణయాన్ని ఈయూ చీఫ్ లు తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపు సుంకాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో యురోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల అత్యవసర భేటీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లాన్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ఓ ప్రకటన జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈయూ-యూఎస్ సంబంధాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇందులో వారు హెచ్చరించారు. పరస్పర సహకారం తప్పనిసరిగా మారిన పరిస్థితుల్లో ఈ ధోరణి ఇరువైపులా నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలను దెబ్బతీస్తాయని, వాణిజ్య అడ్డంకులకు ఊత మిస్తాయని చెప్పారు. యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు దాని సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుందంటూ ఈయూ చీఫ్ లు ట్వీట్ చేశారు. మిత్రదేశాలతో కలిసి డెన్మార్క్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో నిర్వహించిన సైనిక విన్యాసాలను కూడా వారు సమర్థించారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను పెంచడమే ఈ విన్యాసం ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ చర్చల ప్రాముఖ్యతను ఈయూ గుర్తుచేసింది. ఈ విషయంపై ఉర్సులా వాండెర్ లాన్ ఎక్స్ లో స్పందిస్తూ ప్రాదేశిక సమగ్రత మరియు సార్వభౌమాధికారం అంతర్జాతీయ చట్టం యొక్క ప్రాథమిక సూత్రాలని చెప్పారు. ఇవి యూరప్ తో పాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అవసరమన్నారు. నాటో ద్వారా ఆర్కిటిక్‌లో శాంతి మరియు భద్రతపై మా ఉమ్మడి అట్లాంటిక్ ఆసక్తిని మేము నిరంతరం నొక్కిచెప్పామని వాండెర్ లాన్ పేర్కొన్నారు.



# వారిదంతా ఓట్ల రాజకీయం




## అధికారం కోసం చొరబాటుదారులను ప్రోత్సహిస్తున్నారు..

## అసోంలో వలసదారులతో స్థానికుల అస్తిత్వానికి ప్రమాదం

### కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించిన ప్రధాని మోడీ

**గువహటి, జనవరి 18:** కాంగ్రెస్ పార్టీ అంటే వారసత్వం.. ఓట్ల రాజకీయం.. ఆ పార్టీ ప్రతికూల రాజకీయాలను దేశ ప్రజలు తిరస్క రిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. అసోంలో అధికారం కోసం ఆ పార్టీ చొరబాటు దారులను ప్రోత్స హించిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నో ఏళ్ల కాంగ్రెస్ పార్టీలో అసోంలో వారికి ఆశ్రయమిచ్చిందన్నారు. ఆ పార్టీ హయాంలో పెద్ద మొత్తంలో చొరబాటుదారులు రాష్ట్రంలోకి వచ్చారని, స్థానికుల భూములు ఆక్రమించుకున్నారు. అసోమీల సంస్కృతిపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో అసోం ప్రజల అస్థిత్వం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదివారం అసోంలో కజిరంగ ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రధాని మోడీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజల్లో మద్దతు పెరుగుతోందన్నారు. ప్రజల మొదటి ఎంపికగా తమ పార్టీ మారిందని తెలి పారు. ఓటర్లు సుపరిపాలన, అభివృద్ధిని కోరు కుంటున్నారని, బీహార్ ఎన్నికలు.. తిరువ నంతపురం, ముంబై స్థానిక ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. దేశాన్ని ఎన్నో ఏళ్లు పాలించినప్పటికీ కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదని, అందువల్లే ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని ఆరోపించారు.

అలాగే గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అసోంలో రైల్వే నెట్‌వర్క్‌లకు 'తక్కువ బడ్జెట్' కేటాయించడాన్ని తీవ్రంగా విమర్శించారు. "కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, అసోం రైల్వే బడ్జెట్‌లో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే పొందిందని, బిజెపి ప్రభుత్వం హయాంలో దీనిని ఏటా దాదాపు రూ. 10,000 కోట్లకు పెంచిందని, ఐదు రెట్లు ఎక్కువ" అని ఆయన అన్నారు. ఈ మెరుగైన పెట్టుబడి కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, విద్యుదీకరణ, రైల్వే సామర్థ్యం, ప్రయాణీకుల సౌకర్యాల పెరుగుదలతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి దారితీసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కాలిబోర్ నుండి మూడు కొత్త రైలు సేవలను ప్రారంభించినట్లు ప్రధాని ప్రకటించారు, ఇది అసోం రైలు కనెక్టివిటీలో గణనీయమైన విస్తరణను సూచిస్తుందన్నారు. వందే భారత్ స్లీపర్ రైలు గౌహతిని కోల్‌కతాకు అనుసంధానిస్తుందని, ఇది సుదూర ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుందని, రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని ముఖ్యమైన స్టేషన్లను కవర్ చేస్తాయని, లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుందని వివరించారు. రోడ్లు, రైల్వేలు, వాయుమార్గాలు, జలమార్గాల ద్వారా అసోంను అనుసంధానించడానికి ఒకేసారి పనులు ప్రారంభమయ్యాయని ఆయన గుర్తించారు.

# అప్పుల ఊబిలో విద్యుత్ సంస్థలు

## రూ.1,02,328 కోట్లకు చేరిన రుణాలు

## పంపిణీ సంస్థల నష్టాలు రూ.69,741 కోట్లు

### దేశంలోనే 6వ స్థానంలో రాష్ట్ర డిస్కంలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ సంస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడు తున్నాయి. ముఖ్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితి దయనీయంగా తయారైంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు మొత్తం రూ.1,02,328 కోట్ల మేర రుణాలు చేశాయి. రుణాల్లో దేశంలోనే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఆరో స్థానానికి చేరుకున్నాయి. ఈ రుణాల్లో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వద్ద రూ.45,373 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.43,802 కోట్లు తీసుకోగా, బ్యాంకుల నుంచి రూ.13,153 కోట్లు చొప్పున రుణాలు తీసుకున్నాయి. ఇక దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లు విద్యుత్ కొనుగోలు నిమిత్తం రూ.53,101 కోట్ల రుణం తీసుకోగా, ప్రాజెక్టుల నిర్మాణాల కోసం తెలంగాణ జెన్‌కో 9.3 శాతం నుంచి 11.5 శాతం వార్షిక వడ్డీకి రూ.13,582.99 కోట్ల పీఎఫ్‌సీ టర్మ్‌లోన్, 9.311.15 శాతం వార్షిక వడ్డీతో ఆర్‌ఈసీ నుంచి రూ.17,010.95 కోట్ల రుణం తీసుకుంది. బ్యాంకుల నుంచి రూ.930.58 కోట్లు తీసుకుంది. ఈ విధంగా డిస్కమ్‌లు తీసుకున్న రుణాలను 2034-35 ఆర్థిక సంవత్సరానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.59,230 కోట్ల అప్పుల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో రూ.35,239 కోట్లు రుణాలు ఉండగా, 2024-25 నాటికి అవి రూ.59,230 కోట్లకు చేరుకున్నాయి. అలాగే నష్టాలను చూస్తే తెలంగాణలో విద్యుత్ పంపిణీ సంస్థలకు ఏటేటా నష్టాలు పెరుగుతున్నాయి. ఈ విధంగా 2024-25లో రూ. 69,741 కోట్లకు ఈ నష్టాలు చేరాయి.

మరోపక్క ప్రభుత్వ శాఖల నుండి విద్యుత్ పంపిణీ సంస్థలకు దాదాపు రూ.48 వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఇలా అప్పులతోపాటు రావాల్సిన బకాయిలు కూడా పెరుగుతుండటంతో పంపిణీ సంస్థల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తుతోంది.

# యంగ్ ఐపిఎస్‌లతో ట్రాఫిక్ సమస్యకు చెక్

## వారికి కీలక బాధ్యతలు

## ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌పై ఫోకస్

## అక్రమాలపై విజిలెన్స్ బలోపేతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఐపిఎస్ అధికారుల బదలీలు చేపట్టారు. శనివారం వెలు వడిన ఉత్తర్వుల్లో ముఖ్యమంత్రి ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరవాసులను ఏళ్ల తరబడి వేధిస్తున్న ట్రాఫిక్ చిక్కులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేసే యువ ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం రంగంలోకి దించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను ఉక్కుపాదంతో అణచి వేయాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపిఎస్ అధికా రులకు ఆ బాధ్య తలను అప్పగిం చారు. గ్రేటర్ హైద రాబాద్ మున్సి పల్ కార్పొరేషన్ పరిధి లోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిష నరేట్లతో పాటు కొత్తగా రూపు దిద్దుకుంటున్న ఫ్యూ చర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధి లో ట్రాఫిక్ వ్యవ స్థను బలోపేతం చేయడం ఈ బదలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డిసిపిలుగా పోస్టింగులు ఇచ్చా రు. ఈ బద లీల్లో భాగంగా కొత్త గూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్‌ను హైద రాబాద్ ట్రాఫిక్ డిసిపి1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. అదేవిధంగా జగిత్యాల అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి2 (కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి1 బాధ్యతలు అప్పగించారు. ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేస్ డిఐజి హోదాలో ఉన్న జి.చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికె రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి.రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి1 (శేర్లింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్‌లో డిఐజిగా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు. మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సా హానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.


శేషాద్రినీరెడ్డి,


శివం ఉపాధ్యాయ,


అవినాశ్‌కుమార్,


కాజల్,



కనకనాల రాహుల్‌రెడ్డి

# ఇన్‌స్టా మోసాలు.. ఇద్దరు వ్లాగర్లపై కేసు నమోదు

## రూ. 399లకే కార్లు, ఐఫోన్లంటూ

## టిటిడి ఆలయం ముందు ప్రచారం

### పంజాగుట్ట పోలీసులకు కరాటే కళ్యాణి ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 18, ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అక్రమ లాటరీలు, లక్కీ డ్రాల పేరుతో మోసానికి పాల్పడుతున్న ఇద్దరు వ్లాగర్లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీఅదిభట్ల శ్రీ కళాపీఠం వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు పదాల కళ్యాణి అలియాస్ కరాటే కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న ఎల్లారెడ్డి గూడకు చెందిన కొందరు యువకులు క్రేజీబాయ్ నరేందర్, ప్రవీణ్ క్యాస పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ప్రజలను మోసం చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన పాశం మహేష్‌యాదవ్ అనే యువకుడు క్రేజీ బాయ్ నరేందర్ ఖాతాకు రూ. 399 చెల్లించారు. ప్రవీణ్ క్యాస, నరేందర్‌లు బిగ్గెస్ట్ లక్కీడ్రా పేరుతో రూ. 249 ఎంట్రీ ఫీజు వసూలు చేయడంతోపాటు ఫ్రిజ్, టీవీ, నాలుగు ఎలక్ట్రిక్ బైకులు, రూ. 5వేల నగదు బహుమతులు, గ్రాండ్ ప్రైజ్‌గా హ్యుందాయ్ కారు ఇవ్వనున్నట్లు ప్రచారం చేశారు. అతని ఇన్‌స్టా ఖాతాకు దాదాపు 1.22 లక్షల ఫాలోవర్లు సైతం ఉన్నారు. సిద్దమోని నరేందర్ తిరుమల టీటీడీ ఆలయం ముందు వీడియోలు తీసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. అతను ఒక్కో వ్యక్తి నుంచి రూ. 399 వసూలు చేస్తూ ఫార్చ్యూనర్ కారు, ఐఫోన్ ఇస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ వ్యవహారలను గుర్తించిన కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇద్దరిపై 318(4), ఐటీ చట్టంతోపాటు తెలంగాణ లాటరీల చట్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మౌని అమావాస్య రోజున భారీగా భక్తుల పవిత్రస్నానాలు


**ప్రయాగరాజ్, జనవరి 18:** మౌని అమావాస్య సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమంలో లక్షలాదిగా భక్తులు పవిత్ర స్నానాలుచేసారు. ఆదివారం సెలవు కలిసి రావడంతో భక్తులు సుమారుగా 3.15 కోట్లమంది

## ఒక్క యుపిలోనే 3.15 కోట్లమంది భక్తుల రాక

వరకూ వచ్చినట్లు యుపి ప్రభుత్వం వెల్లడించింది. శనివారం అర్థరాత్రి దాటినతర్వాతనుంచే భక్తులు ఘాట్‌లకు చేరుకోవడం కనిపించింది. దట్టమైన మంచు కప్పుకున్నప్పటికీ భక్తులు మాత్రం ఉదయం వేళల్లోనే ఎక్కువ స్నానాలు ఆచరించేందుకు చేరుకున్నారు. మాఘమేళా 2026 పేరిట జరిగిన ఈ రోజు పవిత్ర స్నానాలతో భక్తులు తమకు ఎంతో పుణ్యం లభిస్తుందని, పితృదేవతలకు క్రతువులు కూడా నిర్వహిస్తారు. యుపిలోని ప్రయాగరాజ్‌లో ఉన్న ఘాట్‌లు 3.5 కిలోమీటర్ల పొడవుతో ఉన్నాయి. భద్రతకోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సిసిటివి కెమేరాలు, డ్రోన్లసాయంతో నిఘాను కట్టుదిట్టంగా అమలుచేసారు. కాగా మౌని అమావాస్యకు ముందురోజే సుమారు 1.5 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో స్నానాలు చేసినట్లు తేలింది. అదేవిధంగా యుపిలోని గంగాఘాట్ లన్నింటివద్ద కూడా వేలాదిగా భక్తులు స్నానాలుచేసి మహాశివుని దర్శించుకుని తరించారు. మణికర్ణిక ఘాట్‌లో కూడా పితృదేవతలకు సత్కార్యాలు నిర్వహించడం కనిపించింది. అదేవిధంగా హర్యానా, ఉత్తరాఖండ్‌లోని దైవక్షేత్రాల ప్రాంతాల్లోని నదీఘాట్ల వద్ద కూడా భారీ ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. 45 రోజుల మాఘమేళాలో మౌని అమావాస్య అత్యంత పవిత్రమైన రోజుగా భక్తులుపరిగణించి పవిత్ర స్నానాలు ఆచరించేందుకు వస్తారు. సోమవారం తెల్లవారుఝాము రాత్రి 1.22 గంటలవరకూ కూడా భక్తులు స్నానాలకు తరలివస్తుంటారని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా భక్తులు నదీఘాట్‌ల వద్ద స్నానమాచరించి పితృదేవతలను స్మరించుకున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్
టెండర్ ప్రకటన నం : 08/2025-26 (పత్రికా ప్రకటన)
TGSPDCL, అనుభవం గల వివిధ కాంట్రాక్టర్ల నుండి "కీసర డివిజన్-Spec.No. OKSR-23/2025-26 to OKSR-27/2025-26-సాధారణ కేటగిరీ మరియు నిర్మాణ డివిజన్-Spec No. 02/A of 25-26-ST కేటగిరీ కొరకు రిజర్వ్‌డు మరియు Spec No. 03/A of 25-26-ఆపరేషన్ రిజర్వ్‌డు ఫర్ వడ్డెర/సగర కేటగిరీ, సమ్మర్ యాక్షన్ ప్లాన్ క్రింద హబ్సిగూడ సర్కిల్ యొక్క వివిధ డివిజన్‌లలో వివిధ పనులు నిర్వర్తించటానికి టెండర్‌లకు ఉద్దేశించి ఆహ్వానిస్తున్నారు. తదుపరి వివరాలకు దయచేసి www.tgsouthernpower.com వీక్షించండి.
సం/- (P. వెంకన్న), సూపరింటెండింగ్ ఇంజనీర్, హబ్సిగూడ సర్కిల్
DIPR.No.13837-PP/CL/Advt/1/2025-26, తేది: 17.01.2026

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 18.01.2026
భారత ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందిన జాతీయ పార్టీగా / తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా / నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) రాష్ట్రాలలో గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా ఉండి గడియారం గుర్తు రిజర్వ్ కాబడి ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) (పార్టీ పేరు) ని రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2016 యొక్క నిబంధనలకు లోబడి అదే గడియారం గుర్తుతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఆ పార్టీ అధ్యక్షులు / జనరల్ సెక్రెటరీ అయిన శ్రీ / శ్రీమతి / కుమారి సునీల్ జాదవ్ (రాష్ట్ర అధ్యక్షులు) గారు అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఆ పార్టీలో (1) శ్రీ / శ్రీమతి / కుమారి సునీల్ జాదవ్ (రాష్ట్ర అధ్యక్షులు) గారు, (2) శ్రీ / శ్రీమతి / కుమారి చెప్యాల రమాదేవి (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) గారు, (3) శ్రీ / శ్రీమతి / కుమారి స్వప్న జాదవ్ (రాష్ట్ర ఉపాధ్యక్షురాలు) గారు, (4) శ్రీ / శ్రీమతి / కుమారి లక్ష్మీ జాదవ్ (రాష్ట్ర కోశాధికారి) గారు రాష్ట్ర ప్రధాన కార్యాలయము చిరునామా: 1-1-1/389, సునీల్ జాదవ్ చౌరస్తా, న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, వినాయకనగర్, నిజామాబాద్ దక్షిణ మండలము, జిల్లా నిజామాబాద్ 503001, తెలంగాణ రాష్ట్ర, భారతదేశము. ప్రధాన కార్యవర్గ సభ్యులు, సదరు పార్టీ రిజిస్ట్రేషను పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టిజిసిపి భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ -500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలేమీ రానియెడల, తెలంగాణ రాష్ట్రమునలో పార్టీల ప్రాతిపదికగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) (పార్టీ పేరు) ను రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయుచూ గడియారం గుర్తును ఆ పార్టీకి కేటాయిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతుంది.
సునీల్ జాదవ్
తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు
నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి)
(రాజకీయ పార్టీ పేరు)

వార్త

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.

-ఆస్కార్ వైల్డ్

# పులుల సంరక్షణ గణనతో సరి!

ప్రకృతిలో ఉన్న జీవ జాతులు పర్యావరణసమతుల్యతకు దోహద పడతాయన్న విషయం తెలిసిందే. సంచార సరళిలో జీవించే జనాభా, ఎక్కడో దట్టమైన అడవుల్లో కనుచూపు మేరకు చిక్కకుండా తప్పించుకునే జంతు జాతుల లెక్కలు తేల్చాలంటే మామూలుగా అంచనాలకు అందే విషయంకాదు. దేశవ్యాప్తంగా అడవుల్లో సంచరించే పులుల సంఖ్య ఏ మేరకు ఉందో చెప్పనలవికాదు. పర్యావరణానికి పులులకు అవినాభావ సంబంధం ఉన్న విషయం తెలిసిందే. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతి విధ్వంసంలో భాగంగా అడవులను, కొండలను ధ్వంసం చేసేక్రమంలో అడవుల్లో దాక్కున్నపులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి!, అంటూ జనం పరుగులు పెడుతున్నారు. అడవులు చక్కగా ఉన్నంతకాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్త జంతుజాలం అడవులను వదిలిపెట్టి రాలేదు. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరుకోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుష్యులను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల అస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజా జీవనాన్ని భయకంపితం చేస్తున్నాయి. కాగా ఇటీవల పులుల పాదముద్రల ఆచూకీ, లేదా పులులు మైదాన ప్రాంతాలలో తిరుగుతున్నాయన్న జాడలు కన్పిస్తున్నాయి. అందుచే ఎక్కడి పులులు ఎక్కడికి వస్తున్నాయో తెలియదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపాదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారం బాగా పెరిగింది. అలా అటవీ అధికారుల లెక్కల ప్రకారంఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త అవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడో బాలో పులుల సంతతి పెరిగిపోవడం. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగు పెడుతున్నాయని అంచనా వేసింది. అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండురాష్ట్రాల సరిహద్దులు దగ్గరగాఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయి. ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలిక లను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. పులుల సంచారం పెరగడంతోపాటు అప్రమత్తం అయ్యారు. ఇలా కంటి చూపుకందకుండా పారిపోయే పులుల సంగతి పసి కట్టాలన్నా అవి ఎక్కడ ఉన్నాయో, ఎన్నెసి ఉన్నాయో ఆచూకీ తెలియాల్సిందే. ఆ రోజులు రానేవచ్చాయి. ప్రతి నాలుగేళ్లకు జాతీయ పులుల సంరక్షణ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే పులుల గణనకు వేళయింది. ఏదోకాకులు లెక్కల మాదిరి కాకుండా నిర్దిష్టంగా ఎన్నిఉన్నాయో గుర్తించాలదన్న లక్ష్యంతోపాటు వాటి అవసరాల గురించి కూడా సర్వేలోమినహాయిస్తారు. సాంకేతి కతతో పాటు అడవుల్లో ఉన్న జీవజాలం వాటికి తగిన ఆహారం, దొరకుదల వంటి అంశాలన్నీ ఇప్పటి సర్వేలో తేలుతాయి. జంతుజాలానికి ఆహార భద్రత వంటి అంశాల ప్రాముఖ్యత తదితర గమనించదగిన అన్ని విషయాలు ఇందులో ఇమిడి ఉంటాయి. ఇప్పుడున్నది కేవలం పులుల గణాంక సేకరణకే పరిమితం కాదు. ఇది ఈ ప్రపంచం లోనే అతిపెద్ద వన్యప్రాణుల సర్వే భావించాలి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తు అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించుకునే క్రమంలో పులులనుకూడా కాపాడుకోవాల్సి ఉంది. ఈ జాతి మనుగడ సాగించేలా పరిస్థితులు కల్పించాలి. పులులను ఉచ్చులో పడేసిచంపడం, కరెంట్ తీగల పెట్టడంలా చర్యలు తీవ్రంగా పరిగణించాలి. జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలోప్రత్యేక పరిస్థితులను ఆకళింపు చేసుకుని సర్వే ప్రారంభిస్తున్నారు. ప్రపంచంలోనే అడవుల్లో ఉన్నపులుల జానాభాలో ఎక్కువ భారత్‌లోనే ఉన్నాయని ఇప్పటికే అంచనాలున్నాయి. 2022 నాటికి 3967 పులులుండగా తాజాసర్వేలో పులులసంఖ్య ఏపాటిదో తెలుస్తుంది. అప్పుడే పులల సంరక్షణ, నివాస కల్పన వంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోదగిన అంశాలు తీసుకోవచ్చు.

పువ్వులోని సువాసన, మనిషిలోని ప్రతిభ ఎంత దాచినా దాగవు.



మెకాలే

మంచివాడు కావాలంటే మంచి మనసుండాలి. అది తనలో ఉండాలే తప్ప మరొకరు ఇచ్చేదికాదు.



సెయింట్ అగస్టిన్

# ప్రజావాక్కు



### ఇతర దేశాల జోక్యమెందుకు?

ఇరాన్‌లో కొన్ని సామాజిక సమస్యల మీద అంతర్యుద్ధం కొన్ని ఏళ్ళుగా జరుగుతున్నాఅదిఆదేశానికి సంబంధించిన విషయం. ఇతరదేశాల జోక్యం ఎంతవరకంటే శాంతి పునరుద్ధరణ చేయుమని సలహాయివ్వడం వరకే. ఇంకా ఇతర కారణాలు చెప్పి ఇరాన్‌మీద అమెరికా కాలుదువ్వుతోంది. అక్కడ పరిపాలకుల నిరకుశత్వానికి విసిగి వేసారి బహిరంగ ప్రదేశానికి వచ్చి నిరసన తెలుపుతున్న వందలాది మందినిసైనికులు తుపాకి బుల్లెట్లకు బలియివ్వడం ఘోరమైన నేరం. అమెరికాతో యుద్ధానికైనాచర్చలకైనా సిద్ధమని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. నోబెల్ శాంతి బహుమతి కోసం తపించిపోతున్న ట్రంప్ రానురాను యుద్ధోన్మాదిగా రూపాంతరం చెందుతున్నారనిపిస్తోంది.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### చర్యలు చేపట్టాలి

ఇటీవల తాజాగా సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజల ప్రయాణాలు విపరీతంగా పెరిగిన కారణంగా, స్లీపర్ రిజర్వేషన్ దొరకని వారు ఆర్డినరీ బోగీలలో పూర్తిగా పెట్టే నిండి ఏమాత్రంకదిలే చోటులేని పరిస్థితి ఎదుర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే 12 జనసాధారణ అన్రెసర్వ్ రైళ్ళను విజయవాడ నుండి విశాఖకు నడిపారు. ఇది చాలా మంచిది. తాత్కాలికంగా పెట్టిన వీటిలో కొన్ని కొనసాగితే పాసింజర్ రైళ్లతో పాటు సాధారణ ప్రయాణీకులు తక్కువ ఖర్చుతో వారి గమ్యం చేరుకోవడానికి అదనపు అవకాశం దొరుకుతుంది. రైల్వే ఉన్నతాధికారులు వారి పరిధిలో చర్యలు చేపడితే సాధ్యం కావొచ్చు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### స్టార్టప్ వ్యవస్థకు కొత్త దిశ

ప్రభుత్వ ప్రధానపారిశ్రామికోత్పత్తి ప్రోత్సాహక కార్యక్రమం పదేళ్ల మైలురాయిని చేరుకున్న ఈ సమయంలో, భారతదేశంలోని నూతన వ్యాపార వ్యవస్థను తిరిగి పరిశీలించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో కొన్నివందల నూతనసంస్థలతోమొదలైన ఈ ప్రయాణం, నేడు లక్షల సంఖ్యలో నూతన వ్యాపార యత్నాలకు విస్తరించింది. ఈవ్యవస్థ కోట్లాదిఉపాధి అవకాశాలను సృష్టించి, ప్రపంచంలో అగ్రగణ్య స్థానాన్ని సంపాదించింది. ఈ విజయంతోనే తృప్తిపడడం భవిష్యత్తుకు హానికరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### చలాన్.. ఖాతా ఖాళీ!

ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలు చర్చకు వస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన ట్రాఫిక్ చలాన్ల ఆటోడెబిట్ విధానం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే వాహన యజమాని బ్యాంకుఖాతా నుంచి జరిమానా స్వయంచాలకంగా డెబిట్ చేయాలన్నది ఈ ఆలోచన సారాంశం. ఈ విధానానికి మద్దతు ఇచ్చేవారు, ప్రస్తుతం చలాన్లు పడినా వాటిని పట్టించుకోని పరిస్థితి ఉందని, రాయితీలు–డిస్కౌంట్ల వల్ల నిబంధనలకు విలువ తగ్గిందని అంటున్నారు. ఆటో డెబిట్ అమలైతే ఉల్లంఘనలు తగ్గుతాయనీ, ట్రాఫిక్ క్రమశిక్షణ పెరుగుతుందనీ వారు భావిస్తున్నారు. సాంకేతికత ఆధారంగాపాలనను కఠినంగా చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశంలో ఇది భాగమేనని కూడా చెబుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై అభ్యంతరాలు కూడా లేకపోలేదు. ప్రజల అనుమతి లేకుండా బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు తీసుకోవడం సరైనదేనా?

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### సామాజిక రుగ్మతలను అరికట్టాలి

జంతు హింస నిరోధక చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 అమలులో ఉన్నప్పటి కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు కట్టి సంక్రాంతి పండుగ దినాల్లో లక్షల్లో ఆ మాటకొస్తే కోట్లలో పందేలు కట్టి కోడి పందేలు ఆడటం కొన్ని దశాబ్దాలగా ముఖ్యంగా ఆంధ్రాజిల్లాలలో జరుగుతూ ఉంటాయి. ఈ జాడ్యం మొదట భీమవరంలో ప్రారంభమై దాదాపు అన్ని జిల్లాలకు వ్యాపించింది. ఇతర దక్షిణాది రాష్ట్రాలవారు కూడా ఆంధ్ర జిల్లాలకు చేరి ఈ క్రూరఆటలో పాల్గొంటారు. రాజకీయ నాయకులు పాల్గొనే ఈ ఆటలను పోలీసుల బందోబస్తుతో జరుగుతుండడం విశేషం. చట్టాలు మార్చినా అనేక సామాజిక రుగ్మతలను అరికట్టలేకపోవడం మిక్కిలి విచారకరం.

- డా.ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### నూతన విద్యావిధానం అవసరం

ప్రధాన మంత్రి నరేంద్రమోడీమెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారతదేశం నుండి పూర్తిగా తొలగించాల నే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. ఇదిభారతఆత్మగౌరవాన్నిపునరుద్ధరించేసాహసోపేతప్రయత్నం. ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతోంది. అందువలన ప్రపంచధోరణికి అనుగుణంగా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వేదిక — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నైపుణ్యాల పోరులో యువత రాణించాలంటే!

**వికసిత్ భారత్ ప్రవేశపెట్టిన అధిష్టాన్ బిల్లు 2025 ప్రకారం ఉన్నత విద్యలో కొన్ని సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, టెక్నికల్ సంస్థలు, ఓపెన్ లేదా దూరవిద్యనందించే విశ్వవిద్యాలయాలు ఒకే గొడుగు క్రిందకుతెచ్చి వికసిత భారత్ అధిష్టాన్ పేరుతో వివిధవిద్యా కౌన్సిళ్లను ఒకే లక్ష్యంతో పనిచేసేలా ప్రతిపాదించింది. ఆయా విద్యా సంస్థలు స్వయంప్రతిపత్తితో వివిధ విభిన్న అంశాలను క్రోడీకరించి యువతకు ఉపకరించుకోర్సులను రూపొందించి అమలు చేయడం, పరిశోధనల కు పెద్ద పీట వేయడం, ప్రపంచంలో స్థానికంగా ఉన్న అత్యుత్తమ నమూనాలను ప్రదర్శించి తద్వారా గ్లోబల్, లోకల్ అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన అందరికీ అనువైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్గించేలా ప్రణాళిక రచించింది. ఇది ఫలిస్తే భారత దేశం అన్ని రంగాలలోను రాణించి స్వయం సమృద్ధి దిశగా పయనించవచ్చు.**



మల్లాడి శ్రీనగేష్

సిఐఐ నివేదిక ప్రకారం 23 దేశాలలో సుమారు 83 మిలియన్ మంది సమర్థత కలిగిన నిపుణుల కొరత ఉందని వెల్లడైంది. ఈ లోటును భర్తీ చేయగలిగితే 2028 సంవత్సరం నాటికి 11.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయ వనరులను ప్రపంచ స్థూల స్థూల దేశీయోత్పత్తికి అందించే సామర్థ్యాన్ని సంతరించుకోవచ్చని నివేదిక అంచనా వేసింది. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2025 ప్రకారం భారత దేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. 65 శాతం దేశ జనాభా 35 సంవత్సరాల వయసు లోపు వారే. అలాగే దేశ ప్రగతికి, సంపతికి పునాదిరాళ్ళు. కానీ ఉన్న ఉద్యోగ మార్కెట్‌కు యువతకు కలిగియున్న నైపుణ్యాలకు పొంతన లేక సుమారు 45 శాతం మంది డిగ్రీ కలిగిన యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని నివేదికలు చెబుతున్నాయి. వికసిత భారత్ 2047 నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రధాన భూమిక దేశ యువత, వారి చదువు. నైపుణ్యాల ద్వారానే ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించవచ్చునని దీనికి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ ప్రభుత్వేర, ఆయా రంగాలలో రాణించిన సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి అనిని మేధావుల అభిప్రాయం. నైపుణ్యం కలిగిన యువత, సిబ్బంది కోసం ప్రపంచమంతా ఎదురు చూస్తోంది. మారుతున్న కాలంతో మెరుగైన విపణిలో పయనించడానికి ప్రస్తుత యువజనం ఉర్రుతలూగుతున్నప్పటికీ కృతిమమేథయే రాబోవు కాలానికి ప్రగతి సూచికయనే మీమాంసలోను, భయంలోనూ ఉండిపోతున్నారు. దేశానికే వెన్నెముక వలె నిలబడి యున్న యువతకు అనువైన, మానవ మేధస్సును మరింత పునరుజీవింపచేయడానికి ఉపకరించే తగిన నైపుణ్యాలను, శిక్షణలు అందించడానికి దోహదపడు సంస్థలను, వ్యవస్థను, కరికుల సంస్కరణలను త్వరిత గతిన ఏర్పరచకపోతే సమర్థవంతమైన శ్రామికశక్తిని సమకూర్చుకోవడం తక్షణ కరవ్యం. గోబల్ స్థాయిలో అవసరానికి కావలసిన సమర్థవంతమైన పనితనంతో నిండివున్న జన శాతం చాలా తక్కువగా కనిపిస్తోందని గోబల్ నివేదికలు వెలడిస్తున్నాయి. సి.ఐ.ఐ నివేదిక ప్రకారం 23 దేశాలలో సుమారు 83 మిలియన్ మంది నెపుణ్యం కలిగిన వ్యక్తుల కొరత ఉందని వెల్డైంది. ఈ లోటు త్వరితగతిన నివృత్తి చేయగలిగితే 2028 సంవత్సరం నాటికి 11.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయ వనరులను ప్రపంచ స్థూల దేశీయోత్పతికి అందించే సామర్థ్యాన్ని సంతరించుకోవచ్చని నివేదికఅంచనా వేసింది. అంతేకాక భారత్ లాంటి యువభరిత దేశానికి సంకేతాలను అందిస్తూనే వుంది. ఈ అవకాశాలు, ఆశించిన ఫలితాల దృష్ట్యా నైపుణ్యాల మెరుగుదలయనేది అతి అత్యవసరం. ప్రస్తుత తరుణంలో ఒక ప్రత్యామ్నాయం కాదు అనివార్యంగా గుర్తెరగాలి. దీనివల్ల కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి పోటీని ఎదుర్కోవడానికి, వినూత్న ఆవిష్కరణలకు తెరతీయడానికి తద్వారా సుస్థిరాభివృద్ధి దిశగా



ప్రణాళికలు రచించుకోవడానికి మార్గం సుగమమవుతుంది. ఎందుకనగా యూరప్, జపాన్, సౌత్ కొరియా లాంటి దేశాలతో పోలిస్తే భారత దేశంలో యువత శాతం 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు సుమారు 65 శాతంగా చెప్పొచ్చు. అంటే దేశంలో యువత నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే నైపుణ్యాలతో కూడిన అనుభవాత్మక విద్య మంచి సంభాషణా చాతుర్యం, సహకారం ప్రతిపాదికతో జట్టు కార్యక్రమాలు వంటి అంశాలను జోడించి వినూత్న విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలి. నూతన విద్యా విధానం 2020 ఈ విషయాలకు వెసులుబాటు కల్పించినప్పటికీ ఆచరణలో, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల అధ్యాపకుల ఎంపికలో, మౌలిక వసతుల కల్పనలో, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లేకపోతే పోటీ ప్రపంచంలోయువత నెగ్గుకు రావడం కష్టతరమే. సాంప్రదాయ రీతి బోధనకు స్వస్తిపలికి కృత్యాధార, డిజిటల్ బోధన, పీర్ లెర్నింగ్, లైబ్రరీ వినియోగం, స్టెమ్ ఆధారిత అనుభవాత్మక విద్యను అందుబాటులో ఉంచడం తప్పనిసరి. ఈ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపుదలలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను వెచ్చించి వారికీ వినూత్న బోధన విధానాలపై ప్రత్యేక శిక్షణలు, సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్) వివిధ రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా సబ్జెక్టు ఉపాధ్యాయుల నైపుణ్యాలను పంచుకోవడానికి, పెంచుకోవడానికి, ప్రయోగాత్మక విద్యను బోధించడానికి ఏర్పరచిన పెడోగోజికల్ ఫోరంలు, స్టెమ్ ఆధారిత విద్య ప్రయోగ ఫలితాల ఆధారంగా ఏర్పరచిన ఉత్సహవంతులైన సబ్జెక్టు ఆధారిత ఉపాధ్యాయుల పెడోగోజికల్ ఫోరమ్‌లను ఏర్పరచడం వారికి తగిన శిక్షణ, అదనపు కోర్సులను నేర్చుకొనే వెసులుబాటు కల్పించడం, క్షేత్ర స్థాయి. అవగాహన ద్వారా తద్వారా ఉపాధ్యాయులకు వృత్తిపరమైన నైపుణ్యాలను అందించి సంసిద్ధపరచడం తప్పనిసరి. మరొక కోణంలోపునాది నుండి నైపుణ్యాలకు తగిన కరికులం, అమలుకు కార్యాచరణ సరిపడినంత వసతుల, అధ్యాపకుల నియామకం, వారికి నిరంతర శిక్షణా తరగతులతో నైపుణ్యాల మెరుగుదల నిరంతర మూల్యాంకనం, పునఃశిక్షణ వంటి కార్యక్రమాలతో యువతకు జవసత్వాలు నింపే, గౌరవప్రదమైన ఉపాధి దొరికే అవకాశాలకు శీకారం చుట్టాలి. అంతేకాదు అందుబాటులో వున్న అవకాశాల గురించి పూర్తి సమాచారాన్ని అందించడానికి తగిన ఏర్పాట్లు చైతన్య కార్యక్రమాలతో యువతను మేల్కొల్పడం, కౌన్సిలింగ్ వంటి ప్రక్రియలతో మార్గదర్శకత్వాన్ని కూడా అందించడం ప్రభుత్వ ప్రధాన భూమికగా గుర్తించాలి. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రచించి యువత భవితకు భరోసా కల్పించాలి. ఈ అంశాలనే పరిగణనలోకి తీసుకొని ఈమధ్యకాలంలో వికసిత్ భారత్ ప్రవేశపెట్టిన అధిష్టాన్ బిల్లు 2025ప్రకారం ఉన్నత విద్యలో కొన్ని సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, టెక్నికల్ సంస్థలు, ఓపెన్ లేదా దూరవిద్యనందించే విశ్వ విద్యాలయాలు ఒకే గొడుగు క్రిందకుతెచ్చి వికసిత భారత్ అధిష్టాన్ పేరుతో వివిధవిద్యా కౌన్సిళ్లను ఒకే లక్ష్యంతో పనిచేసేలా ప్రతిపాదించింది. ఆయా విద్యా సంస్థలు స్వయంప్రతిపత్తితో వివిధ విభిన్న అంశాలను క్రోడీకరించి యువతకు ఉపకరించుకోర్సులను రూపొందించి అమలు చేయడం, పరిశోధనలకు పెద్ద పీట వేయడం, ప్రపంచంలో స్థానికంగా ఉన్న అత్యుత్తమ నమూనాలను ప్రదర్శించి తద్వారా గ్లోబల్, లోకల్ అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన అందరికీ అనువైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్గించేలా ప్రణాళిక రచించింది. ఇది ఫలిస్తే భారత దేశం అన్ని రంగాలలోను రాణించి స్వయం సమృద్ధి దిశగా పయనించవచ్చు. •

# నదుల ఒడ్డునే వర్ధిల్లుతున్న దేశ రాజధానులు

అన్నవరపు బ్రహ్మయ్య

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల రాజధానులు నదుల ఒడ్డునే కొనసాగుతున్నాయి. బ్రిటన్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నది ఒడ్డున, అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. పొటమ్యాక్ నది ఒడ్డున, ఆస్ట్రేలియా రాజధాని నగరం డార్లింగ్ నది ఒడ్డున, బ్యాంకాక్ రాజధాని థాయ్‌లాండ్ దావో ఫరయా అనే నది ఒడ్డున, ఇరాక్ రాజధాని బాగ్దాద్ నగరం టిగ్రీస్ నదిఒడ్డున వున్నాయి. అంతెందుకు మనదేశ రాజధాని న్యూఢిల్లీ యుమునా నది ఒడ్డున, హైదరాబాద్ నగరం మూసీ నది ఒడ్డున వున్నాయి. ఒక చారిత్రికంగా చూస్తే నైలు నది నాగరికత, సింధూనది నాగరికత, అమెజాన్ నది ప్రవాహ ప్రాంతాలలో వర్ధిల్లిన నాగరికతలుఎంత ఉన్నతమైనవో చెప్పనవసరం లేదు. నిజం చెప్పాలంటేఅమరావతిలో ప్రస్తుతం సెక్రటేరియట్, హైకోర్టు భవనాలు కృష్ణా నదికి దాదాపు 8 నుంచి 10 కి.మీ. దూరంలో వున్నాయి. నదీగర్భం, నది ఒడ్డు. నదీ పరివాహక ప్రాంతం అనడానికి కూడా వీలులేదు. ఇంకా చెప్పాలంటే సెక్రటేరియట్ నిర్మిస్తున్న ప్రాంతంలో 20గ్రామాలలో ప్రజలు కొన్ని వందల సంవత్సరాలు జీవిస్తున్నారు. అసలు కాశీ నగరం గంగా నది ఒడ్డున, విజయవాడ నగరం కృష్ణానది ఒడ్డున, రాజమండ్రి గోదావరి నది ఒడ్డున వుంది. అసలు భారతదేశంలో గంగా, కృష్ణా, గోదావరి, పెన్నా వంటి నదుల పరివాహక ప్రాంతాలలో వేల గ్రామాలలో ప్రజలు జీవిస్తున్నారు. ఈస్థితిలో రాజధాని అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులుజగన్మోహన రెడ్డి 'నదీ గర్భంలో రాజధాని' అంటూ చేసిన వ్యాఖ్యాలు ఆయన అజ్ఞానాన్ని తెలియచేస్తోందా? లేక తాము బీడుపెట్టాలని భావించిన అమరావతి ప్రాంతం రోజుకో తీరుగా వృద్ధి చెందడాన్ని చూపి ఓర్వలేక చిత్తచాపల్యంతో వ్యవహారిస్తున్నట్టుగా వుంది. అయితే రాజధాని అమరావతికి జగన్మోహనరెడ్డి వ్యతిరేకం కాదంటూ ఆ పార్టీ నాయకులు ప్రజలను అమాయకులనుకొని తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేయడం వింతగా వుంది. జగన్ రాజధానిగా అమరావతి పనికి రాదంటూ స్పష్టంగా ప్రకటించిన తర్వాత కూడా ప్రజల చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థితిలో అసలు నదీ పరివాహక ప్రాంతం, నది ఒడ్డు, నది గర్భం అనే పదాలకు జగన్మోహనరెడ్డికి అవగాహన వుందో లేదో.. అర్థం కావడం లేదు. ఒకవేళ అవగాహవున్నా ప్రజలు తాను ఏదీమాట్లాడితే అదే నిజమనుకొంటారనే భావనతో వున్నారో అర్థం కావడం లేదు. ఒకవైపు జగన్మోహన్ రెడ్డి నదీ గర్భంలో నిర్మాణాలు చేయడం నిబంధనలకు విరుద్ధం, ఈ విషయంలలో సుప్రీమ్ కోర్టు కల్పించుకోవాలని, ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని, అయినా రాజ్యాంగలో రాజధాని ప్రస్తావనే లేదంటూ ఆయన స్పష్టంగా చెప్పారు. అయితే జగన్ వ్యాఖ్యలతో వైఎస్ఆర్ కాంగ్రెస్పట్ల ప్రజలలో పెల్లుబికిన వ్యతిరేకత గుర్తించిన ఆ పార్టీ సర్వశాఖల మంత్రిగా చెలామణి అయిన నేత తాజాగా సమర్థించడం నూతన సంవత్సరం జోక్గాఅనిపిస్తోంది. రాష్ట్రవిభజన అనంతరం నూతన రాష్ట్రంలో తొలిగా 2014లో జరిగిన అసెంబ్లీ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అమరావతిలో రాజధానికి అంగీకరిస్తున్నామని, రాజధాని నిర్మాణానికి కనీసం 30 వేల ఎకరాలు కావాలని జగన్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా 2019లో జరిగిన ఎన్నికలకు ముందు కొందరు నేతలుతమ నాయకుడు జగన్మోహనరెడ్డి రాజధాని పరిధిలోనే ఇల్లు కట్టుకొన్నారని, తాము అధికారంలోకి వస్తే రాజధానికి భూములిచ్చిన రైతులకు మరింత మేలైన సదుపాయాలిస్తామని ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాతఏడాది కూడా గడవకుండానే మూడు రాజధానులంటూ అసెంబ్లీలో తీర్మానం చేయడం, అమరావతి ఉసురు తీయడానికి చేసిన ప్రయత్నం, దాదాపు నాలుగేళ్లపాటు రాజధాని ప్రాంత రైతులుచేసిన ఉద్యమాలను తెలివిగా మరచిపోయినట్టుగాప్రవర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన భోగాపురం విమానాశ్రయానికి తానే శంకుస్థాపన చేశానని, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ తన వల్లనే వచ్చిందని జగన్మోహనరెడ్డి చెప్పు కొంటున్న ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. తాజాగా వెలిగొండప్రాజెక్ట్ చంద్రబాబు నాయుడు కారణంగానే నిర్మాణంఆగిపోయిందని చెప్పిన కొన్ని గంటలలోనే తెలంగాణకు చెందిన బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి మాట్లాడు తూ జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా తామే కోర్టుకు వెళ్లి స్టేతీసుకు వచ్చామని ప్రకటించారు. దాంతో జగన్ అబద్ధాలు చెబుతున్నారనిసామాన్యులకు కూడా అర్థం అవుతోంది. అంతేకాకుండా కలియుగ వైకుంఠంగా భావించే తిరుమలేశుని లడ్డుప్రసాదంలోకృత్రిమ నెయ్యి వాడటం, పరకామణిలో చోరికి పాల్పడిన ఉద్యోగికి మద్దతు తెలియచేయడం వంటి కారణాలవల్ల తటస్థంగా వున్న హిందువులు వైఎస్ఆర్సిపికి దూరమయ్యారు, ఈ స్థితిలో పార్టీ బతికిబట్ట కట్టే అవకాశంలేదని భావిస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా ప్రజారాజధాని అమరావతిపై మళ్లీవిషం కక్కడంతో ఓడిపోయిన దగ్గరనుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు అధికారుల ను బెదిరించడమే విధానంగా పెట్టుకొన్నట్టు కనిపిస్తోంది. ఇదేసమయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో ప్రజావ్యతిరేకమైన నిర్ణయాలు వుంటే వాటిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి రద్దుచేసే అధికారం సహజంగానే వుంటుంది. కానీ తాము అధికారంలోకి వస్తే అనుమతులు అన్ని రద్దుచేస్తామంటూ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చేవారిని కూడా బెదిరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. •

# సినిమా టిక్కెట్ ధరలు క్షేత్రస్థాయిలో దోపిడీలా?

దిడ్డి శ్రీకాంత్

సినిమా అంటే తెలుగు వారికి ఒక ఎమోషన్. ఆ ఎమోషన్‌ను క్యాష్ చేసుకునే క్రమంలో టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సినిమా ఇప్పుడు కేవలం వినోదం మాత్రమే కాదు, అదొక ఖరీదైన వ్యసనంగా మారిపోయింది. ఒకప్పుడు సామాన్యుడికి అతి తక్కువ ఖర్చుతో దొరికే ఏకైక ఉపశమనం సినిమా. కానీ నేడు, థియేటర్ గడప తొక్కాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సినిమా టిక్కెట్ల ధరల పెంపు, ప్రభుత్వ జీవోలు (బిప్పీ), పైరసీ వెబ్‌సైట్ల పట్ల ప్రజల మొగ్గు వంటి అంశాలు సమాజంలో ఒక లోతైన చర్చకు దారితీస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ అంటేనే థియేటర్ల వద్ద సందడి, స్టార్ హీరోల భారీ బడ్జెట్ సినిమాల జాతర అయితే ఈ ఏడాది వినోదం సామాన్యుడికి మరింత భారం అయింది. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణలో ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. గతంలో సినిమా టిక్కెట్ల ధరల పెంపును, బెనిఫిట్ షోలను అడ్డుకుంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ఇటీవల డివిజన్ బెంచ్ స్టే విధించింది. ప్రభుత్వాలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సంక్రాంతి బరిలో ఉన్న భారీ చిత్రాల నిర్మాతలు టిక్కెట్ రేట్లు పెంచుకోవడానికి, స్పెషల్ షోలు వేసుకోవడానికి మార్గం సుగమమైంది. ఒక నలుగురు సభ్యులున్న మధ్య తరగతి కుటుంబం సినిమాకు వెళ్లాలంటే, టిక్కెట్ల కోసం కనీసం రెండు వేల రూపాయలు, మరి కొంత స్నాక్స్, పార్కింగ్ కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇంత మొత్తం ఖర్చును ఒక పూట వినోదం కోసం నెలవారీ బడ్జెట్‌లో కోత పెట్టాల్సి వస్తోంది. ఇది వారిపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ అధిక ధరల కారణంగా, చాలా కుటుంబాలు థియేటర్లకు వెళ్లడం మానేసి, పైరసీ సైట్లకు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు లేదా టీవీలకు పరిమితమవుతున్నాయి. ఓటీటీలు పైరసీ వైపు ప్రేక్షకులు మొగ్గు చూపడం వల్ల దీర్ఘకాలంలో చిత్ర పరిశ్రమకే నష్టం! ఈ బెనిఫిట్ షోల నిర్వహణ, టిక్కెట్ల ధరల వివాదానికి ఏడాది క్రితం హైదరాబాద్‌లోని ప్రముఖ థియేటర్‌వద్ద జరిగిన తొక్కిసలా ఘటన నిదర్శనంగా నిలిచింది. విడుదల సందర్భంగా నెలకొన్న పరిస్థితి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఉండే ధరలకు భిన్నంగా, అభిమానుల ఆనందాన్ని, హైప్‌ని సొమ్ము చేసుకునేలా టిక్కెట్ల ధరలను ఇష్టానుసారంగాపెంచేశారు. అభిమానుల అతి ఉత్సాహం, ఆనందం ఒకవైపు ఉంటే.. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని థియేటర్ యాజమాన్యాలు, డిస్ట్రిబ్యూటర్లు చేస్తున్న వ్యాపారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇష్టానుసారం ప్రదర్శించిన బెనిఫిట్



షో, స్టార్ల హైప్, అభిమానుల వెర్రి ఆనందం విపరీత పరిణామాల కారణంగా జరిగిన సినిమా తొక్కిసలాట ఘటనలో ఓ మహిళా అక్కడికక్కడే మృతి చెందగా, ఆవిడ కుమారుడు తీవ్ర అస్వస్థతతో ప్రాణాల నుండి బయటపడ్డాడు. ఈ సమస్య కేవలం సినిమా పరిశ్రమకే పరిమితం కాలేదు. దీని తీవ్రత ప్రభుత్వాన్ని కూడా కదిలించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ ప్రయోజనాల కోసం సినిమా టిక్కెట్ల రేట్లు పెంచి ప్రేక్షకులను దోచుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ముఖ్యంగా టిక్కెట్ల పెంపు, బెనిఫిట్ షోల పేరిట జరుగుతున్న దోపిడీపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పిన మాటలు ఒక ఆశాజనక మార్పుగా కనిపించాయి. అయితే, క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం ఇంకా అలాగే ఉంది. ప్రభుత్వం గతంలో రేట్లు పెంచవద్దని అసెంబ్లీ సాక్షిగా హెచ్చరించినా, తాజాగా సినిమాలకు ఇచ్చిన ధరల పెంపు ఉత్తర్వులు ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం! ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు పొంది రేట్లు పెంచుతున్న క్రమంలో, అది కేవలం బడా నిర్మాతలకే లాభం చేకూరుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సగటు అభిమానిపైరసీ వైపు మొగ్గు చూపుతున్నారు. థియేటర్లలో టిక్కెట్ రేట్లు భరించలేనంతగా పెరగడం వల్లే సామాన్యులు ఉచితంగా సినిమాలు అందించే పైరసీ సైట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఉచితంగా సినిమాలు అందించే అడ్మినిస్ట్రేటర్ అరెస్ట్ అయినప్పుడు, సోషల్ మీడియాలో నెటిజన్లు అతనికి మద్దతు తెలపడం చర్చనీయాంశమైంది. 'వందల రూపాయల టిక్కెట్ కొనలేని మాకు ఉచిత వినోదం అందించిన వాడు నేరస్తుడా?' అనే ప్రశ్నే అక్కడ వినిపించింది. ఇది వ్యవస్థ వైఫల్యానికి ఒక సంకేతం. చట్టపరంగా పైరసీ తప్పు అయినప్పటికీ, అధిక ధరలు సామాన్యుడిని ఆ వైపు నెడుతున్నాయనేది నగ్న సత్యం. ఇది ఒక రకంగా సినిమా పరిశ్రమకు ప్రభుత్వాలకు చెంపపెట్టు. ప్రేక్షకుడు పైరసీని ప్రేమిస్తున్నాడంటే, దానర్థం సినిమా పరిశ్రమ సామాన్యుడికి దూరం అవుతోందనే కదా?! సినిమా బెనిఫిట్ షోలు, టిక్కెట్ల ధరల సమస్యకు తక్షణమే ఒక శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. పెద్ద సినిమాలు వచ్చినప్పుడు ప్రభుత్వం జీవోలు ఇచ్చి రేట్లు పెంచడానికి సహకరించడం కాకుండా, కనీస ధరలను నియంత్రించాల్సిన బాధ్యత తీసుకోవాలి. అదే సమయంలో, సినిమా పరిశ్రమ కూడా సామాన్య ప్రేక్ష కుడి జేబుకు చిల్లు పడకుండా, అందరికీ అందుబాటులో ఉండేలా టిక్కెట్ల ధరలను నిర్ణయించాలి. అప్పుడే సినిమా పరిశ్రమ మనుగడ సాగుతుంది, ప్రేక్షకుల ఆదరణ నిలబడుతుంది. కేవలం 'స్టార్‌డమ్' పేరుతో థియేటర్లలో దోపిడీ కొనసాగితే, భవిష్యత్తులో థియేటర్లు ఖాళీగా ఉండి, ప్రజలు పైరసీ వెబ్ సైట్ల వైపే చూస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పరిశ్రమ కలిసి కూర్చుని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుని, ఈ టిక్కెట్ల ధరల చిచ్చుకు శాశ్వత తెరదించాలి. •

# ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇక గద్దె దిగవలసిందే : ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 18:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఇరాన్ ప్రజలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ కొనసాగుతోన్న హింసకు ఖమేనీనే కారణమని ఆరోపించారు. నాయకుడి స్థానంలో ఉన్న ఖమేనీ వేలాది మంది ప్రజలను చంపుతూ.. తన దేశాన్ని తనే నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆయనకు నాయకత్వం కట్టబెట్టింది ఇటువంటి భయాలు, మరణాలు సృష్టించడానికి కాదని అన్నారు. ఇంతమంది ప్రాణాలు తీసిన సుప్రీం లీడర్ ఇరాన్‌ను పాలించడానికి అనర్హుడని పేర్కొన్నారు. ఇక ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని ఆ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇరాన్‌లో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఖమేనీ ఆరోపించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం ఖమేనీ మాట్లాడుతూ.. దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారు అమెరికా కోసం పనిచేసిన వారేనని తెలిపారు. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా ఈ కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు.

**ఆందోళనలు కొనసాగించండి : యువరాజు రెజా పహ్లావి**

ఇరాన్‌లో కొనసాగుతోన్న నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండగా ఉంటారని పేర్కొన్నారు. మరోవైపు ఆ దేశంలో కొనసాగుతోన్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3 వేలకుపైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# మహారాష్ట్రలో క్యాంపు రాజకీయాలు షురూ!

## కార్పొరేటర్లు అందరినీ హోటల్‌కు తరలించిన షిండేసేన



**ముంబై, జనవరి 17:** బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ముగిసి ఫలితాలు ఇలా వెలువడ్డాయో లేదో అలా ఫైవ్‌స్టార్ హోటల్ రాజకీయాలు మొదలయ్యాయి. కూటమిగా పోటీ చేసినా వెన్నుపోటు పొడుస్తారన్న భయం ఏర్పడటంతో దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌పై నాయకత్వ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు పారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన తమ పార్టీ కార్పొరేటర్లందరూ బాంద్రాలోని ఫైవ్‌స్టార్ హోటల్‌కు రావాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు. ఇతర పార్టీల వారు తమ కార్పొరేటర్లతో బేరసారాలు జరపకుండా, ప్రలోభాలకు గురి చేయకుండా వారందరినీ తన వద్ద ఉంచుకునేందుకు షిండే ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో బీజెపి, శివసేన కలిసి మహాయుతి కూటమిగా పోటీ చేశాయి. అయితే కూటమిలో బీజెపి తర్వాత 29 సీట్లతో శివసేన అతిపెద్ద పార్టీగా నిలిచింది. తమ పార్టీ సహకారం లేకుండా బీఎంసీ మేయర్ స్థానం దక్కించుకునే అవకాశంబిజెపికి లేకపోవడంతో, ఆపార్టీ సహా ఇతర పార్టీల వారు ఎలాంటి అవకాశం తీసుకోకుండా ఆయన తన పార్టీ కార్పొరేటర్లందరినీ ఐక్యంగా ఉంచాలని ఫైవ్‌స్టార్ హోటల్‌కు వారిని తరలించారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పాగా వేసింది. ముంబైలో మూడు దశాబ్దాల శివసేన ఆధిపత్యానికి గండిపడింది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో 25 చోట్ల బిజెపి గెలుపొందింది. ఈ ఎన్నికల్లో ఎన్సీపీ కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) తొలిసారి ఈ ఎన్నికల్లో కలిసి పోటీచేశారు. సంప్రదాయంగా తమకు పట్టున్న ప్రాంతంలో కూడా వీరు ఈ ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు. 24 మున్సిపాల్టీలలో ఎన్సీపీ (ఎస్పీ) కనీసం ఖాతా కూడా తెరవలేక పోయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైనా స్వల్ప ఊరట లభించింది. రాష్ట్రంలోని నాలుగు మున్సిపాల్టీలలో ఏకైక అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించగా, ఐదు కార్పొరేషన్లలో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. మహారాష్ట్ర అంతటా మజ్లిస్ పార్టీకి 125 స్థానాలు లభించాయి. మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు జైలులోనుంచి గెలుపొందారు.

వీరు పుణె, షోలాపూర్, జల్గావ్, జాల్నా మున్సిపాలిటీల్లో పోటీచేశారు. గెలుపొందిన నేరచరితుల్లో గ్యాంగ్‌స్టర్ల బంధువులు, గౌరిలంకేశ్ హత్య కేసులో నిందితుడు కూడా ఉన్నారు. గ్యాంగ్‌స్టర్ సూర్యకాంత్ అలియాస్ బందు అందేకర్ కోడలు సోనాలి, మరదలు లక్ష్మి పుణె కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. వీరిద్దరూ తమ మనవడి హత్య కేసులో జైలులో ఉన్నారు. జర్నలిస్ట్ గౌరిలంకేశ్ హత్య కేసులో నిందితుడు శ్రీకాంత్ పంగారర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

# గాజా బోర్డ్ ఆఫ్‌పీస్ సభ్యత్వానికి రూ.9087కోట్ల ఫీజు!

**వాషింగ్టన్, జనవరి 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో సభ్యత్వం పొందాలంటే దేశాలు 1 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ. 9,087 కోట్లు) చెల్లించాల్సి ఉంటుందంటూ వచ్చిన వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ ఆరోపణలను వైట్ హౌస్ తీవ్రంగా ఖండించింది. ఈ నివేదికలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, బోర్డులో చేరడానికి ఎలాంటి కనీస సభ్యత్వ రుసుము లేదని స్పష్టం చేసింది. ఈ బోర్డుకు సంబంధించిన ముసాయిదా చార్టర్‌లో ఈ విషయం ప్రస్తావించారు. బోర్డుకు తొలి ఛైర్మన్‌గా ట్రంప్ వ్యవహరిస్తారని, సభ్యులను ఆహ్వానించే అంశంపై ఆయనే తుది నిర్ణయం తీసుకుంటారని అందులో ఉంది. చార్టర్ అమల్లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోగా 1 బిలియన్ డాలర్లకు పైగా నగదు నిధులను అందించే దేశాలకు మూడేళ్ల సభ్యత్వ కాలపరిమితి వర్తించదని, వారికి శాశ్వత సభ్యత్వం లభిస్తుందని ఆ ముసాయిదాలో పేర్కొన్నట్టు బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ఈప్రచారంపై స్పందించిన వైట్ హౌస్ "ఇది తప్పుదోవ పట్టించేది. శాంతి బోర్డులో చేరడానికి కనీస సభ్యత్వ రుసుము లేదు" అని పేర్కొంది. "శాంతి, భద్రత, శ్రేయస్సు పట్ల లోతైన నిబద్ధతను ప్రదర్శించే భాగస్వామ్య దేశాలకు శాశ్వత సభ్యత్వం అందించేందుకే ఈ నిబంధన" అని వివరణ ఇచ్చింది. ట్రంప్ ఈ బోర్డు సభ్యుల వివరాలను ప్రకటించారు. ఇందులో తన అల్లుడు జారెడ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వ్యాపార భాగస్వామి స్టీవ్ విట్కాఫ్ వంటి అత్యంత సన్నిహితులకు చోటు కల్పించారు. గాజాలో భద్రతను పర్యవేక్షించి, హమాస్ స్థానంలో కొత్త పోలీస్ దళాన్ని ఏర్పాటు చేసేందుకు ఖిఅంతర్జాతీయ స్థిరీకరణ దళం ఏర్పాటు చేసి, దానికి యూఎస్ మేజర్ జనరల్ జాస్పర్ జెఫర్స్‌ను అధిపతిగా నియమించారు. దీంతో పాటు ఈజిప్ట్, ఖతార్, యూఏఈ, టర్కీ ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక సలహా మండలిని కూడా ఏర్పాటు చేశారు.

# 23న తమిళనాడులో ప్రధాని పర్యటన




**- మదురాంతకం నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్న మోడీ**

**చెన్నై, జనవరి 18:** రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ జనవరి 23న మదురాంతకం నుంచి ప్రారంభించనున్నారు. ఈ సారి ఎలాగైనా తమిళనాడులో పాగా వేయాలని బిజెపి తహతహలాడుతోంది. అందులో భాగంగా ఇప్పటికే పలుమార్లు తమిళనాడులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించారు. అంతేగాక, ప్రతిపక్ష ఎఐఎడిఎంకెతో కలిసి ఎన్‌డిఎ కూటమిని ఏర్పాటు చేసింది. మరోవైపు సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టివికెని కూడా ఎన్‌డిఎ కూటమిలోకి ఆహ్వానిస్తోంది. ఈ విషయమై పలుమార్లు ఆ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించింది. అయితే, ఇంకా ఓ కొలిక్కిరాలేదు. ఇదిలా ఉండగా తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని బిజెపి నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ నెల 23న మదురాంతకంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు ఎన్‌డిఎ మిత్రపక్షాల నేతలను ఆహ్వానించింది.

# నాటో నుంచి అమెరికా బయటకు!

## గ్రీన్‌లాండ్‌పై అంగీకరించకపోతే ఇదే పరిస్థితి


**వాషింగ్టన్, జనవరి 18:** నాటో నుంచి అమెరికా బయటకు వచ్చే అవకాశం ఉందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడానికి నాటో మిత్ర దేశాలు మద్దతివ్వకపోతే, ఈ పరిణామం జరుగుతుందని బెదరించారు. గ్రీన్‌లాండ్‌పై నాటో తమతో చర్చలు జరుపుతున్నదని, దేశ భద్రత కోసం గ్రీన్‌లాండ్ తమకు చాలా అవసరమని చెప్పారు. అది తమ ఆధీనంలో లేకపోతే, దేశ భద్రత, ముఖ్యంగా గోల్డెన్ డోమ్ విషయంలో, పెద్ద లోపం ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంలో తనకు మద్దతివ్వని దేశాలపై టారిఫ్‌లు విధిస్తానని ఇటీవల హెచ్చరించారు.

**గ్రీన్‌లాండ్‌పై మద్దతివ్వనందుకు 10 శాతం సుంకాలు : ట్రంప్**

గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించడంలో సహకరించనందుకు డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ వంటి యూరోపియన్ దేశాలపై 10 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమలులోకి వస్తుందని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌పై ఎటువంటి ఒప్పందం కుదరకపోతే ఈ యేడాది జూన్ 1 నుంచి ఈ సుంకాలను 25 శాతానికి పెంచుతానని ఆయన హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ కోసం తాను చేస్తున్న ప్రయత్నానికి మద్దతు ఇవ్వని దేశాలపై సుంకాలు విధిస్తానని హెచ్చరించిన మరుసటి రోజే తన మిత్రులైన యూరోపియన్ దేశాలపై ట్రంప్ సుంకాల మోత మోగించారు.

# సామాజిక రుగ్మతగా మారిన కులవ్యవస్థ అంతం కావాలి

## ముందు మన మనసులు సంస్కరించుకోవాలి: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్



**ముంబయి,జనవరి 18:** సమాజంలో పాతుకుపోయిన కులవివక్ష వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, భారతీయులు ముందు తమ మనస్సుల్లోంచి కులభావాన్ని నిర్మూలించాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ కోరారు. అవిరళ కృషిచేస్తే పది పన్నెండేళ్లలో ఈ వ్యవస్థకు ముగింపు లభిస్తుందని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది జనసంగోష్టి సందర్భంగా ఆర్ఎస్ఎస్‌చీఫ్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. సమావేశంలో ప్రాంత్ సంఘ్‌చాలక్ అనిల్‌భలేరావు కూడా పాల్గొన్నారు. కులవ్యవస్థ పరిణామాలు, సంఘ సామాజికదృక్పథాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వృత్తులనుంచి వర్గాలవైపుగా మారుతోందని, కుల మూలాలనను వృత్తిపరంగా మాత్రమే గుర్తించారని, తర్వాత రానురాను సామాజిక విభజనలుగా మారిపోయి పక్షపాతాన్ని పెంచుతున్నదని ఆందోళన వ్యక్తంచేసారు. ఈ వివక్ష అంతానికి మనస్సులనుంచి ముందు కులాన్ని పారద్రోలాలని ఆయన పిలుపునిచ్చారు. ఆచారాలపై మానసిక నిర్మూలన అవసరాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యం పోటీ కాదని, వ్యక్తిత్వంద్వారా జాతినిర్మాణమని మోహనభగవత్ పేర్కొన్నారు. సామాజిక బలంకోసం వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడంతో దేశ కీర్తిని మరింత ఇనుమడింపచేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ధర్మం అనేది ప్రతిజీవిలోను విస్తరించి ఉందని, లౌకిక రాజ్యాలు ఉన్నప్పటికీ ఏ మానవుడు కూడా సృష్టిధర్మంనుంచి తప్పించుకోలేడని, పూర్వీకుల వారసత్వం ప్రపంచ నాయకత్వం నిర్ధారిస్తుందని కూడా ఆయన చెప్పారు. ధర్మం భారత దేశాన్ని నడిపించినంతకాలం విశ్వగురు హోదా నిలిచి ఉంటుందని, ఈ విశ్వక్రమాన్ని కొనసాగించేందుకు ఇదే ఒక కీలక మలుపు వంటిదని ఆయన హిందూ మతంగురించి ప్రస్తావించారు.



### అమెరికా పప్పుదినుసులపై భారత్ 30% ట్యారిఫ్‌లా?

## అమెరికా సెనేటర్లు ట్రంప్‌కు లేఖ

**వాషింగ్టన్, జనవరి 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపు ధోరణిలో భారత్‌పై టారిఫ్‌ల గురించి మాట్లాడుతూ ఉంటే, భారత్ అందుకు నిశ్శబ్దంగా ప్రతిస్పందిస్తోంది. అమెరికా నుంచి భారతదేశానికి దిగుమతి అవుతున్న పప్పు దినుసులపై భారత్ 30 శాతం టారిఫ్ విధించిందని, దీనిని తొలగించేవిధంగా భారత్‌పై ఒత్తిడి తేవాలని అమెరికన్ సెనేటర్లు ఇద్దరు ఇటీవల ట్రంప్‌ను కోరారు. ఈ టారిఫ్ అనుచితమని వీరు పేర్కొన్నారు. నార్త్ డకోటా సెనేటర్ కెవిన్ క్రామర్, మొంటానా సెనేటర్ స్టీవ్ డైనెస్ ఈ లేఖను ట్రంప్‌నకు రాశారు. గత ఏడాది అక్టోబర్ 30న అమెరికన్ యెల్లో పీస్ (పప్పు)పై భారత్ 30 శాతం టారిఫ్ విధించిందని, అది నిరుడు నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు.

# ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. - ఇయు అమెరికా వాణిజ్య ఒప్పందం నిలిపివేత!

**వాషింగ్టన్, జనవరి 18:** గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న పంతంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు సమర్థించని యూరప్ దేశాలపై 10 శాతం సుంకం విధిస్తామని చేసిన ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జూలైలో ప్రకటించిన యూఎస్ - ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని యూరోపియన్ పీపుల్స్ పార్టీ ఉపాధ్యక్షుడు సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ సోషల్‌మీడియాలో వెల్లడించారు. గత ఏడాది జూలైలో కుదిరిన యూఎస్‌ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని త్వరలోనే రాటిఫై చేయాల్సి ఉంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా నుంచి ఈయూకు వచ్చే దిగుమతులపై సుంకాలను సున్నాకు తగ్గించే అవకాశం ఉండేది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాల్సి వస్తుందని సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ తెలిపారు. గత ఏడాది అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే ఏకైక లాభం స్థిరత్వం మాత్రమేనని పేర్కొన్నారు. కానీ ట్రంప్ తాజా ప్రకటనతో ఆ స్థిరత్వం దెబ్బతిన్నదని అన్నారు. అందుకే ఈ వాణిజ్య ఒప్పంద రాటిఫికేషన్‌ను వాయిదా వేయడం సమంజసమని స్పష్టం చేశారు. అంతకుముందు గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణకు వ్యతిరేకిస్తున్న 8 దేశాలపై భారీగా సుంకాలు విధించనున్నట్లు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. డెన్మార్క్, బ్రిటన్, ఫ్రాన్స్, నార్వే, స్వీడన్, జర్మనీ, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాల ఉత్పత్తులపై 10 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఇవి అమలులోకి వస్తాయని వెల్లడించారు. గ్రీన్‌లాండ్ కొనుగోలు వ్యవహారంలో సహకరించకపోయినా జూన్ 1వ తేదీ నాటికి కొనుగోలు ఒప్పందం



పూర్తి కాకపోయినా ఈ 8 దేశాలపై టారిఫ్‌ను 25 శాతానికి పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ (27 సభ్య దేశాలు) మధ్య గత ఏడాది జూలై భారీ వాణిజ్య ఒప్పందం కుదరింది. ఈ ఒప్పందం ద్వారా యూఎస్, ఈయూ మధ్య ఉన్న పలు టారిఫ్‌లు, వాణిజ్య వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అంతా భావించారు. కానీ గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న పంతంతో ట్రంప్ విధించిన టారిఫ్‌ల నేపథ్యంలో యూఎస్ - ఈయూ వాణిజ్య ఒప్పందంలో అనిశ్చిత్తి నెలకొంది.

# ఓర్సా లోయలోపడిన బస్సు

## ఐదుగురు మృతి, 25 మందికి తీవ్ర గాయాలు



**మహువాధర్(జార్ఖండ్), జనవరి 18:** జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివాహ బృందం ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 25 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపూర్ జిల్లా నుండి మహువాదర్‌కు వెళ్తున్న బస్సు మహువాదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓర్సా లోయ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారని, సహాయక చర్యలు ప్రారంభించామని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు జార్ఖండ్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమేమిటో స్పష్టంగా తెలియదని, దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బాధితులకు తక్షణ సహాయం అందించాలని లతేహార్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గత 24 గంటల్లో జార్ఖండ్‌లో జరిగిన మూడవ పెద్ద ప్రమాదం ఇది. శనివారం రాత్రి, డియోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘసిదిహ్ గ్రామం సమీపంలో కారులో ప్రయాణిస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు మరణించగా, మరొకరు గాయపడ్డారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

# మణికర్ణిక ఘాట్‌పై డీప్‌ఫేక్ చిత్రాలు!

## సోషల్ మీడియా యూజర్లు 8 మందిపై కేసులు



**వారణాసి, జనవరి 18:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న ప్రఖ్యాత మణికర్ణిక ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి సోషల్ మీడియాలో కృత్రిమ మేధతో సృష్టించిన ఫేక్ చిత్రాలతో తప్పుడు ప్రచారం చేసినందుకు 8 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులకు సంబంధించి వాస్తవాలకు విరుద్ధంగా, కల్పిత చిత్రాలను సోషల్‌మీడియా వేదికగా కొందరు ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చిత్రాలలో హిందూ దేవతలను అవమానకరంగా చూపించారని, తద్వారా మత విశ్వాసాలను దెబ్బతీసి, ప్రజల్లో ఆగ్రహం రెచ్చగొట్టేందుకు, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించారని అధికారులు ఆరోపించారు. ఏసీపీ అతుల్ అంజన్ మాట్లాడుతూ మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న పనులకు సంబంధించి అనేక తప్పుడు పోస్టులు, చిత్రాలు సర్క్యులేట్ అయ్యాయి. భవిష్యత్తులో ఇలాంటివి పోస్ట్ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వారిలో కాంగ్రెస్,

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన నేతలు కూడా ఉన్నారని ఆయన వెల్లడించారు. ఘాట్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్న సంస్థ ప్రతినిధి చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్ 15 నుంచి తాము పనులు చేస్తున్నామని, జనవరి 16న రాత్రి ఒక నెటిజన్ ఏఐ జనరేటెడ్ చిత్రాలను షేర్ చేసి, ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులకు అభ్యంతరకరమైన కామెంట్లు, రీపోస్టులు రావడంతో ఉద్రిక్తతలు పెరిగాయని పోలీసులు గుర్తించారు. వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు కొనసాగుతాయని, పోస్టులు పెట్టిన వారితో పాటు వాటిని రీపోస్ట్ చేసి, కామెంట్లు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు.

# సంక్షిప్తంగా..

## బంగ్లాలో హిందూ వ్యాపారి లిటన్‌దాస్ హత్య




**ఢాకా, జనవరి 18:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు ఆగడం లేదు. ఆ దేశంలో మరో హిందువును దారుణంగా కొట్టి చంపారు. కాళిగంజ్ ప్రాంతంలో హోటల్, స్వీట్ షాప్ పడిపే లిటన్ చంద్ర దాస్ అనే హిందూ వ్యాపారిని హత్య చేశారు. ఒక చిన్న వాగ్వాదం తీవ్రంగా మారి, ఆయనపై వినియోగదారుల గుంపు దాడి చేయడంతో మరణించారు. ఈ సంఘటన శనివారం ఉదయం జరిగింది. మొదట ఒక కస్టమర్ లిటన్ దాస్ షాపులో పనిచేసే అనంత్ దాస్‌తో వాగ్వాదానికి దిగాడు. పరిస్థితిని తీవ్రం కావడంతో తన ఉద్యోగిని రక్షించేందుకు లిటన్ జోక్యం చేసుకున్నాడు. అయితే, ఆయన టార్గెట్‌గా దాడికి పాల్పడటంతో ప్రాణాలు విడిచారు.

## ఇరాన్ అంతర్యుద్ధంలో 16,500 మంది మృతి



**టెహ్రాన్, జనవరి 18:** అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న ఇరాన్ లో పౌరుల ప్రాణాలు వేల సంఖ్యలో గాలిలో కలిసిపోతున్నాయి. గత మూడు వారాలుగా జరుగుతున్న ఘర్షణల్లో దాదాపు 16,500 మందికి పైగా ప్రజలు మరణించినట్లు మానవహక్కుల నివేదికలు చెపుతున్నాయి. 3.30 లక్షల మందికిపైగా ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. డిసెంబర్ చివరి వారంలో ఇరాన్ లో ఘర్షణలు మొదలయ్యాయి. అక్కడ ఆర్థిక పరిస్తితి దిగజారడం, నిత్యావసరాల ధరలు పెరగడం, మరోవైపు తీవ్రమైన ఆంక్షలను వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసనలు మొదలెట్టారు. నిరసనకారుల్ని అణచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర చర్యలకు దిగింది. కాల్పులు, శిక్షలతో వేలాదిమంది ప్రాణాలు తీసింది.

## ఇండిగో విమానానికి బాంబు బెదరింపు - అత్యవసర ల్యాండింగ్

**న్యూఢిల్లీ జనవరి 18:** ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా (పశ్చిమ బెంగాల్) ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లక్నోలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. ఈ బాంబు బెదిరింపు విమానంలో ఒక నోట్ ద్వారా వచ్చింది. విమానంలో ఒక టిష్యూ పేపర్ పై గుర్తు తెలియని వ్యక్తి చేతితో ఈ బెదిరింపు పత్రం రాసినట్లు ఏసీపీ రజనీష్ వర్మ తెలిపారు. ఇండిగో విమానం ఉదయం ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళ్తుండగా విమానంలో బాంబు ఉందని ఆ విమానంలోని టాయిలెట్ లో ఉన్న ఒక టిష్యూ పేపర్ పై చేతి రాతతో రాసి ఉండగా సిబ్బంది గుర్తించారు. దీంతో విమానంలోని పైలట్లు ఏటీసీకి సమాచారం అందించారు. అనంతరం ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు అనుమతి తీసుకున్నారు.

## నీటిగుంతలో పడిన కారు.. టెకీ మృతి

**లక్నో, జనవరి 18:** అదుపుతప్పిన కారు లోతైన నీటి గుంతలోకి దూసుకెళ్లింది. ఆ కారులో ఉన్న టెకీ తన తండ్రికి ఫోన్ చేసి కాపాడాలని కోరాడు. అక్కడకు చేరుకున్న ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సహాయక చర్యల్లో ఆలస్యం జరిగి ఆ టెకీ నీట మునిగి మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని సీతామర్హికి చెందిన 27 ఏళ్ల యువరాజ్ మెహతా, గురుగ్రామ్‌లోని డన్‌హంబీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందట తల్లి మరణించింది. దీంతో తండ్రితో కలిసి నోయిడాలో నివసిస్తున్నాడు.ఈనెల 16న రాత్రి వేళ పని తర్వాత యువరాజ్ తన కారులో ఇంటికి బయలుదేరాడు. నోయిడాలోని సెక్టార్ 150 వద్ద కారును మలుపు తిప్పేందుకు ప్రయత్నించాడు. పొగమంచు కారణంగా ముందు ఏమున్నది అన్నది యువరాజ్‌కు కనిపించలేదు. దీంతో ఆ కారు చిన్న గోడను ఢీకొట్టింది. 70 అడుగుల లోతైన నీటి గుంతలోకి కారు దూసుకెళ్లింది.

## జల్లికట్టు యోధులకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం:సిఎం స్టాలిన్

**చెన్నై,జనవరి 18:** తమిళనాడులో నిర్వహించిన జల్లికట్టుపోటీల్లో అత్యధిక సంఖ్యలో ఎద్దులను నిలువరించిన యోధులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అళంగనల్లూరు జల్లికట్టును సందర్శించిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేసారు. ఉదయం ఏడు గంటలనుంచి ప్రారంభించి, జల్లికట్టుపోటీలు ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటాయి. సాంప్రదాయబద్ధంగా వస్తున్న ఈ క్రీడను తిలకించేందుకు ముఖ్యమంత్రి వేదికవద్దకు చేరుకుని విజేతలకు అత్యధిక సంఖ్యలో ఎద్దులను నిలువరించిన యోధులకు బహుమతులు పంపిణీచేసారు. అలాగే ఎద్దుల యజమానులను కూడా ఆయన సత్కరించారు. వారందరికీ పసిడితో చేసిన ఉంగరాలను బహూకరించారు. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పశుసంవర్ధక ఆసుపత్రిని ఏర్పాటుచేస్తామన్నారు.



ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఏపి మంత్రి నారా లోకేశ్ తదితరులు

## ఎన్టీఆర్‌కు ప్రముఖుల నివాళులు

### ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించిన ఏపి మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బాలకృష్ణ, పురందేశ్వరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపి పురందేశ్వరి, ఏపి సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని ఆయన సమాధిపై పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు. లోకేశ్‌తోపాటు పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ నేతలు, అభిమానులు అక్కడికి తరలివచ్చారు. ఎన్టీఆర్ ఘాట్ వద్దకు సినీనటుడు కల్యాణ్‌రామ్ చేరుకుని నివాళులర్పించారు. మాజీమంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, బాబూమోహన్ ఎన్టీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులతో పాటు అభిమానులు భారీఎత్తున ఘాట్ వద్దకు చేరుకొని పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘాట్‌ను పూలతో తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత విశేషాలతో చిత్ర ప్రద ర్శనను ఏర్పాటు చేశారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ, రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. మహానుభావులు కావాలంటే ఎంతో శ్రమ, దీక్ష అవసరమని అవి ఎన్టీఆర్‌లో ఉండేవన్నారు. సూర్యచంద్రులు ఉన్నన్నాళ్లూ ఆయన బతికే ఉంటారన్నారు. సినిమాల్లో ఎవరూ చేయని పాత్రలు ఎన్టీఆర్ చేశారని, ప్రతిపాత్రలోనూ పరకాయ ప్రవేశంతో నటనలో ఎన్నో ప్రయో గాలు చేశారని తెలిపారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి గుండెచప్పుడు, కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ, రాజ కీయ రంగాల్లో ఆయన ఎన్నో సేవలు అందించారన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారని చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆ మహనీయుడికి ఘన నివాళులర్పించారు. పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు, బడుగుబలహీన వర్గాలకు రాజ్యా ధికారం కల్పించిన సమతావాది, స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త ఎన్టీఆర్ అని అచ్చెన్నాయుడు కొనియాడారు. ఎన్టీఆర్ ఆశించిన సమసమాజాన్ని సాధించుకుందామని ఆశాభావం వ్యక్తం చేశారు. నందమూరి లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చి నివాళులు అర్పించారు.

### బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

### నివాళులు అర్పించిన నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 18, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన సంస్థ (బీఐఏఎస హెచ్ అండ్ ఆర్ఐ)లో ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని బసవతారకం దంపతుల విగ్రహాలకు ఆస్పత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు ఆట వస్తువులతోపాటు పుస్తకాలను అం దించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి స్థాపనలో తన తండ్రి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, మరింత ఎక్కువమంది కేన్సర్ బాధితులకు సేవలందించేలా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు జెఎస్ఆర్ ప్రసాద్, సిఇఒ డాక్టర్ కె. కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్.రావు, హెచ్ఒడి సెంథిల్ రాజప్ప, మెడికల్ అంకాలజీ విభాగ వైద్యులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల పనివేళలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

### టిజి ఎస్ఎల్‌టిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పనివేళలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఎల్‌టిఏ) డిమాండ్ చేసింది. పని వేళలను మార్చేలా చూడాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె గౌరీ శంకర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వివిధ కాలాల్లో వాతావరణ ప్రభావం భిన్నంగా ఉండటమే కాక, వివిధ ప్రకృతి వైపరీత్యాల వలన ప్రతి ఒక్కరూ వత్తిడికి లోనవుతున్నారని అన్నారు. పాఠశాలలకు వెళ్ళే ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు ఇంటి పని చేసి, వారి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించి వెళ్లే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే ఉదయం పూట అరగంట వెసులుబాటు ఇస్తే వారికి మానసిక ఒత్తిడి నుండి వెసులుబాటు కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులు మాన సిక ఒత్తిడికి దూరంగా ఉంటేనే విద్యాప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. కాబట్టి ఉదయం పూట ప్రారంభ సమయంలో అరగంట పొడిగించి 9.30 లకు పాఠశాల ప్రారంభం అయ్యేలా చూడాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతుందన్నారు.

### వానకాలం మార్కెటింగ్ సీజన్ ముగిసినా

## పెండింగ్‌లోనే గత రబీ బోనస్

### రైతులకు రూ.1,159.64 కోట్లు బకాయిలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజను ముగుస్తుండగా, ప్రస్తుతం రబీ (యాసంగి) సీజన్ సాగు జోరుగా జరుగుతున్నా, 2025 రబీకి సంబంధించి ధాన్యం అమ్మిన అన్నదాతలకు బోనస్ సొమ్ము ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించ లేదు. ఈ బోనస్ సొమ్ముల కోసం రాష్ట్రంలోని రైతాంగం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసి దాదాపు 10 నెలలు అయినా ఇంత వరకూ క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున బోనస్‌ను రైతులకు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది. యాసంగి సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 74.23 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో సన్న రకానికి చెందిన ధాన్యం దాదాపు 23.20 లక్షల టన్నులను సేకరించింది. ఇందుకు సంబంధించి 4.09 లక్షల మంది రైతులకు రూ.1159.64 కోట్లు బోనస్ కింద చెల్లించాల్సి ఉన్నా, ఇప్పటికీ నయాపైసా ఇవ్వలేదు. మరోపక్క ప్రస్తుత ఖరీఫ్ సీజను ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కాగా, గత యాసంగిలో అమ్మిన ధాన్యానికే దిక్కులేదని పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, తద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేశారు. ఈ నేపథ్యంలో వానాకాలం సీజనులో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతుల నుండి 70.82 లక్షల టన్నులను కొనుగోలు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ ధాన్యాన్ని = 8,448 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించింది. ఇందులో అత్యధికంగా సన్న రకాలకు చెందిన ధాన్యం కావడం విశేషం. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల టన్నుల ధాన్యంలో 32.45 లక్షల టన్నుల ధాన్యం దొడ్డు రకానికి చెందినవే ఉన్నాయి. మిగిలిన 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు కొనుగోలు చేయడం జరిగింది. ఇందుకు గాను క్వింటాలుకు రూ.500 బోనస్ నిమిత్తం రైతాంగాం ఖాతాలో ఇప్పటి వరకు 1,425 కోట్లు జమ చేసినట్లు తెలిపాయి. అయితే గత రబీ సీజనుకు సంబంధించిన సన్నాల బోనస్‌ను ఇంత వరకూ ఖాతాల్లో జమ చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### ఇప్పటి వరకూ 6.45 లక్షల ఎకరాల్లో సాగు

## యాసంగిలో భారీగా మొక్కజొన్న

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజనులో మొక్కజొన్న పంట విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. యాసంగి సీజన్‌లో తెలంగాణలో 6.45 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకూ 6.70 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో 1.34 లక్షల ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ 68 వేల ఎకరాలు, వరంగల్ 61వేల ఎకరాలు, కొత్తగూడెం 50 వేల ఎకరాలు, మహబూబాబాద్ 49 వేల ఎకరాలు, నిర్మల్ 43 వేల ఎకరాలు, నిజామాబాద్ 32 వేల ఎకరాలు, జగిత్యాల 30 వేల ఎకరాలు, గద్వాల 29 వేల ఎకరాలు, కామారెడ్డి జిల్లాలో 27 వేల ఎకరాల్లో రైతాంగం మొక్కజొన్న సాగు నమోదైంది. ఈ విధంగా పెరిగితే సీజను ముగిసే నాటికి ఈ విస్తీర్ణం 10 లక్షల ఎకరాలు దాటే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు వల్ల మార్కెట్లో శనగలు, అపరాలు, కందుల ధరలు పడిపోయాయి. మరోపక్క పొగాకు సాగుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో యాసంగిలో ఏ పైరు వేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభిస్తుందా లేదా అనేదానిపై భయపడుతున్నారు. మొక్కజొన్నకు మాత్రమే గత ఏడాది మద్దతు ధర లభించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తుండగా, అందరూ ఈ ఒక్క పంటే ఎక్కువగా పండించడంతో పంట మార్కెట్‌లోకి వచ్చే సమయానికి మద్దతు ధర ఏ విధంగా ఉంటుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేరుశనగ సాగు చేద్దామనుకున్నా ఈ పంటకూ మార్కెట్లో ధర లేదు. మినుములు, పెసర సాగు చేసినా పంట చేతికి వచ్చిన తర్వాత కనీస మద్దతు ధర దక్కుతుందా అన్న సందేహం వ్యక్తం అవుతోంది. దీంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టిసారించారు. యాసంగి సీజన్ ప్రారంభంలోనే ఇంత పెద్ద ఎత్తున మక్కల సాగు షురూ కావడంతో సీజన్ ముగిసే నాటికి ఈయేడు మక్కల సాగు రికార్డులు సృష్టించనుందని ప్రభుత్వ గణాంకాలతో స్పష్టమవుతోంది.

## ఒటిఆర్‌లో అదనపు సమాచారాన్ని అప్‌లోడ్ చేసుకోవాలి

### ఎస్సీ వర్గీకరణను అభ్యర్థులు అప్‌డేట్ చేయాలి

### లేటెస్ట్ కలర్‌ఫొటో కూడా ఇవ్వాలి

### నేటి నుంచి ఫిబ్రవరి 9 వరకు అవకాశం

### వెబ్ నోటిఫికేషన్ జారీ చేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి)లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఒటిఆర్)లో మార్పులు చేర్పులు ఉంటే వెంటనే కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ నిరుద్యోగ అభ్యర్థులకు సూచించింది. ఒటిఆర్ అప్‌డేట్‌ను నేటి(సోమవారం) నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 9వరకు చేసుకోవాలని వెబ్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్నందున.. ఎస్సీ అభ్యర్థులు తమ ఎస్సీ వర్గీకరణ వివరాలను తప్పకుండా ఒటిఆర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

అలాగే అభ్యర్థులు గత ఒటిఆర్ తరువాత వారి విద్యా ర్హత(క్వాలిఫికేషన్) పెరిగి ఉంటే అందుకు సంబంధించిన క్వాలిఫికేషన్‌ను అప్‌డేట్ చేసి వాటికి సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించింది.

దీంతోపాటు అభ్యర్థులు తమ లేటెస్ట్ కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోను అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. రాబోయే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో అభ్యర్థుల వివరాలను సరిచూసుకోవడానికి ఈ అవకాశం కల్పించినట్టు కమిషన్ కార్యదర్శి వెబ్ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అభ్యర్థికి సంబంధించిన చిరునామాలో మార్పు ఉన్నా, ఈడబ్ల్యూఎస్ వివరాలు, నాన్ క్రిమిలేయర్ వివరాలు, మొబైల్ నంబర్ మార్పు, ఈ-మెయిల్ ఐడీలో మార్పు ఉంటే వాటిని సరిచేసుకోడానికి ఒటిఆర్‌ను ఉపయోగించుకోవాలని కమిషన్ వెబ్ నోటిఫికేషన్‌లో సూచించింది. ఇవి కాకుండా ఇతర వివరాలను మార్చడానికి ఒటిఆర్‌లో అవకాశం లేదని కమిసన్ స్పష్టం చేసింది.

అభ్యర్థులు ఇపుడు సమర్పించే ఒటిఆర్ వివరాలనే భవిష్యత్తులో ఉద్యోగ దరఖాస్తులకు ప్రాథమిక సమాచారంగా పరిగణిస్తారని.. కాబట్టి ఒటిఆర్‌లో వివరాలను జాగ్రత్తగా పూర్తి చేయాలని కమిషన్ వెబ్ నోటిఫికేషన్‌లో సూచించింది.

### విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

## దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి

### అఖిల భారత విద్యుత్ ఇంజినీర్ల సమాఖ్య

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని అఖిల భారత విద్యుత్ ఇంజనీర్ల సమాఖ్య పిలుపునిచ్చింది. విద్యుత్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాఖ్య విజ్ఞప్తి చేసింది. కోల్‌కతాలో ఛైర్మన్ శైలేంద్ర దూబే అధ్యక్షత ఆదివారం జరిగిన సమాఖ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రైతులు, పేద వినియోగదారుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఆపి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ ప్రయోజనం కోసం, విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన విద్యుత్ (సవరణ) బిల్లు 2025ను తక్షణమే ఉపసంహరించుకోవడం అత్యవసరమని తీర్మానించింది. రైతులు మరియు వినియోగదారులతో కలిసి సంయుక్త వేదికను ఏర్పాటు చేసి, విద్యుత్ కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. తమ సొంత ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ కార్మికుల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని మరియు ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపడంలో విద్యుత్ ఉద్యోగులకు అండగా నిలవాలని సమాఖ్య సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సీనియర్ కార్యనిర్వాహక అధికారులు పాల్గొ న్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఐదుసార్లు విద్యుత్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిందని సమాఖ్య పేర్కొంది. విద్యుత్ ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యో గులు, వినియోగదారుల నుండి బలమైన ప్రతిఘటన కారణంగా దానిని ఆమోదించలేకపోయారని తెలిపింది.

## కెజిబివి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

### కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

### ప్రభుత్వానికి టిఎస్ యుటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిం చాలని టిఎస్ యుటిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రెండు దశాబ్దాలుగా నామమాత్రపు వేతనాలతో కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యో గుల సర్వీసులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్ధాంతరంగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి వద్ద జరిగిన కారు ప్రమాదంలో జిల్లా పరిషత్ హై స్కూలు ప్రధానోపాధ్యాయిని గీతారెడ్డితోపాటు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కల్పన మరణించారు.

వారి మరణం పట్ల టిఎస్ యుటిఎఫ్ తీవ్రసంతాపం ప్రక టిస్తుందన్నారు. మరణించిన ఇరువురు ఒకేరకమైన విధులు నిర్వహిస్తున్నారని, మర ణం ఒకటే అయినా కు టుంబాలకు అందే మరణానంతర ప్రయోజనాల్లో మా త్రం తీవ్రవ్యత్యాసం ఉందన్నారు. కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగులు ఎంతకాలం పనిచేసినా వారికి నెలవారీ ఇచ్చే వేతనం మినహా ఏరకమైన ప్రయోజనాలు లేవని, ఆ వేతనం కూడా పనికి సమానమైన వేతనం కాదన్నారు. అనారోగ్యానికి గురైనా, అర్ధాంతరంగా మరణించినా ఎటువంటి పరిహారం చెల్లించడం లేదని, కనీసం మట్టి ఖర్చులు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. శనివారం రోడ్డు ప్రమాదంలో మరణించిన కల్పన కుటుంబం కడు పేదరికంలో ఉన్నదని, పిల్లలు చదు వుకుంటున్నారని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి సర్వీసులో ఉండగా మరణించిన కేజీబీవీ ఉద్యోగి కుటుంబానికి కనీసం రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలన్నారు. కేజీబీవీ ఉద్యోగుల ఉద్యోగానికి భద్రత కల్పించాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని చావ రవి, ఎ వెంకట్ ఆదివారం డిమాండ్ చేశారు.



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

## ప్రజాభిప్రాయం మేరకే మున్సిపాలిటీల విభజనపై నిర్ణయం తీసుకోవాలి

### రంగారెడ్డి జిల్లాను ఎంఐఎంకు అప్పజెప్పేలా కాంగ్రెస్ కుట్ర: ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 18:** రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అందులో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా మున్సిపాలిటీల విభజన చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి చుట్టు పక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం వెనక పెద్ద కుట్ర దాగుందని చెప్పుకొచ్చారు. పాత బస్తీలో ఎవరూ కరెంట్ బిల్లులు, వాటర్ బిల్లులు కట్టరని.. అలాంటి వారితో రంగారెడ్డి ప్రజలను ఎందుకు కలుపుతున్నారంటూ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి సంపద మొత్తం గతంలో కేసీఆర్ గల్లాపెట్టెలోకి వెళ్లిందని.. ఇప్పుడు ఎంఐఎం ఇలాకాలోకి వెళ్తుందని చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేయొద్దని.. చార్మినార్‌లో రంగారెడ్డిని కలిపితే ఇక్కడి ప్రజల జీవితాలు ఆగమవుతాయంటూ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ఆర్థిక వనరు రంగారెడ్డి జిల్లా ఖజానా అంతా నాడు కెసిఆర్ ఫామ్ హౌస్‌కు తరలిపోయింది. నేడు ఎంఐఎం ఇలాకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే నెల నుండి అల్పాహారం

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం పౌష్టికరమైన అల్పాహార పథకాన్ని ప్రారంభించేందుకు మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బాలల ఆరోగ్యమే ప్రధానంగా ఈ అల్పాహార కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఆ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం ఈ పథకాన్ని తొలుత హైదరాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనుంది. ముఖ్యంగా సికింద్రాబాద్, ఖైరతాబాద్, నాంపల్లి, చార్మినార్, గోల్కొండ ప్రాంతాల పరిధిలోని 970 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ అల్పాహార పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ కేంద్రాల్లోని 15 వేల మంది పిల్లలకు ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని అల్పాహారం రూపంలో అందిస్తారు. వీటి ఫలితాలు ఆధారంగా తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లోని దాదాపు 8లక్షల మంది పిల్లలకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు.

## మేధావులు, విద్యావంతులు బిజెపిలో చేరాలి

### పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సమక్షంలో ప్రముఖ డాక్టర్ సాయిచంద్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చదువుకున్నవారు, మేధావులు, విద్యావంతులు ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గతంలో రాజకీయాలంటే కేవలం డబ్బున్నవారో, అంగబలం లేదా క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారో మాత్రమే వస్తారని భావించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందన్నారు. దేశాన్ని కాపాడగల నాయకుడు ఎవరు? దేశ సమస్యలను పరిష్కరించగల పార్టీ ఏది? దేశద్రోహ శక్తులు ఎందుకు పెరుగుతున్నాయి? వాటిని ఎలా ఎదుర్కోవాలి? ఈ ప్రశ్నలపై యువతలో స్పష్టమైన ఆలోచన పెరిగిందని ఆయన అన్నారు. దేశవిరోధి శక్తులను ఎదుర్కోవాలంటే దేశాన్ని ప్రేమించే, సమాజం పట్ల బాధ్యత కలిగిన చదువుకున్నవారు కూడా ఒక సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఉంది. అందుకే నేడు మేధావులు, విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం ఒక సానుకూలమైన, ఆశాజనకమైన పరిణామంగా దేశం చూస్తోందన్నారు. ఇటీవలి కాలంలో యువ నాయకులు, విద్యావంతులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా భారతీయ జనతా పార్టీలో చేరుతూ దేశ సేవలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. బీహార్‌లో అతి తక్కువ వయసులో ఎమ్మెల్యేగా గెలిచిన యువ నాయకులు కూడా బీజేపీలో చేరడం..రాజకీయాల్లోకి వస్తున్న నూతన తరానికి స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన పార్టీలు ప్రజలకు విధానాలు చూపించలేక, బూతుల రాజకీయాలతోనే కాలం గడుపుతున్నాయి. ఒకరు ప్యాంట్ విప్పుతా అంటారు, మరొకరు తోలు తీస్తా అంటారు. ఈ రకమైన భాష, ఈ రకమైన రాజకీయాలు రాబోయే తరానికి తీవ్రంగా ప్రమాదకరమైనవన్నారు. రాజకీయాలు అంటే వ్యక్తిగత దూషణలు కాదు, కొట్టుకోవడాలు కాదు. రాజకీయాలకు ఒక గౌరవం ఉండాలి, ఒక విలువ ఉండాలి. ప్రజల సమస్యలపై మాట్లాడే పరిపక్వత ఉండాలి. ఆ మార్పు రావాలంటే మేధావులు, చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాల్సిందే అని పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి రావడం అంటే అందరికీ టికెట్లు ఇవ్వడమే కాదు. దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యత, సామాజిక స్పృహ, రాజకీయ అవగాహన ఉంటే అటువంటి వారి భాగస్వామ్యం దేశ నిర్మాణానికి తప్పకుండా ఉపయోగ పడుతుందన్నారు. దేశాన్ని శక్తివంతంగా చేయాలంటే, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే, భారత్‌ను ఒక జాతీయ శక్తిగా నిలబెట్టాలంటే మేధావులు భారతీయ జనతా పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటకలో కూడా బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుంది. దేశం మొత్తం క్రమంగా కాషాయం వైపు సాగుతోంది. ఈ మా ర్పునకు నాంది పలకా ల్సింది మేధావులే. తెలం గాణ రాజకీయాల్లో గుణా త్మకమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత మీ అందరిదే అని చెప్పారు. చేరిక కార్య క్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బిజెపి రంగా రెడ్డి(పట్టణ) జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి, మేడ్చల్(పట్టణ) జిల్లా కన్వీనర్ డాక్టర్ మల్లారెడ్డి, మాధవరం కాంతారావు, డా. రాజశేఖర్ రెడ్డి,, మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజ్ గారు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడైన కొడుకు గొంతుకోసి చంపి తండ్రి ఆత్మహత్య

**జన్నారం, జనవరి 18, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాం పూర్‌లో కొడుకుని చంపి తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామా నికి చెందిన పాలగాని భూమయ్య (45) ఆర్థిక ఇబ్బందులకు తోడు కొడుకు అనారోగ్యంతో మనస్తాపం చెంది కొడుకు కార్తిక్ (10)ను కత్తితో గొంతుకోసి అనంతరం అదే కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన పాలగాని భూమయ్య కు భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు వర్షిత, లాస్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు. భూమయ్య వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమారుడు కార్తీక్ పుట్టుకతో అంగవైకల్యంతో (వికలాంగుడు, మూగ, చెవుడు) జన్మించాడు. అలాగే భూమయ్య కూడా రెండేళ్లుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడు తున్నారు. ఇటు తన ఆరోగ్యం, అంగవైకల్యంతో ఉన్న కుమా రుడిని చూసుకోవడం భారంగా భావించి మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఆదివారం భార్య స్వరూప పొలంపనికి వెళ్లడంతో ఇంట్లో ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, తల్లి మాత్రమే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తన కుమారుడి గొంతు కోసి అదే కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్య చేసు కున్నారు. మృతుడి పెద్ద కుమార్తె వర్ష ఈ ఘటనను గమనించి తల్లికి సమా చారం అందించింది. భార్య స్వరూప ఇంటికి వచ్చి చూడగా ఇద్దరూ రక్తపు మడు గులో మరణించి ఉన్నారు. భర్త అనారోగ్యం, అలాగే కుటుంబ పరిస్థితుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య ఇచ్చిన వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు.



భూమయ్య (ఫైల్)

## దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు ఏకం కావాలి

### ఎంసిపిఐ(యు) పొలిట్‌బ్యూరో విస్తృత సమావేశం పిలుపు




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంసిపిఐ (యు) జాతీయ నేతలు మద్దికాయల అశోక్ ఓంకార్, కుల్దీప్‌సింగ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 18, ప్రభాతవార్త :** అంతర్జాతీయ, జాతీయ పరి స్థితుల నేపథ్యంలో నేడు ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో కమ్యూనిస్టు వామపక్ష శక్తుల ఏకీకరణ కావాల్సిన చారిత్రక నేపథ్యం ఏర్పడింది అని యంసిపిఐ (యు) జాతీయ నేతలు మద్దికాయల అశోక్ ఓంకార్. కుల్దీప్‌సింగ్ పిలువునిచ్చారు. బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్‌లో రెండు రోజులపాటు ఎంసిపిఐ (యు) పొలిట్ బ్యూరో విస్తృత సమావేశం కుల్దీప్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 2018 నుంచి కొన్ని స్వల్ప భిన్నా భిప్రాయాలు కలిగి వేరువేరు ఆర్గనైజేషన్‌గా పనిచేసిన పార్టీ ఈ సమావేశంలో ఒకే ఆర్గనైజేషన్‌గా ఏర్పడాలని, ఇందులో భాగంగా ఫిబ్రవరి 23 ,24 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం జోద్ పూర్ లో ఆలిండియా ఐక్య కన్వెన్షన్ నిర్వహిం చాలని ఈ కన్వెన్షన్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,బీహార్ పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్,కేరళ, తమిళ నాడు రాష్ట్రాల నుంచి 200 మంది ప్రతినిధులను సమావేశం ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు వామపక్ష శక్తులను ఏకీకరణ చేసే పనిని వేగవంతం చేయాలని వర్గ, సామాజిక ప్రజా పోరాటాల ను బలోపేతం చేయడం ద్వారా దేశంలో మనువాద ఫాసిస్టు కార్పొరేట్ ఆర్థిక నియంతృత్వ శక్తులను ఓడించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు వామపక్ష శక్తుల ఐక్యత ఏకైక మార్గం అని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశం లో యంసిపిఐ (యు) జాతీయ నేతలు గాదగోని రవి వల్లెపు ఉపేందర్ రెడ్డి,తెలంగాణ, కిరణ్ జిత్ సింగ్ షేఖాన్, ప్రేం సింగ్ భంగ్ పంజాబ్, కాటం నాగ భూషణం ఆంధ్రప్రదేశ్, అనుభవ్‌దాస్, ఉత్తర ప్రదేశ్, రాంపాల్ షైనీ, మహేందర్ నేహ, నదీం ఖాన్ రాజస్థాన్, భూప్ నారాయణసింగ్, మనో రంజన్ ఠాకూర్ బీహార్, డెన్నిస్, దామోదర్ ఉన్ని కృష్ణన్ పొట్టి కేరళ పాల్గొన్నారు.

# హార్వర్డ్ విద్యార్థిగా సిఎం రేవంత్‌రెడ్డి, ప్రత్యేక కోర్సులో చేరిక

## లీడర్‌షిప్ ఫర్ 21 సెంచరీ కోర్స్ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## 25 నుంచి 30 వరకు కెనడీ స్కూల్ క్యాంప్‌లో తరగతులకు హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఒక కొత్త రికార్డ్ సృష్టించబోతున్నారు. దేశంలో ప్రస్తుతం పదవిలో ఉన్న ముఖ్యమంత్రులెందరిలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఒక కోర్స్ సర్టిఫికెట్ అందుకోబోతున్న మొదటి ముఖ్యమంత్రిగా ఒక అరుదైన ఘనత సాధించబోతున్నారు. ప్రపంచంలోని నంబర్ వన్ విద్యాసంస్థల్లో ఒకటైన హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో 'లీడర్‌షిప్: 21 సెంచరీ' అనే కోర్స్‌కు హాజరుకాబోతున్నారు.



దీనితో, భారతదేశ చరిత్రలో ఒక ఐవీ లీగ్ కార్యక్రమానికి హాజరవుతున్న మొదటి ముఖ్యమంత్రి రేవంత్ అవుతారు. ఈ కోర్స్ 'పేరు 21వ శతాబ్దం కోసం నాయకత్వం(అస్తవ్యస్తత, సంఘర్షణ, ధైర్యం)'. ఈ కోర్స్ కోసం ఆయన ఈ నెల 25 నుంచి 30 వరకు మసాచుసెట్స్‌లోని కెనెడీ స్కూల్ క్యాంపస్‌లో ఉండి తరగతులకు హాజరవుతారు. ఐదు ఖండాలనుంచి 20 దేశాల ప్రతినిధులు ఈ కోర్సుకు హాజరు కాబోతున్నారు. వీరితో కలిసి రేవంత్ రెడ్డి తరగతులు, అసైన్‌మెంట్లు, హోమ్‌వర్క్‌లు పూర్తి చేసి గ్రూప్ ప్రాజెక్టులు కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సు ప్రొఫెసర్ టిమ్ ఓ బ్రియాన్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కరెన్ మోరిస్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా ప్రతినిధి బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుండి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. కోర్స్ పూర్తి చేసిన తర్వాత ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ పొందనున్నారు.

**హార్వర్డ్ విశ్వవిద్యాలయం విశేషాలు**

ప్రైవేట్ ఐవి లీగ్ పరిశోధనా విశ్వవిద్యాలయం. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉంది. 1607లో స్థాపించబడింది (418 సంవత్సరాల చరిత్ర). గత 100 సంవత్సరాల్లో 75 సార్లు ప్రపంచంలో నంబర్ 1 విశ్వవిద్యాలయంగా నిలిచింది. విశ్వవిద్యాలయంలో 14 కళాశాలలు ఉన్నాయి: బిజినెస్ (హెచ్‌బిఎస్), లా (హెచ్‌ఎల్‌ఎస్), మెడికల్, గవర్నమెంట్, థియాలజీ శాస్త్రాలకు విడివిడిగా కాలేజీలు ఉన్నాయి.

**కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ విశేషాలు**

1936లో స్థాపించారు. 1966లో అధ్యక్షుడు కెన్నెడీ పేరు పెట్టారు. గ్రాడ్యుయేట్, మాస్టర్స్, ఎగ్జిక్యూటివ్ కోర్స్‌లు అందిస్తుంది. 2002: 52 పైగా మహిళా విద్యార్థులు. 2011: 75వ వార్షికోత్సవం / విశ్వవిద్యాలయం 375 సంవత్సరాలు. 2014: పూర్వ విద్యార్థులు, దాతల నుండి ట్రిలియన్ డాలర్లు సేకరించింది. 2026: 100 కంటే ఎక్కువ దేశాలకు చెందిన విద్యార్థులతో, హార్వర్డ్‌లో అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులు చదివే కళాశాలలో ఒకటిగా కెన్నెడీ స్కూల్ నిలిచింది

# సంక్రాంతి పండుగతో టిజిఎస్‌ఆర్టీసీకి భారీ లాభాలు

## కేవలం 5 రోజుల్లోనే రూ. 67.40 కోట్ల రికార్డు ఆదాయం

## పండుగ రద్దీ కోసం 6,431 ప్రత్యేక బస్సుల ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** సంక్రాంతి పండుగ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకుకాసుల వర్షం కురిపించింది. పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసి పక్కా ప్రణాళికతో వ్యవహరించిన ఆర్టీసీ యాజమాన్యం, కేవలం ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఆదాయం సాధించింది.

ఈ నెల 9 నుంచి 13వ తేదీ మధ్య సంస్థకు టికెట్ల విక్రయం ద్వారా ఏకంగా రూ. 67.40 కోట్ల ఆదాయం సమకూరింది. సగటున రోజుకు సుమారు రూ. 13.48 కోట్ల చొప్పున ఆర్జించింది.

ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు తోడుగా వారాంతపు శని, ఆదివారాలు రావడంతో హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో బస్సులు కిక్కిరిసిపోయాయి. ఈ రద్దీని తట్టుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 6,431 ప్రత్యేక బస్సులను నడిపింది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ స్పెషల్ సర్వీసుల ద్వారానే రోజుకు అదనంగా రూ.2.70 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తాయనే భావన, ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం వంటి కారణాలతో ప్రజలు ప్రభుత్వ బస్సులకే మొగ్గు చూపారు.

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో పెయిడ్ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడం సంస్థకు ఆర్థికంగా కలిసొచ్చింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టీజీఎస్‌ఆర్టీసీకి ఈ ఆదాయం గొప్ప ఊరటనిచ్చింది. పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణాల కోసం కూడా ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది.

తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఏపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల లభ్యతపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఈ పండుగ సీజన్‌లో వచ్చిన ఆదాయంతో భవిష్యత్తులో మరిన్ని ఆధునిక బస్సులను ప్రవేశపెట్టేందుకు రవాణా శాఖ యోచిస్తోంది.

# వనదేవతల ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి

## మేడారం శాశ్వత అభివృద్ధి పనులను పర్యవేక్షించిన సిఎం

## మూడు కోట్ల మంది భక్తులు వస్తారన్న మంత్రి సీతక్క

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త :** దక్షిణాది కుంభమేళా గా పేరు పొందిన మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ,



ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం సాయంత్రం మేడారం చేరుకున్నారు. వీరికి ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబా బాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, యశస్విని రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, స్టేట్ ఫైనాన్స్, ఆయిల్ ఫెడ్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ చిత్రా మిశ్రా తదితరులు ఘన స్వాగతం పలికారు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద గౌరవ వందనం స్వీకరించిన సీఎం, మేడారంలో కొనసాగు తున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. జంపన్నవాగు వద్ద స్నాన ఘాట్లను పరిశీ లించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026, ఆలయ పునః ప్రతిష్టాపన ప్రారంభోత్సవం సందర్భం గా మేడారానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వనదేవతల సన్నిధిలో అభివృద్ధికి శంఖారావం చేశారు. మేడారం మహాజాతరను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. మేడారం గద్దెల విస్తీర్ణం పెంపు, రాతితో శాశ్వత కట్టడాల నిర్మాణానికి రూ.101 కోట్లు, జాతర పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో రూ.150 కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు సీఎం స్పష్టం చేశారు. భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే చిలుకల గుట్ట, హరిత హోటల్, గిరిజన మ్యూజియం, ఆర్టీసీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించి, వసతి, రవాణా, పారిశుద్ధం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ మేడారం మహాజాతరను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న శాశ్వత అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్మాత్మక కార్యక్రమమని సీఎంకు వివరించారు. ఈ జాతరకు సుమారు మూడు కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన కళా రూపాలను సీఎం ఆసక్తిగా తిలకించారు. అనంతరం క్యాబినెట్ మీటింగ్ లో పాల్గొన్నారు. నూతన గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ మహా జాతర ఉత్సవ వేడుకలలో గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఈ సమావేశంలో మంత్రులు, సీఎం ప్రసంగించారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు సమ్మక్క సారలమ్మ గద్దెల పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో సీఎం, మంత్రులు పాల్గొననున్నారు.

# బెంగాల్‌లో మాఫియా పాలన

## అన్నిటిపై సిండికేట్ పన్ను

## కేంద్ర పథకాలనూ అడ్డుకుంటున్నారు

## సింగూరు సభలో ప్రధాని మోడీ ధ్వజం

**సింగూరు(పశ్చిమబెంగాల్), జనవరి 18:** పశ్చిమబెంగాల్‌లో మాఫియా పాలన నడుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక్కడ ప్రతి దానిపై సిండికేట్ పన్ను విధిస్తున్నారని అన్నారు. శాంతి భద్రతలు అదుపు తప్పాయని మండిపడ్డారు. సందేశ్‌ఖాలీలో జరిగిన మహిళలపై అకృత్యాలు, విద్యా సంస్థలలో ఇటీవల వరుసగా వెలుగుచూసిన అత్యాచారాలు, ఇందుకు ఉదాహరణ ప్రధాని ఎత్తి చూపారు. ఆదివారం హుగ్లీ జిల్లా సింగూరులో పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, ఈ ఏడాది చివరిలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే, పశ్చిమ బెంగాల్‌లో "ఒక జిల్లా, ఒక ఉత్పత్తి" (ఓడిఓపి) విధానాన్ని ప్రవేశపెడుతుందని అన్నారు. "బెంగాల్‌లోని ప్రతి జిల్లాకు దానికంటూ ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి సామాన్య ప్రజలకు తెలివితేటలు, ప్రతిభ మరియు సామర్థం ఉన్నాయి. బిజెపి ప్రతి జిల్లాకు ఒక ప్రణాళికను సిద్ధం చేస్తుంది. దీని ఫలితంగా, సంబంధిత జిల్లా ప్రజలు అత్యధికంగా లబ్ధి పొందుతారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే, జిల్లా ప్రత్యేక ఉత్పత్తులను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో ఓడిఓపి విధానాన్ని ప్రవేశపెడుతుంది" అని ప్రధాని పునరుద్ఘాటించారు. తనపై, బిజెపిపై పగ తీర్చుకోవడానికి మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రజలకు అందకుండా చేస్తోందని మోడీ ఆరోపించారు. "నాపై, బిజెపిపై తృణమూల్ కాంగ్రెస్ చూపిస్తున్న నిరక్ష్యాన్ని అర్థం చేసుకోగలను. కానీ వారు రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత అభివృద్ధి పథకాలను అమలు చేయకుండా అడ్డుకుని, పశ్చిమ బెంగాల్ ప్రజలను కష్టాల్లోకి నెడుతున్నారు" అని ఆయన అన్నారు. "కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మత్స్యకారుల కోసం ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. వివిధ రాష్ట్రాలు తమ తమ ప్రాంతాల్లోని మత్స్యకారుల పేర్లను నమోదు చేస్తున్నాయి. కానీ పశ్చిమ బెంగాల్‌లో దీనిని నిలిపివేశారు. ఈ రాష్ట్రంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి పదే పదే లేఖలు రాస్తున్నా. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నా లేఖలను చదవరు. కానీ కనీసం ఆమె అధికారులు అయినా వాటిని చదవనివ్వండి. ఇక్కడ మత్స్యజీవి యోజనలో మత్స్యకారుల నమోదుకు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించడం లేదు. తృణమూల్ రాష్ట్ర మత్స్యకారుల భవిష్యత్తుతో ఆడుకుంటోంది" అని ప్రధాని మోడీ విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్‌తో ఉన్న రాష్ట్ర అంతర్జాతీయ సరిహద్దుల్లో ముళ్ల కంచె వేయడానికి భూమిని సేకరించడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సహకరించడం లేదని ఆరోపించారు. దీనివల్ల పొరుగు దేశం నుండి చొరబాటుదారులు స్వేచ్ఛగా రాష్ట్రంలోకి ప్రవేశించి తృణమూల్ కాంగ్రెస్‌కు శాశ్వత ఓటు బ్యాంకుగా మారుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి కొత్త పెట్టుబడులను ఆకర్షించడానికి అతిపెద్ద అవరోధంగా ఉందని కూడా ఆయన అన్నారు. రాష్ట్రంలో స్థిరమైన శాంతిభద్రతల పరిస్థితి ఉంటేనే కొత్త పెట్టుబడులు వస్తాయని అభిప్రాయపడ్డారు. 'పశ్చిమ బెంగాల్‌లో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అవినీతి రహిత, హింస రహిత వాతావరణాన్ని అందిస్తుంది, ఇక్కడ మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది' అని చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# అమెరికన్ల మృతికి ప్రతీకారం

## అల్‌ఖైదా అనుబంధ సంస్థ కమాండర్ హతం

**డమాస్కస్, జనవరి 18:** సిరియాలో తమ పౌరులపై గత నెలలో జరిగిన ఘాతుకానికి అమెరికా ప్రతీకారం తీర్చుకుంది. ముగ్గురు అమెరికన్ల మృతికి కారకుడైన ఉగ్రవాద నాయకుడిని వైమానిక దాడిలో హతమార్చినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ధ్రువీకరించింది. ఈ దాడి ఈనెల 16న వాయవ్య సిరియాలో జరిగింది. సెంట్‌కామ్ వివరాల ప్రకారం ఈ దాడిలో అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన కీలక నేత బిలాల్ హసన్ అల్ జాసిమ్ హతమయ్యాడు. డిసెంబర్ 13న పాల్మైరాలో జరిగిన దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు, ఒక అమెరికన్ సివిలియన్ ఇంటర్‌ప్రెటర్ మరణించారు. ఈ దాడికి సూత్రధారి అయిన ఐసిస్ ఉగ్రవాదితో అల్ జాసిమ్‌కు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. డిసెంబర్ దాడి తర్వాత అమెరికా జరిపిన మూడో ప్రతీకార దాడి ఇది. మేం ఎప్పటికీ మర్చిపోం, వదిలిపెట్టం అని రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ హెచ్చరించారు. సెంట్‌కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ, మా బలగాలపై దాడి చేసే ఉగ్రవాదులను వెంబడించడంలో మా సంకల్పాన్ని ఈ ఘటన తెలియజేస్తుంది.



# భోజనాలు చేస్తున్న కార్మికులపైకి దూసుకొచ్చిన కారు

## ఇద్దరు కూలీలు మృతి, 20 మందికి తీవ్రగాయాలు

**జబల్‌పూర్, జనవరి 18:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు కూలీ ప్రాణాలు కోల్పోగా, మరో ఇరవై మంది గాయపడ్డారు. రోడ్డు పక్కన భోజనం చేస్తున్న వారిపైనుంచి ఒక చిన్న కారువేగంగా వచ్చిన దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళా కార్మికులు మృతి చెందారు. వేగంగా వెళ్తున్న కారు అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన స్థలంలో తీవ్ర భయానక వాతావరణం నెలకొంది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఐదుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జబల్పూర్‌లోని బరేలా హైవేపై వేగంగా వచ్చిన క్రెటా కారు గందరగోళానికి కారణమైంది. రోడ్డు పక్కన కూర్చుని భోజనం చేస్తున్న కార్మికులపై కారును వేగంగా దూసుకుపోయింది. ఈ ప్రమాదం గందరగోళంగా మారింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మహిళా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. కార్మికులు హైవేపై గ్రిల్‌కు పెయింట్ వేస్తున్నారు. గుర్తు తెలియని డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన పోలీసులు, అతని కోసం వెతకడం ప్రారంభించారు. బరేలాలోని ఏక్తా చౌక్ వద్ద రోడ్డు డివైడర్ మరమత్తులు, పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. రెండు డజన్లకు పైగా కార్మికులు ఈ పనిలో నిమగ్నమై ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో, కార్మికులు భోజనం చేస్తుండగా, వేగంగా వచ్చిన తెల్లటి కారు అదుపుతప్పి కార్మికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించగా, అనేక మంది గాయపడ్డారని సమాచారం. గాయపడిన వారిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన మహిళలను 40 ఏళ్ల లచు బాయి, చెన్ వటి కెగా గుర్తించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులందరూ మల్లా ప్రాంత నివాసితులు.

# కాంగ్రెస్ జాతీయ పార్టీ హోదా కోల్పోవడం ఖాయం

## ఆ పార్టీ గంజాయి మొక్క: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** జాతీయ పార్టీ హోదా కోల్పోయిన సీపీఐ మహాసభల్లో పాల్గొని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సిన అసలు విషయమేంటంటే.. అతి త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కూడా జాతీయ పార్టీ హోదాను కోల్పోయే పరిస్థితులు దేశ రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు వ్యాఖ్యానించారు. తులసివనంలో కాంగ్రెస్ గంజాయి మొక్క లాంటిదని, దేశానికి కాంగ్రెస్‌తోనే ఎక్కువ ప్రమాదమని చెప్పారు. ఎస్ఐఆర్(సర్) వంటి అత్యంత సున్నితమైన, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై కనీస అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది ఆయన రాజకీయ అపరిపక్వతకు, పాలనా బాధ్యతల పట్ల ఉన్న నిరక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం. ఇలాంటి కీలక జాతీయ అంశాలపై మాట్లాడే ముందు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి కనీస స్థాయి అవగాహన కలిగి ఉండాల్సిందేనని భారతీయ జనతా పార్టీ స్పష్టంగా హెచ్చరిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా దండు కడతామని, బీజేపీ ప్రభుత్వాన్ని కూలదోస్తామని కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారు. కానీ ఆ కలలు నేడు ప్రజల తీర్పుతో నీటమునిగాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికే ప్రజలు దింపుడు కళ్లెం వేశారన్నది స్పష్టమైన వాస్తవమన్నారు. ముఖ్యమంత్రిగా కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడానికి మీ రాజకీయ అసమర్థత కారణం కాదా? ఈ ప్రశ్నకు మీరు సమాధానం చెప్పాలి. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి డీకే అరుణ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, నాయకత్వం, ఆశీర్వాదం, బీజేపీ కార్యకర్తల కృషితో ఘన విజయం సాధించిన విషయం ముఖ్యమంత్రి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికలను తక్కువ చేసి మాట్లాడటం మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా? పిసిసి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయిన వాస్తవాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలి అని చెప్పారు. పదేపదే బీజేపీ బలాన్ని తక్కువ చేసి మాట్లాడే మీరు, ఇటీవలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ మీ స్థానాన్ని గెలుచుకున్న విషయాన్ని మర్చిపోవద్దు అని చెప్పారు. అదానీ, అంబానీ పేర్లు పదేపదే ప్రస్తావించే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి.. మీరు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అంబానీతో కూర్చుని చర్చలు జరిపిన విషయాన్ని ఎందుకు మర్చిపోతున్నారు? అని ప్రశ్నించారు. ఆ సమావేశాల వివరాలను కాంగ్రెస్ పార్టీ ముందుగా వెల్లడించాలని అడిగారు. పేదల ఓటు హక్కు, రేషన్ హక్కులు, ప్రజల స్వేచ్ఛల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు. అధికారాన్ని ఆసరాగా చేసుకుని ప్రజల హక్కులను అణిచివేసిన, వ్యవస్థలను దుర్వినియోగం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే చెందిందన్నారు. దేశాన్ని అభివృద్ధి దిశగా స్పష్టమైన మార్గంలో నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రజల మద్దతు రోజు రోజుకు మరింత బలపడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరాధార ఆరోపణలు, అవాస్తవ వ్యాఖ్యలు ప్రజల తీర్పును మార్చలేవన్న సత్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదన్నారు.

# వన్డే సిరీస్ సాధించిన న్యూజిలాండ్

## 41 పరుగులతో ఓటమి చవిచూసిన టీమిండియా

## శ్రమించినా వృధా అయిన కోహ్లీ సెంచరీ

## ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌లో డారిల్ మిచెల్

## ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా కూడా అతడే!



**ఇండోర్, జనవరి 18:** భారత్‌న్యూజిలాండ్‌జట్లమధ్య జరిగిన మూడో వన్డేలో విరాట్ కోహ్లీ(124) సెంచరీతో గర్జించినా టీమిండియాకు ఓటమి తప్పలేదు. ఇండోర్‌లో జరిగిన ఈమ్యాచ్‌లో 338 పరుగుల ఛేదనలో ఒంటరి సైనికుడిలా పోరాడిన విరాట్‌కు హర్షిత్ రానా(52) అండగా నిలిచాడు. కానీ, రానా ఔటయ్యాక వరుసగా రెండు ఫోర్లు బాదిన కోహ్లీ 46వ ఓవర్ నాలుగో బంతికి వెనుదిరిగాడు. చివరి బంతికి కుల్దీప్ యాదవ్ రనౌట్ కావడంతో న్యూజిలాండ్ 41 రన్స్ తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌చేసిన కివీస్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 337 పరుగులుచేసి భారత్‌కు 338 పరుగుల లక్ష్యం విధించింది. అయితే భారత్ తన బ్యాటింగ్‌లో చివరివరకూ పోరాడినా కోహ్లీ శ్రమకు ఫలితం దక్కలేదు. 296 పరుగులకే టీమిండియా ఆలౌట్ కావడంతో కివీస్ 41పరుగులతేడాతో సిరీస్ ఆధిపత్యం సాధించింది. భారత గడ్డపై ఆ జట్టుకు ఇదే మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. భారత జట్టును స్వదేశంలో ఓడించడం ఏ జట్టుకైనా కష్టమే అనుకునే తరుణంలో న్యూజిలాండ్ రెండోసారి సిరీస్ విజయంతో మేం చేయగలమని రుజువు చేసింది. రెండేళ్ల క్రితం టెస్టు సిరీస్ పట్టేసిన కివీస్ ఈసారి వన్డే సిరీస్‌నూ ఒడిసిపట్టింది. ఇండోర్‌లో ఆద్యంతం ఆసక్తిగా, ఉత్కంఠగా సాగిన మూడో వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో గెలుపొందింది కివీస్‌జట్టు. భారీ ఛేదనలో విజయం దోబూచులాడిన పోరులో విరాట్ కోహ్లీ(124) భారత్‌ను గెలిపించేందుకు చివరిదాకా పోరాడాడు. హర్షిత్ రానా(52) వికెట్ పడడంతో కోహ్లీ వేగంగా ఆడేందుకు ప్రయత్నించి ఔటయ్యాడు. అతడు ఔటైన మరో రెండు బంతులకే ఇండియా ఆలౌటైంది. 2-1తో కివీస్ వన్డే సిరీస్ విజేతగా నిలిచింది. న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ ఛేదనను టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ(11), శుభ్‌మన్ గిల్(23) దూకుడుగా ఆరంభించారు. కానీ, రోహిత్ మరోసారి స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన కెప్టెన్ గిల్‌ను జేమీసన్ బౌల్డ్ చేశాడు. దాంతో, పవర్ ప్లేలోనే 45కే ఓపెనర్లు ఔటయ్యారు. పెద్ద షాట్‌కు యత్నించిన శ్రేయాస్ అయ్యర్(3) మిడాఫ్‌లోనే క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్(1) సైతం స్పిన్నర్ లెనాక్స్ బౌలింగ్‌లో సులువైన క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరారు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి(53) హర్షిత్ రానా(52)లుతో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు కోహ్లీ. రానా సిక్సర్లతో చెలరేగి తొలిఅర్ధశతకం సాధించాడు. విజయానికి 61 రన్స్ అవసరమైన తరుణంలో డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత బంతికే సిరాజ్ వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. రానా ఔటయ్యాక కోహ్లీ గేర్ మార్చాల్సి వచ్చింది. ధాటిగా ఆడే క్రమంలో అతడు బౌండరీ వద్ద మిచెల్ చేతికి చిక్కాడు. దీనితో మ్యాచ్ చేజారింది. గ్లెన్ ఫిలిప్స్ మెరుపు త్రోకు కుల్దీప్ రనౌట్ కావడంతో 46 ఓవర్లో 296కే టీమిండియా కుప్పకూలింది. నిర్ణయాత్మక మూడో వన్డేలో న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్లు చెలరేగిపోయారు. 5 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాలనుకున్న భారత బౌలర్ల వ్యూహాలను తిప్పికొడుతూ డారిల్ మిచెల్(137), గ్లెన్ ఫిలిప్స్(106) కొండంత స్కోర్ అందించారు. క్రీజులో కుదురుకున్న ఈ ద్వయం మిడిల్ ఓవర్లలో ఎడాపెడా ఫోర్లు, చెలరేగి స్కోర్ బోర్డును పరుగులు తీయించారు. సెంచరీ తర్వాత ఇద్దరూ ఔట్ కావడంతో స్కోర్ వేగం తక్కింది. ఆఖర్లో కెప్టెన్ మైఖేల్ బ్రేస్‌వెల్(28 నాటౌట్) ధనాధన్ ఆటతో స్కోర్ 330 దాటించాడు. దాంతో, టీమిండియాకు భారీ పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ద్రోహ బుద్ధి అనేది రేవంత్‌రెడ్డి డిఎన్‌ఎలోనే ఉంది

## మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి18:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మంలో చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. ముమ్మాటికీ రేవంత్ రెడ్డిది ద్రోహ చరిత్ర.. అడుగడుగునా వెన్నుపోట్లు.. అనుక్షణం అబద్ధాలు.. రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానమే ద్రోహాల పుట్ట. ద్రోహ బుద్ధి అనేది రేవంత్ రెడ్డి డీఎన్ఏలోనే ఉందన్నారు. సమైక్యవాదుల కొమ్ముకాస్తూ, స్వరాష్ట్ర కాంక్షతో పోరాడిన ఉద్యమకారుల మీద తుపాకీ ఎక్కుపెట్టిన తెలంగాణ ద్రోహి రేవంత్. చంద్రబాబు తరపున ఎమ్మెల్యేలను కొనేందుకు నోట్ల బ్యాగులు మోస్తూ రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయిన ఓటుకు నోటు దొంగ, ప్రజాస్వామ్య ద్రోహి రేవంత్ అని హరీష్ రావు అన్నారు.

ఎన్టీఆర్ జన్మపర్యంతం ద్వేషించిన కాంగ్రెస్ లో చేరి, నమ్మిన పార్టీకి, నాయకుడికి వెన్నుపోటు పొడిచిన టీడీపీ ద్రోహి. సీఎం పదవి అనుభవిస్తూనే, కేంద్రంలోని బీజేపీతో చీకటి స్నేహాలు చేస్తూ సోనియా గాంధీని, రాహుల్ గాంధీని వంచిస్తున్నారని ఆరోపించారు. కంచె చేను మేసినట్టు తానే ముఖ్యమంత్రి అయి వుండీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా బనకచర్ల లాంటి ప్రాజెక్టులకు కోసం పొరుగు రాష్ట్ర ప్రయోజనాలకు పని చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ద్రోహి రేవంత్. అవినీతి దాహం, ప్రజా ద్రోహం వెరసి రేవంత్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బీజేపీ సర్కార్‌ను వ్యతిరేకిస్తూ ఉంటే.. రేవంత్ మాత్రం బీజేపీ ప్రభుత్వాన్ని భుజాన మోస్తున్న టీడీపీపై బహిరంగంగా అభిమానం కురిపించడం వెనుక మతలబు ఏంటి..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ శత్రువులైన బీజేపీ, టీడీపీ కూటమికి మేలు చేసేలా రేవంత్ వ్యవహారశైలి ఉంది. పగలు రాహుల్ గాంధీ జపం.. రాత్రి బీజేపీ, టీడీపీ దోస్తీ.. రేవంత్ రాజకీయ యాత్ర మొత్తం గురువు చంద్రబాబు కనుసన్నలలోనే సాగుతున్నదన్నారు.


**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 18.01.2026

భారత ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందిన జాతీయ పార్టీగా / తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా / నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) రాష్ట్రాలలో గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా ఉండి గడియారం గుర్తు రిజర్వ్ కాబడి ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) (పార్టీ పేరు) ని రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి అదే గడియారం గుర్తుతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి ఆ పార్టీ అధ్యక్షులు / జనరల్ సెక్రెటరీ అయిన శ్రీ / శ్రీమతి / కుమారి సునీల్ జాదవ్ (రాష్ట్ర అధ్యక్షులు) గారు అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ / శ్రీమతి / కుమారి సునీల్ జాదవ్ (రాష్ట్ర అధ్యక్షులు) గారు, (2) శ్రీ / శ్రీమతి / కుమారి చెప్యాల రేణుకాదేవి (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) గారు, (3) శ్రీ / శ్రీమతి / కుమారి స్వప్న జాదవ్ (రాష్ట్ర ఉపాధ్యక్షురాలు) గారు, (4) శ్రీ / శ్రీమతి / కుమారి లక్ష్మీ జాదవ్ (రాష్ట్ర కోశాధికారి) గారు రాష్ట్ర ప్రధాన కార్యాలయము చిరునామా: 1-1-1/389, సునీల్ జాదవ్ చౌరస్తా, న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, వినాయకనగర్, నిజామాబాద్ దక్షిణ మండలము, జిల్లా నిజామాబాద్ 503001, తెలంగాణ రాష్ట్ర, భారతదేశము, ప్రధాన కార్యవర్గ సభ్యులు, సదరు పార్టీ రిజిస్ట్రేషను పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టిటిసి భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ -500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలేమీ రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల ప్రాతిపదికగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి) (పార్టీ పేరు) ను రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయుచూ గడియారం గుర్తును ఆ పార్టీకి కేటాయిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతుంది.

సునీల్ జాదవ్
తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు
నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి)
(రాజకీయ పార్టీ పేరు)

# దుర్గమ్మ ఆలయంలో నేటి నుండి మాఘమాస పూజలు

**ఇంద్రకీలాద్రి, జనవరి 18, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 19ను మాఘమాసం ప్రారంభం నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈనెల 25, 28, ఫిబ్రవరి 1, 8, 13, 15వ తేదీలలో ప్రత్యేక సూర్య ఉపాసన పూజాదికాలు జరుగుతాయన్నారు. రు.1000ల ఉభయ రుసుము తో దంపతులు పాల్గొనవచ్చున్నారు. అలాగే ఈనెల 23 వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 7 గంటల వరకు యూనిఫారం, గుర్తింపు కార్డుతో వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వారికి 6వ అంతస్థులో శ్రీ అమ్మవారి ప్రసాదంగా పెన్ను, లడ్డూ ప్రసాదం, శక్తికంకణం, శ్రీ అమ్మవారి ఫోటో అందిస్తామన్నారు. 6వ అంతస్థులో ఉచితంగా 500 మందికి అక్షరాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి మాతగా దర్శనమిస్తారన్నారు. అలాగే సరస్వతి హోమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం


కొండపై భక్తుల రద్దీ


పూజలు నిర్వహిస్తున్న పండితులు

అమావాస్య సందర్భంగా నిర్వహించిన చండీహోమం, సూర్య ఉపాసన సేవలో పెద్ద ఎద్దఎత్తున పాల్గొన్నారు. పూజల అనంతరం శ్రీ స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

## సాల్మన్ హత్యపై వినతిపత్రం ఇస్తాం - వెంటనే అపాయింట్‌మెంట్ ఇవ్వండి

### డిజిపికి వైఎస్సార్సీపి లేఖ

**విజయవాడ.జనవరి 18.ప్రభాతవార్తప్రతినిధి:** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో వైయస్సార్‌సీపీకి చెందిన దళిత కార్యకర్త మంద సాల్మన్ దారుణహత్యపై రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం సమర్పించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు తమకు సోమవారం (19వ తేదీ)నాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ, వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. ఊరు విడిచి ఎక్కడో తలదాచుకుంటూ, తన భార్యను చూసేందుకు వచ్చిన, వైయస్సార్‌సీపీ దళిత కార్యకర్త మంద సాల్మన్‌ను పిన్నెల్లిలో దారుణంగా ఐరన్ రాడ్లతో కొట్టి హత్య చేశారని, రాష్ట్రంలో పూర్తిగా దిగజారిన శాంతిభద్రతలకు ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోందని లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దళితులకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోతోందని, ముఖ్యంగా వైయస్సార్‌సీపీ దళిత కార్యకర్తలు ప్రాణ భయంతో బిక్కుబిక్కు మంటున్నారని ఆయన తెలిపారు. సాల్మన్ హత్య కేసులో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, బాధ్యులకు తగిన శిక్ష పడేలా చూడాలని డీజీపీని కోరనున్నామన్నారు.

## రాష్ట్ర పండుగగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం

### - ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పారేపల్లి డూండీ రాకేశ్

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పెనుగొండలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాన్ని సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 25 రాష్ట్ర పండుగలను ప్రకటిస్తే వాటిలో మూడు ఆర్యవైశ్యులకు చెందినవే ఉన్నాయి. ఇది కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇచ్చిన గౌరవం. పొట్టి శ్రీరాములు పేరుతో స్మృతివనం నిర్మించాలని సీఎంని కోరగా స్పందించి అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాలను కేటాయించారు. మార్చి 16న పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నాం.

## సంక్రాంతికి రూ.877 కోట్లకు చేరిన మద్యం అమ్మకాలు

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంక్రాంతి పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. అనువ్యాంగా అమ్మకాలు సాగాయి. కోడిపందెల బరులు, గాన భజనా కార్యక్రమాలో బహిరంగంగానే అడ్డు అదుపు లేకుండా సాగిన నేపథ్యంలో పాన ప్రియులు ఫూల్ బాటిల్స్‌కు మందు లాగించేసారు. దాంతో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో సాగాయి., జనవరి 9 నుండి 16 వరకు, కేవలం వారం రోజుల్లోనే రూ. 877 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. సాధారణ రోజుల్లో రోజుకు రూ. 85 కోట్ల అమ్మకాలు జరిగేవి, కానీ పండుగ సీజన్లో ఇవి రెట్టింపు అయ్యాయి.

# తిరుపతి దాహార్తి తీర్చిన మహానుభావుడు ఎన్టీఆర్

## టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ

**తిరుమల,జనవరి 18 ప్రభాతవార్త:** తిరుపతిలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం అనంతరం ఘనంగా నివాళులు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి వేడుకలు ఆదివారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తిరుపతి టౌన్ క్లబ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు, ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్న నాయకులు విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి ఎన్టీఆర్ అమర్ రహే జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశం గర్వించదగ్గ విదంగా చాటి చెప్పిన మహానుభావుడు నందమూరి తారక రామారావుని గతంలో తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడితే తెలుగు వాడి గొప్పతనాన్ని దేశం నలుదిశల వ్యాప్తి చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. అలాగే తిరుపతి దాహార్తిని తీర్చడానికి తెలుగు గంగను తీసుకొచ్చి తిరుపతి నా దత్త పుత్రిక అన్న మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు అనంతరం శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనునిత్యం తపించే వ్యక్తి ఎన్టీఆర్ అని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆస్తిలో సమాన హక్కులు ఉండాలని కోరుకున్న మహాత్ముడు ఎన్టీఆర్ అని ఆయన అనునిత్యం తెలుగుజాతి గుండెల్లో ఉండిపోతాడని కొనియాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఓ క్రమశిక్షణ కలిగిన ఆదర్శమూర్తిని ఆయన చూపిన దారిలోని నేటి తెలుగుదేశం పార్టీ పయనిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఆ దిశలోనే పయనిస్తున్నారని రాష్ట్ర అభిటిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మవృద్ధి జ్యేయంగా తపిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఓ వ్యక్తి కాదు అని ఓ శక్తి అని కొనియాడారు. అనంతరం యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్ మాట్లాడుతూ రెండు రూపాయల కిలో బియ్యం తీసుకువచ్చి పేద బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి పథంలో నిలపడానికి తపించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. పేదవాడి ఆకలి తీర్చడంతోపాటు కూడు గూడు గుడ్డ అని నినాదంతో ముందుకు సాగిన మహాత్ముడు ఎన్టీఆర్ అని ఎల్లవేళలా పేదవాడి గుండెల్లో నిలిచే ఉంటాడని అన్నారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ తెలుగు స్వాభిమానానికి ప్రతీక - ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళితెలుగు జాతికి గౌరవం, స్వాభిమానము, రాజకీయ చైతన్యం కలిగించిన మహానాయకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మనం శతశః వినమ్ర నివాళులు అర్పిస్తున్నాము. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలు, పాలనలో నూతన దిశ


ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చూపించాయి. ముఖ్యంగా:మండల వ్యవస్థ ప్రవేశపెట్టడంతెలుగు గంగ కాలువ ప్రాజెక్టుమహిళా విశ్వవిద్యాలయం స్థాపమహిళా మెడికల్ కళాశాల స్థాపఆరోగ్య విశ్వవిద్యాలయం మహిళలకు ఆస్తి హక్కు కల్పించడంమద్యపాన నిషేధం అమలురూ.2 కిలో అన్నపూర్ణ పథకం50+ మహిళలకు పింఛన్ పథకంకుడి-దమ కాలువల ఏకీకరజనతా వస్త్రాలు పంపిణీఈ పథకాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో శాశ్వత మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజల సంక్షేమం, తెలుగు సంస్కృతి మరియు రాజకీయ స్వరాజ్యానికి ఎన్టీఆర్ గారి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వందలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

# వేమన వారసత్వాన్ని గర్వంగా చాటుకుందాం

### - గోరంట్లలో జరిగే వేమారెడ్డి విగ్రహావిష్కరణ వేడుకల్లో కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి

**గోరంట్ల, జనవరి 18 ప్రభాతవార్త** యోగివేమన జయంతిని పురస్కరించుకొని గోరంట్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న యోగివేమన విగ్రహావిష్కరణ వేడుకలకు కర్ణాటక రాష్ట్ర రవాణా మరియు దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి మొదటిరోజు కార్యక్రమాలకు ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక మంత్రితో పాటు కర్ణాటక రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు వెంకటశివారెడ్డి, జనరల్ సెక్రెటరీ శేఖర్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ గిరీష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ విగ్రహం వద్దకు వారు చేరుకోగానే మండల రెడ్డి సంఘం నాయకులు సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో నూతన యోగివేమన విగ్రహానికి మంత్రి రామలింగారెడ్డి పూలు జల్లి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కర్ణాటక ప్రముఖులకు సంఘం నాయకులు రాగి మేకలపల్లి గంగాధర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, పద్మనాభరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సమర, నాగభూషణ్‌రెడ్డి, రంగారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు ముఖ్య అతిథులకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రెడ్డి సమాజం ఏకమైతే అన్ని రంగాల్లో మనం అభివృద్ధి చెందుతామని కర్ణాటక రాష్ట్రంలో అక్కడి రెడ్డి సంఘం విద్యకు ప్రాధాన్యతనిస్తోందని, గత వంద సంవత్సరాలుగా ఎలాంటి ఎన్నికలు లేకుండా రాష్ట్ర కమిటీ ఏర్పడుతోందని ఇదే ఐక్యతకు నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.


వేమారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కర్ణాటక మంత్రి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోడీ దాసోహం కావడం సిగ్గు చేటు : సిపిఐ నారాయణ



**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోడీ దాసోహం కావడం సిగ్గుచేటని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె నారాయణ పేర్కొన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచం ఇప్పుడు ఉద్రిక్త వాతావరణంలో ఉందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడును, ఆయన భార్యను కిడ్నాప్ చేయడం అత్యంత బాధాకరమైన చర్యగా అభివర్ణించారు. డ్రగ్స్ సరఫరా నెపంతో వివిధ దేశాలపై అమెరికా దాడులకు తెగపడటం మంచి పరిణామం కాదన్నారు. ట్రంప్ సుంకాల పేరుతో భారీగా భారాలు మోపుతుంటే మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రాజధాని అమరావతి కోసం రెండోసారి భూ సమీకరణ మంచిది కాదన్నారు. తొలి విడత భూ సమీకరణలో భూములిచ్చిన రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ వారి నోట్లో మన్ను కొడుతుందని చెప్పారు. తెలంగాణలోని ఖమ్మంలో పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నేడు జరగనున్నాయని, ఈ కార్యక్రమానికి పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యతో తరలిరానున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు తరలి వచ్చే కార్యకర్తలు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేశామన్నారు. వందేళ్ల పార్టీ చరిత్రలో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతోపాటు ప్రజల జీవన విధానాల్లో ప్రముఖ పాత్ర పోషించినట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు ముగిసిన అనంతరం, మూడు రోజుల పాటు పార్టీ జాతీయ సమితి సమావేశాలు, ప్రపంచ స్థాయి సెమినార్ జరగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ఐదు వామపక్ష పార్టీలు, ఇతర దేశాల నుంచి వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు హాజరవుతారని వెల్లడించారు.



## తుని, పల్నాడు ఘటనల వెనుక వైసిపి గూండాలు

### - అధికారం కోసం జగన్ శవ రాజకీయాలు : మంత్రి సవిత

**పెనుకొండ, జనవరి 18 ప్రభాతవార్త:** జగన్ ప్రోద్బలంతోనే వైసిపి గూండాలు రెచ్చిపోతున్నారని, పండగపూట తుని, పల్నాడులో జరిగిన హత్యలకు ఆయన వ్యాఖ్యలే కారణమని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకుంటుంటే, వైసిపి గూండాలు మాత్రం రప్పా... రప్పా... అంటూ రాష్ట్రంలో దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా రన్నారు. పల్నాడులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణను కూలాలకు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. తుని నియోజక వర్గం కోట నందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, బిసి నేత లాలం బంగారయ్యను అతి కిరాతికంగా హత్య చేశారన్నారు. దాడులకు, హత్యలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని మంత్రి హెచ్చరించారు. ఆదివారం పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. అధికారం కోల్పోవడంతో జగన్ మతిభ్రమించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని, ప్రజలు ఆనందోత్సవాలతో సంక్రాంతి జరుపుకోవడాన్ని చూసి ఓర్వలేకపోతున్నాడన్నారు. హత్య రాజకీయాలకు, శవ రాజకీయాలకు తెర లేపి, వైసీపీ గూండాలతో రాష్ట్రంలో అలజడులు సృష్టించడానికి కుట్ర పన్నాడని జగన్ పై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

# నేడే యోగి వేమన జయంతి వేడుకలు

## వేమన సమాధి ప్రాంతాన్ని టూరిజం సర్క్యూట్‌లో చేర్చాలి: పర్యాటకులు

**అనంతపురం, జనవరి 18, (ప్రభాతవార్త బ్యూరో)** ప్రముఖ సంఘ సంస్కర్త, విశ్వ కవి యోగివేమన జయంతి వేడుకలను ఈ నెల 19 వ తేదీన ప్రభుత్వపరంగా నిర్వహిస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం గాండ్ల పెంట మండలం కటారిపల్లెలో వేమన సమాధి ఉంది. కటారి పల్లెలో ఉన్న వేమన జీవ సమాధిని సందర్శించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు, అభిమానులు వస్తుంటారు. ఇటీవల శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పరంగా అట్టహాసంగా నిర్వహించిన నేపథ్యంలో విశ్వ కవి యోగివేమన జయంతి వేడుకలను కూడా ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న విశేషం. కదిరి ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం తిమ్మమ్మ మర్రిమాను, ప్రముఖ పుణ్యక్షేత్రం కదిరి లక్ష్మీనరసింహస్వామి, విశ్వకవి, సంఘసంస్కర్త అయిన యోగివేమన సమాధి ఉన్న ప్రాంతాలను ఒక టూరిజం సర్క్యూట్ లోకి చేర్చడంతో పాటు యోగివేమన జీవ సమాధి ఉన్న కటారి పల్లె ను అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పలువురు పర్యాటకులు కోరుకుంటున్నారు. గతంలో టూరిజం శాఖ తరపున పెద్ద భవనాలు, రూములు నిర్మించినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడం, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం తదితర కారణాలవల్ల అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకొని విశ్వ కవి యోగివేమన జయంతి నీ ప్రభుత్వపరంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో సీఎం స్పందించి ప్రభుత్వపరంగా వేడుకలు నిర్వహించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# తిరుమల సమాచారం

## అర్ధబ్రహ్మోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

### - 24 నుండి 26 వరకు ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు
### - 25న ప్రోటోకాల్ విఐపిలకే బ్రేక్ దర్శనం





**తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా రానున్న ఆదివారం కలియుగవైకుంఠం ఏడుకొండలపై అర్ధబ్రహ్మోత్సవమ్ (రథసప్తమి) వేడుకలకు టిటిడి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. ఒకరోజు బ్రహ్మోత్సవమ్‌లో ఆలయ మాఢవీధుల్లో ఏడువాహనాల వీక్షణకు లక్షలాదిమంది తరలివచ్చే భక్తులకు అన్ని విభాగాలు, శాఖలు సమన్వయంతో స్నేహపూర్వక సేవలందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈనెల 25వతేదీ ఆదివారం తిరుమలలో రథసప్తమివేడుకలు జరగనున్నాయి. ఆరోజు ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. ఆ రోజు భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు. 24వతేదీ నుండి 26వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.

**- ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:** ఆదివారం ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం,

ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు నిర్వహిస్తారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి: హైకోర్టు న్యాయమూర్తి

**తిరుమల,జనవరి 18 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందరిపై ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ వేడుకున్నారు. ఆదివారం ఉదయం న్యాయ మూర్తి దంపతులు ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అందరి అభిమానంతో 'నారీనారీనడుమమురారీ' విజయవంతం

### - శ్రీవారి సేవలో నటుడు శర్వానంద్

**తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, నారీనారీనడుమమురారీ కథతో విడుదలైన చిత్రం విజయవంతం కావడం ఆనందంగా ఉందని సినీనటులు శర్వానంద్, సాక్షివైద్య తెలిపారు. చిత్రం హిట్ కావడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నా మన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన చిత్ర బృందం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాలు సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు చిత్ర బృందానికి స్వాగతం పలికి ప్రత్యేకదర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటీనటులను చూడటానికి, ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. స్వయంగా నటుడు శర్వానంద్ ఆలయం ముందు శ్రీవారి సేవకులను పలకరించి వారి సేవలను అభినందించారు.



# తొమ్మిది జిల్లాల పరిధిలో విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679చిత్తూరు: 7993147979నెల్లూరు: 08612320427అన్నమయ్య: 9440817449కడప: 08562242457కర్నూలు: 7382614308నంద్యాల: 7382618976 అనంతపురం: 9154790350శ్రీసత్యసాయి: 9963707847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కొండపై అరకొర పార్కింగ్ స్థలాలు!

## రోడ్లపైనే భక్తుల వాహనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమలకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు లక్షమంది వరకు భక్తులు...ఐదారు వేలకు పైగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు ఇలా తిరుమలకు వస్తున్నాయి. వచ్చిన వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలనేది భక్తులకు తలనొప్పివ్యవహారంగా మారింది. తిరుమలకొండపై ప్రస్తుతం సుమారుగా నాలుగువేల వరకు వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఉంది. ఆ పై వాహనాల సంఖ్య పెరిగితే ప్రధానంగా వరాహస్వామి విశ్రాంతి గృహాలు, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి, వైకుంఠమ్ 2 ప్రాంతాల్లో రోడ్లపైనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేయడం కనిపిస్తుంది. రోజువారీగా తిరుమలకు ఐదారువేలవరకు నాలుగుచక్రవాహనాలు వస్తున్నాయనేది టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసుల సమాచారం. ఇలా వస్తున్న వారిలో అధికశాతంమంది భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహా రాష్ట్ర, ఒరిస్సా, కేరళ రాష్ట్రాల నుండి యాత్రికులు పుణ్యక్షేత్రాల సందర్శనపేరుతో తిరు మలకు చేరుకుంటున్నారు. తిరుమలలో ఏటిసి కార్‌పార్కింగ్, ముళ్ళగుంట, పాపవినాశనమ్ మార్గంలో, పాత డిటైప్ ప్రాంతం, కౌస్తుభం ,బాలాజీ నగర్ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. ఇక ఏదేని ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో అదనంగాపార్కింగ్ స్థలాలు గుర్తించి వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు.



## ఉన్నట్టుండి ఏడుస్తున్నారా?

పసిపిల్లలు విద్రలో ఉన్నట్టుండి ఏడుస్తుంటారు. అసలు వాళ్లు ఎందుకు ఏడుస్తున్నారో తెలియక కొత్తగా తల్లైనవారు కంగారు పడుతుంటారు. అయితే నెలలు నిండుతున్న పిల్లలు రాత్రుళ్లు ఏడవడానికి సెపరేషన్ యాంగ్జైట్ ఒక కారణమంటు న్నారు నిపుణులు. అదేంటి? దాన్ని ఎలా అధిగమించాలంటే... 6 నుంచీ 10 నెలల వయసున్న పిల్లలు నెమ్మదిగా చుట్టూ ఉన్న వాతావరణాన్నీ మనుషుల్నీ గుర్తుపట్టడం ప్రారంభిస్తారు. వాళ్ల అలనాపాలనా చూసుకునే తల్లిని అంటిపెట్టుకుని ఉండాలను కుంటారు. వాళ్లు కనపడకపోతే ఏడుస్తారు. అదే రాత్రుళ్లు నిద్రలోనూ గుర్తొస్తుందట. అందుకే ఉన్నట్టుండి ఉలిక్కిపడటం, ఏడవడం చేస్తుంటారు. దీన్నే సెపరేషన్ యాంగ్జైటీ అంటారు. అయితే ఇది పసిపిల్లల్లో సర్వసాధారణం. కంగారుపడ కుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్ని పెద్దవాళ్లకు నెమ్మదిగా అలవాటు చేయాలి. రోజులో కాసేపైనా కనిపించకుండా ఉండాలి. బయటకు వెళ్లొస్తుండాలి. అలాఅని వాళ్లు నిద్రపోయేట ప్పుడో, మిమ్మల్ని గమనించకుండా ఆడుకునేటప్పుడో కాదు. అలా చేయడం వల్ల నిద్రలేచేటప్పటికి మీరు లేకపోతే వారిలో ప్రతికూల భావాలు ఏర్పడతాయి. అవే వాళ్లలో భయాన్నీ పెంచుతాయి. మీరు బయటకు వెళ్తున్నారు. తిరిగి వచ్చేప్పటికి కొంత సమయం పడుతుంది అన్న భావన వాళ్లలో కలిగేలా బయలుదేరాలి. అప్పుడే వారికి ఆ పరిస్థితి అర్థమవుతుంది. ఈ ఆందోళనా దూరమవుతుంది. అయితే ఇది నెలల పిల్లల్లోనే కాదు మూడేళ్ల వయసు వచ్చేవరకూ ఉంటుంది. అందుకే గృహిణులైనా, ఉద్యోగినులైనా పిల్లలతో కాసేపయినా ఎడబాటుగా ఉండటం మంచిదంటున్నారు నిపుణులు. □

## పరిశుభ్రతకు పండ్ల తొక్కలు !



**విటమిన్లు పుష్కలంగా ఉండే పండ్లు ఆరోగ్య పరిరక్షణకే కాదు, ఇంటి పరిశుభ్రతనే. పనిచేస్తాయని తెలుసా అయితే ఈ మాయ చేసేది మాత్రం వాటి తొక్కలు, సాధా రణంగా ఇంటి క్రిమింగ్‌లో రసాయనాల ద్రావణా లను వినియోగించి రకరకాల అలర్జీలకు గురి అవు తుంటాం. ఇవి వాటి నుంచి మనల్ని కాపాడటమే కాదు... పర్యావరణానికి హాని కలిగించవు. అదెలాంటే...**

నిమ్మ, నారింజ పండ్లలో సిట్రిక్ యాసిడ్ పుష్కలం. దీంతో వీటి తొక్కలు క్లీనింగ్ ఏజెంట్‌గా మురికిని ఇట్టే పోగడతాయి. ఈ పండ్ల తొక్కలను గుప్పెడు తీసుకుని ఓ ప్లాస్టిక్ పాత్రలో వేయాలి. ఇందులో అయిదారు చెంచాల వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి మూత పెట్టాలి. ఈ మిశ్రమాన్ని రెండు లేదా మూడువారాలు నాననివ్వాలి. ఆ తర్వాత దీన్ని వడకట్టి సమపాళ్లలో నీటిని కలిపితే అల్పర్పస్ క్లీన సిద్ధమవు తుంది. దీన్ని స్ప్రేబాటిల్లో నింపి తలుపులు, కిటికీలు, టీపాయి అద్దాలు, పొయ్యి చుట్టుపక్కల దిమ్మ వంటింట్లోని సింక్ వంటివాటిపై స్ప్రేచేసి పదినిమిషాల తర్వాతతుడిస్తే చాలు. మురికి దూరమవుతుంది.

**అద్దాలకు ప్రత్యేకం...** అరటిపండు తొక్క అర్ధాలకు ప్రత్యేక క్లీనర్గా పనిచేస్తుంది. మురికి ఉన్న చోట ఈ పండు తొక్క లోపలివైపుతో మృదువుగా రుద్దాలి. ఆ తర్వాత మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు. ఈ తొక్కలోని స్టార్చ్ మురికిని, మచ్చలను తొలగిస్తుంది.

**మైక్రోవేవ్ అవెన్‌ను..** ఇందులో ఆహారపదార్థాల అవశేషాలు ఉండిపోయి వేడికి ఎండిపోతాయి. వాటిని సాధారణంగా క్లీన్ చేయడం కష్టమవుతుంది. గుప్పెడు నిమ్మతొక్కల ముక్కలను నీటిని నింపిన బౌల్లో వేసి అయిదు నిమిషాలపాటు మైక్రోవేవ్లో ఉంచి వేడి చేయాలి. నిమ్మరసం ఆవిరి లోపలంతా వ్యాప్తి చెందుతుంది. అప్పై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు ఎండిపోయి అవెన్కి పట్టేసిన పదార్థాలన్నింటినీ తేలికగా తుడిచేయొచ్చు.

**ఫర్నిచర్ :** సోఫా, టీపాయి, డైనింగ్ టేబుల్‌వంటి చెక్క ఫర్నిచర్‌పై దుమ్ము ఎక్కువగా పేరుకుంటుంది. క్రమేణా ఇది మరకలుగా మారుతుంది. కొన్నిసార్లు నూనె జిడ్డు అంటుకుని ఎంత శుభ్రం చేసినా పోదు. ఇటువంటి మరకలను దూరం చేయడానికి పండ్ల తొక్కలు చాలు. నారింజ, నిమ్మ లేదా అరటి పండు తొక్క లోపలివైపుతో మరకలున్న చోట మృదువుగా రుద్ది, ఆపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాఉ. ఆ ప్రాంత మంతా క్షణాల్లో శుభ్రపడు తుంది. □

## కేన్సర్ బాధితులకు సేవలు అందిస్తూ..


మినాతి

విధి, అనారోగ్యం... ఈ విష యంలో అడుగడుగునా పోరాడు తూనే ఉన్నారామె. అయినా వెనుదిరగ లేదు. పైగా దేశవిదేశాల్లో తనలాంటి వాళ్లలో స్ఫూర్తినీ ధైర్యాన్నీ నింపుతున్నారు... మినతి బోర్రా కూర్! ఇంతకీ ఎవరీమె? ఆమె ప్రయాణమేంటో తెలుసుకుందాం..

కడుపులో నొప్పి. మొదట మామూలుగానే మొదలైంది. తరవాత తీవ్రమైంది. కానీ రిసెర్చ్ కారణంగా చికిత్సకు సమ యం కేటాయించలేని పరిస్థితి. ఒకానొకరోజు తట్టుకోలేక పోయారు. అప్పుడు ఆసుపత్రికి వెళ్తే... క్యాన్సర్ అని తేలింది. అది కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, పాకింది. దీంతో ముంబయి లోని టాటా హాస్పిటల్‌లో చేర్చారు. బతక డం కష్టమే అన్నారు వైద్యులు. కానీ ఆమె మనసు లో ఒకే ప్రశ్న 'ఇలా వదిలేసి ఊరుకోవడ మేనా!' అని, తనవంతుగా బతకడానికే ప్రయ త్నించాలి అనుకున్నా రామె. దానికితోడు భర్త నికుంజ్ బిహారి బోర్రాకూర్ కూడా ఆమెతో క్యాన్సర్‌ని జయించిన వారి జీవితాల పుస్తకాలను చదివేవారు. వాళ్ల స్ఫూర్తితో పట్టుదలగా ప్రయత్నించా రామె. సర్జరీ, రేడియేషన్ల కారణంగా జుట్టు ఊడిపోయింది. రోజంతా వాంతులు, విరేచనాలు... బక్కచిక్కి పోయారు. అయినా పోషకాహారం తీసుకుంటూ యోగా, ప్రాణాయా మం కొనసాగిస్తూ మానసికంగా దృఢంగా మారారు. ఆమె ధైర్యానికి క్యాన్సర్ తలవంచక తప్పలేదు. ఇదంతా 1994 నాటి మాట.

**పిల్లలను కోల్పోయి...** మినతిది అసోంలోని గువాహటి. విధితో పోరాటం ఆమెకు కొత్తేమీ కాదు. చిన్న వయసులోనే పెళ్లి, ముగ్గురు పిల్లలు. కానీ ఆర్వైచ్ డిసీజ్ కారణంగా వెంటవెంటనే చనిపోయారు. ఆ బాధ తట్టుకోవ డం ఆమెకు చాలా కష్టమైంది. దాన్నుంచి బయటపడటానికి చదువు మీద దృష్టిపెట్టారు. చదువుకున్న కాటన్ కాలేజీలోనే ప్రొఫెసర్‌గా చేసి, ఫిలాసఫీ ఉన్నత స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలోనే ఎన్నో రిసెర్చ్ పేపర్లు రాశారామె. ఉద్యోగం కొనసాగిస్తూనే క్యాన్సర్ బాధితులకు ఉచితంగా కౌన్సెలింగ్, ఇతర సాయాలు చేయడం మొదలుపెట్టారు. కౌన్సెలింగ్, మెడిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. తన ఏడాది క్యాన్సర్ చికిత్స అను భవాలను మోర్ ఒషూకోర్ ఎబోసర్: ఎజోన్ క్యాన్సర్ రోగి ఒబిగోటా (రోగిగా ఏడాది క్యాన్సర్ బాదితురాలిగా నా అను భవాలు) అంటే పుస్తక రూపంలో తీసుకొచ్చారు.

**రెండో యుద్ధం... 2009...** అనారోగ్యానికి గురైన భర్తకి సేవలు అందిస్తూ మినతి విపరీతమైననొప్పి. పరీక్ష చేయించుకుంటే క్యాన్సర్ తిరగబెట్టింది... ఈసారి పెల్విక్, వెన్నెముక ప్రాంతాల్లో వచ్చింది. మినతి భయపడలేదు. కానీ ఆమె భర్త ఒత్తిడికి గురయ్యారు. దాంతో గుండెపోటుకు గురై మరణిం చారు. అప్పుడు డీలాపడ్డారు మినతి. ఆయన లేని లోటును తట్టుకోలేకపోయారు. తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. అప్పుడు తనలాంటి వాళ్ల గురించి ఆలోచించిన మినాతి తిరిగి పోరాటం మొదలుపెట్టారు. ఈసారీ గెలిచారు. ఆ ప్రయాణాన్ని 'కొలిజా కైతే బిందిలే ఇ చోరాయే గాన్ గాయే' (హృదయానికి ముల్లు గుచ్చుకున్న పక్షి పాడే పాట) పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. కేన్సర్ బాధితులకు డైట్, న్యూటిషన్, ప్రాణాయామం, ధైర్యంగా సమస్యతో పోరాడటం.. ఇలా ఎన్నో అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన సేవల్ని శ్రీలంక, అమెరికా, ఆస్ట్రేలియా సహా24 దేశాలకు విస్తరించారు. □

## శివ నామం



రామకోటి కోటిసార్లు 'శ్రీరామ' అని రాస్తే ఎంతో పుణ్యమని, మోక్షం లభిస్తుందని విష్ణు భక్తులు ,శివకేశవులను సమానంగా చూసేవారు నమ్ముతారు . శైవులు కైవల్యాన్ని పొందడానికి రామకోటికిబదులుగా శివకోటిని రాస్తారు . రామ నామం తరింపజేసేదని కాశీలో మరణించేవారి చెవిలో శివుడు ఆ తారక మంత్రాన్ని వినిపిస్తాడని చెబుతూ ఉంటారు . ఆ రామ నామానికి ఎటు వంటి శక్తి ఉందో శివనామానికి కూడా అంత మహిమ ఉందంటారు .శివనామం అంటే ఒక్క 'శివ'అనే నామం ఒక్కటే కాదు . శివునికి చాలా నామాలున్నాయి. వాటిల్లో దేనిని ఉచ్చరించినా పాపాలు నశిస్తాయని చెబుతారు . సామాన్య పాపాలేకాదు మహాపాపాలు కూడా నశిసా యంటారు . శివనామ మహిమ అంత గొప్పది. నిశ్చలమైన మనస్సుతో దేవదేవు డైన పరమేశ్వరుడిని స్తుతిస్తూ , స్మరిం చేవారికి ఎలాంటి ఆపదలు రావని, తన భక్తుల రక్షణ ఆయనేచూసు కుంటాడని భక్తుల విశ్వాసం .

-కాయల నాగేంద్ర,

## చాడీలు వద్దు !



**ఎంత ప్రాణ స్నేహితులైనా..** అప్పుడప్పుడూ వారి మధ్యా చిన్న చిన్న అపార్థాలు చోటుచేసు కుంటాయి. అయితే ఈ క్రమంలో కొంతమంది ఈ గొడవలు గురించి ఇతర స్నేహితులతో పంచు కోవడం, వారి గురించి నెగెటివ్‌గా చెప్పడం, లేనిపోని చాడీలు చెప్పడం.. వంటివిచేస్తుంటారు. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోవడమంటే ఇదే అంటున్నారు నిపుణులు. దీనివల్ల మీ గురించి, మీ స్నేహం గురించి అవతలి వారికి నెగెటివ్ అభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే మీ ప్రాణ స్నేహితురాలికీ మీపై ఉన్న సదభిప్రాయం దెబ్బతింటుంది. ఫలితంగా గొడవలు మరింత పెద్దవవుతాయి. మీ మధ్య స్నేహబంధమూ సన్నగిల్లుతుంది. ఇన్ని సమస్యలు కొనితెచ్చు కోవడం కంటే ఓపికతో మీరిద్దరే గొడవల్ని సామరస్యంగా పరిష్కరించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా మీ స్నేహబంధమూ మరింత దృఢమవు తుందని చెబుతున్నారు. □

## ఒత్తిడిని తరిమే గులాబీ టీ !



పనిఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు ఉపశమనాన్ని అందిస్తుందీ గులాబీరేకల టీ. తయారీకి మూడు కప్పుల పాలు, మూడు స్పూన్ల చొప్పున టీపొడి, చక్కెర, మూడు యాలకులు, ఒక అనాసపువ్వు, సమానపాళ్లలో నీటిలో నానబెట్టి మెత్తగా చేసిన జీడిపప్పు, బాదంపప్పు పేస్టు పావుకప్పు, అలాగే రెండు టేబుల్ స్పూన్ల నీటిలో నానబెట్టి చేసిన గులాబీరేకల పేస్టు.రెండు కప్పుల నీటిలో టీపొడి, గులాబీరేకుల పేస్టు కలపాలి. ఆపై అనాసపువ్వు, యాలకులు వేసి చిక్కగా మరిగించి డికాక్షన్‌ను వడకట్టాలి. మరొక గిన్నెలో పాలు, చక్కెర కలిపి మరిగిస్తూ బాదం, జీడిపప్పుల పేస్టు కలపాలి. ఇందులో డికాక్షన్ వేసి అయిదు నిమిషాలపాటు మరిగిస్తే చాలు. పోషకాలతో కూడిన రుచికరమైన ఛాయ్ సిద్ధం. గులాబీ రేకల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ ఆక్సిజన్ రాడికల్స్‌ను తొలగిం చడంలో సహాయపడు తుంది. దీన్లోని ఎ,సి విటమిన్లు వ్యాధి నిరోధకశక్తిని పెంచు తాయి. వీటిలో ఉండే ఫ్లేవనాయిడ్స్ నాడీవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీనితో ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి సుఖనిద్రనిస్తాయి. □

# తెర

## ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు: రవితేజ



మాస్ మహారాజా రవితేజ సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో డింపుల్ హయతి, ఆశికా రంగనాథ్ కథానాయిక లుగా నటించారు. జనవరి 13న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మీట్ నిర్వ హించారు. బ్లాక్ బస్టర్ మీట్ లోమాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ, అందరికీ హాయ్. చాలా హ్యాపీగా ఉంది. ఆర్ డైరెక్టర్ ప్రకాష్, డిఓపి ప్రసాద్‌తో ఎన్నో ఏళ్ళుగా వర్క్ చేస్తున్నాను. వాళ్ళతో కలిసి మరోసారి పనిచేయడం ఎంత ఆనందాన్నిచ్చింది. ప్రసాద్ సినిమాని చాలా కలర్‌ఫుల్‌గా తీశారు. మురళీధర్ గౌడ్ అద్భుతంగా చేశారు. తన జోక్స్‌కి థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేస్తున్నారు. డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సినిమాకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షక మహాశయులందరికీ థాంక్యూ. థియేటర్ విజిట్స్‌కి వెళ్ళాను. నాన్ స్టాప్‌గా నవ్వుతున్నారు. ప్రతి క్యారెక్టర్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. ఫన్ చాలా ఆర్గానిక్ అని ఉందని చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. రవితేజ లాంటి పెద్ద హీరోతో సినిమా చేస్తున్నప్పుడు ప్రతి క్రాఫ్ట్‌ని ఎలా హ్యాండిల్ చేయాలనే ఒక టెన్షన్ ఉండేది. అయితే రవితేజ ఎంతో అద్భుతంగా సపోర్ట్ చేశారు ఒకటి దర్శకుడుగా మరో అడుగు ముందుకు వెళ్ళ గలిగాను. మాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన రవితేజకి నిర్మాత సుధాకర్‌కి ధన్య వాదాలు. ఆ టెక్నీ షియన్స్ అందరికీ థాంక్స్. డింపుల్ ఆశికా సునీల్‌కిషోర్ సత్య అన్ని పాత్రలు కూడా హిలేరియస్‌గా వచ్చాయి. అందరూ థియేటర్‌కి వెళ్ళండి. కచ్చితంగా సినిమా చూసి ఎంజాయ్ చేస్తారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, సంక్రాంతికి అద్భుతమైన బ్లాక్బస్టర్ ఇచ్చిన ఆడియన్స్ అందరికీ కృతజ్ఞతలు. ఇంత కాంపిటీషన్లో కూడా పెద్ద హిట్ ఇచ్చినందుకు తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇంకా చూడని వారు ఉంటే తప్పకుండా థియేటర్స్‌కి వెళ్లి చూడండి. ఫుల్ ఎంటర్టైన్మెంట్. మా హీరో రవితేజకి డైరెక్టర్ కిషోర్‌కి అలాగే వెన్నెల కిషోర్‌కి సునీల్ అన్నకి అందరికీ థాంక్స్. సునీల్ మాట్లాడుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఇంత అద్భుతంగా ఆదరించిన ప్రేక్షకులు అందరికీ కృతజ్ఞతలు అని అన్నారు.

## 5వ రోజు ఆల్‌టైమ్ రికార్డ్ 226 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్



మెగాస్టార్ చిరంజీవి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' ఈ సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తోంది.అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లను పండుగ వేడుకలుగా మార్చింది. తెలుగు రాష్ట్రాలలో భారీగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తోంది.'మన శంకరవరప్రసాద్ గారు' 5వ రోజు ఏపీ/తెలంగాణలో పెద్ద సంఖ్యలో వసూళ్లు సాధించింది, గత రికార్డును బద్దలు కొట్టింది. పరిశ్రమలో అత్యధిక 5వ రోజు వసూళ్లు సాధించిన చిత్రంగా మన శంకర వరప్రసాద్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది.కేవలం ఐదు రోజుల్లో 2.5 మిలియన్లకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి, ప్రపంచ వ్యాప్తంగా 226రూ.కోట్లు వసూళ్లు సాధించింది. ఆరవ, ఏడవ రోజు నెంబర్స్ కూడా భారీగా ఉండబోతున్నాయి. అద్భుతమైన మోత్ టాక్‌తో థియేటర్లు హౌస్‌ఫుల్ షోలతో సందడి చేస్తున్నాయి.

## 'పెద్ది' 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్ఇండియా మూవీ 'పెద్ది' త్వరలోనే బిగ్ షెడ్యూల్ ప్రారంభం మార్చి 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.త్వరలోనే ఈ చిత్రం బిగ్ షెడ్యూల్ ప్రారంభం కాబోతోంది. ఈ షెడ్యూల్ కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. తాజాగా విడుదలైన స్టిల్‌లో రామ్ చరణ్ బీస్ట్ మోడ్ లో కనిపించడం అదిరిపోయింది. రాక్ సాలిడ్ మసిల్స్, ఇంటెన్స్‌గా కనిపించిన లుక్ క్షణాల్లో వైరల్ అయ్యింది.పెద్ది ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఎఆర్ రెహమాన్ మ్యూజిక్, రామ్‌చరణ్ వైరల్ డ్యాన్స్‌తో ఈ సాంగ్ గ్లోబల్ మూమెంట్‌గా మారింది. త్వరలోనే మరో పాటని రిలీజ్ చేయబోతున్నారు.వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్.మార్చి 27న పెద్ది గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కాబోతుందని మేకర్స్ మరోసారి అనౌన్స్ చేశారు.

## వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో హారర్ -కామెడీ ఫిలిమ్



వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్, ఎస్ థమన్ -విటి 15 టైటిల్ గ్లింప్స్ జనవరి 19న రిలీజ్‌మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ -విటి 15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యువి కియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా రూపొందుతోంది.ఈ చిత్రానికి సంబధించి మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ జనవరి 19న రిలీజ్ చేయబోతున్నారు.ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది.

## 23న విజయ్, సమంతల సినిమా 'పోలీస్' రీ రిలీజ్



స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంతజంటగా, సెన్సేషనల్ డైరెక్టర్‌అట్లీ దర్శకత్వంలోవిక్రియేషన్స్ పతాకంపై కలైపులి థానునిర్మించిన తమిళ చిత్రం'తెరి'ఘనవిజయం సాధించింది. తెలుగులో' పోలీస్' పేరుతో అనువాదమై ప్రేక్షకులహృదయాలను దోచుకుని సూపర్‌హిట్‌చిత్రంలా నిలిచింది .ఈచిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది.

ఈ 'పోలీస్' చిత్రం ఈనెల 23న రీరిలీజ్ కానుంది.ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు,ఆంధ్రాలో సురేష్ మూవీస్ వారు భారీస్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రీరిలీజ్ వార్తతో సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తుండగా, విజయ్ అభిమానులతోపాటు సినిమాప్రేమికులు మరోసారి ఈఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగాఎదురు చూస్తున్నారు. తండ్రి-కూతురు అనుబంధం,పోలీస్‌బ్యాక్‌డ్రాప్,భావోద్వేగాలు, యాక్షన్,కమర్షియల్‌ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవించి అట్లీ ఈ 'పోలీస్'చిత్రాన్ని రూపొందించారు. విజయ్ ద్విపాత్రాభినయంలో మెప్పించగా, సమంతపాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.అలాగే మరో హీరోయిన్‌గా అమీ జాక్సన్ నటించారు. ప్రభు,రాధికశరత్‌కుమార్‌పాత్రలు కూడాఈచిత్రానికికీలకం.ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి.ఈచిత్రానికి సంగీతం అందించిన జీవీ ప్రకాష్ కుమార్ పాటలు అప్పట్లోచార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. నేపథ్యసంగీతం, సినిమాటోగ్రఫీ,యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించడంలో కీలకపాత్ర పోషించాయి. ఈ 'పోలీస్' విజయ్‌కు తెలుగులో కూడా బలమైన అభిమాన వర్గాన్ని మరింత పెంచింది. ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో మెరుగైన క్వాలిటీతో రీరిలీజ్ అవుతున్న ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్‌వద్ద తనసత్తా చాటుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్, సమంతల అభిమానులకు ఇది నిజంగా ఒక తీపి వార్త.

## స్పెషల్ మూమెంట్‌గా వస్తోన్న 'యుఫోరియా' సినిమా

బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ రూపొందించిన లేటెస్ట్ మూవీ ,యుఫోరియా'. శ్రీమతి రాగిణి గుణ సమర్పణలో గుణహ్యాండ్ మేడ్ ఫిల్మ్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నూతన నటీనటులతో గుణశేఖర్ నేటి యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పోలీస్ కమిషనర్ జయదేవ్ నాయర్‌గా ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ కేసును ఛేదించే క్రమంలో ఆయన. పోక్సో'చట్టాన్ని ఎలా ప్రయోగించారు? ఆధారాలను ఎలా సేకరించారు? అనే అంశాలను గుణశేఖర్ ఎంతో సహజంగా తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. నటుడు విఘ్నేష్ గవిరెడ్డి మాట్లాడుతూ,మ్యూజిక్ చాలా బాగుంది. నేను కాలభైరవ ఫ్యాన్. నా సినిమా ఆయన సంగీతం ఇవ్వడం నాకు చాలా గర్వంగా ఉంది. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, ట్రైలర్ చూశాక చాలా ఎమోషన్‌గా అనిపించింది. ఇంత ఇంపాక్ట్ ఉన్న సినిమాను తీసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుంది. అని చెప్పారు. సీనియర్ నటి భూమిక మాట్లాడుతూ,యుఫోరియా నాకు చాలా స్పెషల్ జర్నీ. 23ఏళ్ల తర్వాత గుణశేఖర్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఆయన ఫ్యామిలీ ఈ సినిమా కోసం 24 గంటలూ కష్టపడి పని చేశారు. ఇది నా కెరీర్‌లోనే స్పెషల్ సినిమా అవుతుంది. బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణశేఖర్ మాట్లాడుతూ,మా అమ్మాయి నీలిమా ఎప్పుడూ ఇంత ఎమోషన్ అవదు. కానీ ఇప్పుడు ట్రైలర్ చూసి ఎమోషన్ అయిందంటే.. ఈ కథ అంతగా ఇంపాక్ట్ చేసింది. మా కుటుంబం మొత్తం ఈ స్టోరీకి కనెక్ట్ అయింది. అలాగే మీ అందరికీ ఈ సినిమా ఎమోషన్ కనెక్ట్ అవుతుంది.



## వరల్డ్ టేబుల్ టెన్నిస్ నుంచి మనికా నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ 2026, స్టార్ కంటెండర్ దోహా ప్రీక్వార్టర్ ఫైనల్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ మానికా బాత్రా ఓటమితో భారత్ ప్రచారం ముగిసింది. రౌండ్ ఆఫ్ 16కి అర్హత సాధించిన ఏకైక భారతీయురాలు మనికా రికార్డు సృష్టించినా ఫైనల్లో పరాజయంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఖతార్‌లో జరిగిన మకావోకు చెందిన జు యులింగ్ చేతిలో ఓడిపోయింది. కేవలం 23 నిమిషాల పాటు కొనసాగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 5వ నంబర్ క్రీడాకారిణి యులింగ్ చేతిలో 6-11, 5-11, 9-11 తేడాతో ఓడిపోయింది. అంతకుముందు, ఆమె చైనాకు చెందిన ప్రస్తుత అండర్19 ప్రపంచ ఛాంపియన్ యుజువాన్ క్విన్, దక్షి ణ కొరియాకు చెందిన 16వ సీడ్ లీ యున్హేపై రెండు మంచి విజయాలు సాధించి మనికా చివరి 16లోకి చేరుకుంది.

ప్రారంభం నుండి ఆమెపై ఝూ పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. దీంతో మొదటి రెండు ఆటల నుండి కేవలం 11 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. మూడవ గేమ్‌లో బలంగా ఆడి 9-6 ఆధిక్యాన్ని సాధించింది. కానీ ఆ తర్వాత ఆమె తన జోరును కోల్పోయి వరుసగా ఐదు పాయింట్లను కోల్పోయింది. అంతకుముందు, ప్రధాన డ్రాలో ఉన్న మరో ముగ్గురు భారత మహిళల సింగిల్స్ క్రీడాకారిణులు అయిహికా ముఖర్జీ, స్వస్తిక ఘోష్, తనీషా కోటేచ్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో, సత్యన్ జ్ఞానశేఖరన్, మనుష్ షా, మానవ్ ఠక్కర్ ప్రధాన డ్రాలో పోటీ పడ్డా, వారు 64వ రౌండ్‌లో ఓటమితో నిష్క్రమించారు.

## హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ జట్టు గెలుపు

### 6-0తో బెంగాల్ టైగర్స్ చిత్తు



**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్-2026 టోర్నీలో బెంగాల్ టైగర్స్‌పై 6-0 తేడాతో హైదరాబాద్ టూఫాన్స్ ఆధిక్యంలో ప్రారంభించింది. హైదరాబాద్ తరఫున జాకరీ వాలెస్ (2వ నిముషం, 17, 30), టిమ్ బ్రాండ్ (12, 39, 46) హ్యాట్రిక్ సాధించారు. తొలి క్వార్టర్‌లోనే రెండో నిమిషంలోనే హైదరాబాద్ గోల్ చేయడం ప్రారంభించింది. టిమ్ బ్రాండ్ (12) ఆధిక్యాన్ని పెంచాడు. 16వ నిమిషంలో హైదరాబాద్ టూఫాన్స్ రెండవ క్వార్టర్‌లో తమ గోల్ పరంపరను కొనసాగించింది. 19వ నిమిషంలో అభిషేక్ బెంగాల్‌కు మంచి అవకాశాన్ని సృష్టించాడు. అతను గోల్‌పై బలమైన షాట్ కొట్టినా దాన్ని హైదరాబాద్ గోల్ కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ఆపాడు. మొదటి అర్ధభాగం ముగియడానికి 20 సెకన్లు మిగిలి ఉండగా టూఫాన్స్ మరో గోల్ చేసింది. మూడవ క్వార్టర్ రెండు జట్ల మధ్య గట్టి పోటీతో ప్రారంభమైంది. అయితే, హైదరాబాద్ తమ ఐదవ గోల్ చేయడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 39వ నిమిషంలో అర్ష్‌దీప్ సింగ్ బేస్‌లైన్ వెంట అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించాడు. నాల్గవ క్వార్టర్ మొదటి నిమిషంలోనే హైదరాబాద్ టూఫాన్స్ జట్టు ఆరో గోల్ చేసింది. టిమ్ బ్రాండ్ (46) తన హ్యాట్రిక్ పూర్తి చేసుకున్నాడు. ఆట చివరిలో బెంగాల్ వరుసగా పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకున్నా, నాలుగు క్వార్టర్లలో అగ్రస్థానంలో ఉన్న టూఫాన్స్ రక్షణను ఛేదించలేకపోయారు.



## టీమిండియా నుంచి సుందర్ ఔట్

### ఈ ప్లేస్‌కు ప్లేయర్ల క్యూ

**న్యూఢిల్లీ:** టి20 ప్రపంచకప్-2026కు సమయం దగ్గరపడుతుండటంతో టీం ఇండియాలో స్థానాల కోసం పోటీ తీవ్రమైంది. జట్టులో నిలకడగా రాణించని ఆటగాళ్లను తప్పించి, టీ20 ఫార్మాట్‌కు సరిపోయే ఇంపాక్ట్ ప్లేయర్లను తీసుకోవాలని సెలక్టర్లు భావిస్తున్నారు. ప్రపంచ కప్ వంటి మెగా టోర్నీలో యునివర్సల్ ఆల్‌రౌండర్ పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా ఆల్‌రౌండర్ కోటాలో వాషింగ్టన్ సుందర్ పవర్‌ప్లేలో పొదుపుగా బౌలింగ్ చేయగలిగినా బ్యాటింగ్‌లో ఫినిషర్‌గా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. టీ20లో లోయర్ ఆర్డర్‌లో భారీ సిక్సర్లు బాదే ఆటగాడు భారత్‌కు అవసరం. సుందర్ స్థానంలో రియాన్ పరాగ్ ప్రస్తుతం అత్యంత అనుకూలమైన పోటీదారునిగా ఉన్నాడు. సుందర్ లాగే, రియాన్ కూడా స్పిన్ ఆల్ రౌండర్. అయితే అతను కూడా ఆఫ్‌బ్రేక్ బౌలర్. బౌలింగ్‌తో పాటు, అద్భుతమైన బ్యాటింగ్, అద్భుతమైన ఫీల్డింగ్. ఇందులో అతను సుందర్‌నే కాకుండా ఇతర పోటీదారులందరినీ అధిగమించాడు. ఎడమచేతి వాటం స్పిన్ ఆల్ రౌండర్ షాబాజ్ అహ్మద్ ఇటీవలే టీం ఇండియాకు ఎంపికయ్యాడు. కానీ అతనికి అవకాశం రాలేదు. వరుసగా 2022, 2023లో భారత్ తరపున వన్డే, టీ20లలో అరంగేట్రం చేశాడు. ఇటీవల సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలలో ఈ ఆల్ రౌండర్ బ్యాట్, బంతి రెండింటిలోనూ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అలాగే సుందర్ వన్డే సిరీస్ నుంచి తప్పుకున్న తర్వాత, సెలెక్టర్లు మొదట ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోనీని జట్టులోకి తీసుకున్నారు. ఆల్ రౌండర్‌కు టీం ఇండియా నుంచి పిలుపు రావడం ఇదే తొలిసారి. సుందర్, పరాగ్ లాగానే, అతను ఆఫ్ స్పిన్నర్, మిడిల్ ఆర్డర్‌లో లేదా ఫినిషర్‌గా పేలవంగా ఆడగలడు.

ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అతని సామర్థ్యాలు ప్రదర్శించబడ్డాయి. ఇక నితీష్‌కుమార్ మీడియం పేసర్ ఆల్ రౌండర్ అయినప్పటికీ, అతను కొంతకాలంగా జట్టులో స్థిరంగా ఉన్నాడు. అతని ప్రదర్శన కూడా ప్రశ్నార్థకంగా ఉన్నప్పటికీ, ప్రతిభ, భారత పరిస్థితులపై అవగాహన అనుకూలంగా ఉన్నప్పటికీ ఎంపికయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఇక కృనాల్ పాండ్యా టీం ఇండియా నుంచి తొలగించబడిన తర్వాత తిరిగి జట్టులోకి రాలేకపోయాడు. భారత్ తరపున 19 టీ20లు, 5 వన్డేలు ఆడిన ఎడమచేతి వాటం స్పిన్నర్, ఆల్ రౌండర్ అయిన కృనాల్ 2021 నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. అయితే, దేశీయ క్రికెట్, ఐపీఎల్‌లో అతని ఇటీవలి ప్రదర్శనలు ప్రశంసనీయం. బరోడాకు కెప్టెన్‌గా ఉండగా, ముష్తాక్ అలీ ట్రోఫీలో అతను జట్టుకు అసాధారణంగా మంచి ప్రదర్శన ఇచ్చాడు.


## హర్యానా థండర్స్ హ్యాట్రిక్

### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో 6-3 తేడాతో దంగల్ వారియర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026, 5వ మ్యాచ్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్‌పై 6-3 తేడాతో హర్యానా థండర్స్ విజయంతో ఆరంభాన్ని కొనసాగించింది. తొలి మ్యాచ్ నుంచే ఊపు మీదున్న హర్యానా ఈ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఢిల్లీ దంగల్ వారియర్స్ కఠినమైన పోరాటాన్ని ప్రదర్శించి విలువైన పాయింట్లు సేకరించినప్పటికీ, హర్యానా జట్టు బహుళ వెయిట్ కేటగిరీలలో చాలా బలంగా ఉంది. మహిళల 76 కిలోల బౌట్‌తో హోరాహోరీగా జరిగిన ఈ టైలో కాజల్ 6-5తో అనస్తాసియాను ఓడించి హర్యానాకు తొలి ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత పురుషుల 57 కిలోల విభాగంలో అంకుష్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు, శుభమ్‌పై 13-3 తేడాతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి హర్యానా ఆధిక్యాన్ని పెంచాడు. మహిళల 53 కిలోల బౌట్‌లో యుయి సుసాకి సంచలనాత్మక వేగంతో సారికాను కేవలం 57 సెకన్లలో 16-0తో ఓడించింది. ఆమె ఉత్కంఠభరితమైన ప్రదర్శన ఆమెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సంపాదించిపెట్టింది. పురుషుల 125 కిలోల విభాగంలో అనిరుధ్ గులియా 13-0తో రోనక్ దహియాను ఓడించడంతో హర్యానా తన పట్టును మరింత పటిష్ఠం చేసుకుంది. మహిళల 57 కిలోల విభాగంలో నేహా సంగ్వాన్ మరో ఆధిపత్య ప్రదర్శనతో, కార్లా గొడినెజ్‌ను 18-2 తేడాతో ఓడించి హర్యానాను మరింత బలోపేతం చేసింది. పురుషుల 65 కిలోల విభాగంలో సుజీత్ కల్కల్ 2-1తో తుముర్ తుల్గాను ఓడించడం ద్వారా ఢిల్లీ దంగల్ వారియర్స్ కొంత ఉపశమనం పొందింది. పురుషుల 74 కిలోల విభాగంలో పర్వీందర్ సింగ్‌పై 8-0 తేడాతో విజయం సాధించి ఢిల్లీ తరపున తురాన్ బయ్‌రామోవ్ కూడా ఆకట్టుకున్నాడు, తద్వారా టై పోటీని కొనసాగించాడు. అయితే, మహిళల 62 కిలోల బౌట్‌లో ఇరినా కొలియాడెంకో అంజలిపై 13-0 తేడాతో సమగ్ర విజయం సాధించడంతో హర్యానా పోటీని నిర్ణయాత్మకంగా ముగించింది.





**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026 తొలి రౌండ్‌లో జాస్మిన్ పావోలిని, మరియా సక్కారి ఆధిక్యం సంపాదించారు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రౌండ్ 2లోకి పావోలిని, సక్కారి

మెల్‌బోర్న్‌లోని రాడ్ లావర్ అరీనాలో ఆదివారం జరిగిన టోర్నమెంట్‌లో పావోలిని వరుస సెట్ల తేడాతో విజయం సాధించి ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌లో ఏడో సీడ్ ఇటాలియన్ బెలారసియన్ క్వాలిఫైయర్ అలియాక్సాండ్రా సాస్నోవిచ్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించింది. 30 ఏళ్ల ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, కేవలం 10 నిమిషాల్లోనే 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆమె మొదటి సెట్‌ను 26 నిమిషాల్లోనే కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో సాస్నోవిచ్ మరింత ప్రతిఘటనను ప్రదర్శించినప్పటికీ, పావోలిని రనౌట్ చేసింది. పావోలిని 2024లో వింబుల్డన్ మరియు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరుకుంది. మెల్‌బోర్న్ పార్క్‌లో అదే సంవత్సరంలో నాల్గవ రౌండ్‌లో ఆమె అత్యుత్తమ ఫలితం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో పావోలిని పోలాండ్‌కు చెందిన మాగ్డలీనా ఫ్రెచ్ లేదా స్లోవేనియాకు చెందిన వెరోనికా ఎర్జావెక్‌తో తలపడుతుంది. మరో మ్యాచ్‌లో మరియా సక్కరి ఫ్రాన్స్‌కు చెందిన లియోలియా జీన్‌జీన్‌ను 6-4, 6-2 తేడాతో ఓడించి టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది.

## రూపాయి క్షీణతకు ఇండో యుఎస్ ట్రేడ్ డీల్ లింకు..



**ముంబయి జనవరి 18:** డాలర్‌తో పోలిస్తే రూపాయి మరోసారి తీవ్ర ఇబ్బం దుల్లో పడింది. వారాంతంలో రూపాయి ఈ ఏడాదిలోనే అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి నాలుగు వారాల కనిష్ట స్థాయికి చేరుకుంది. ఇదే టైంలో డాలర్ ఆరు వారాలలో అత్యంత బలమైన స్థాయిలో ట్రేడవుతోంది. వరుసగా మూడవ రోజు కూడా రూపాయి క్షీణించడంతో డాలర్‌తో రూపాయి 60 పైసలకు పైగా తగ్గిందని సర్వేల్లో తేలింది. ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి చారిత్రాత్మక కనిష్ట స్థాయికి చేరుకోవచ్చని నిపుణుల అంచనా. రూపాయి విలువ పతనం కావడానికి అతిపెద్ద కారణం అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంలో జాప్యం. డాలర్ డిమాండ్ కారణంగా రూపాయి పడిపోతోంది. ఇదే టైంలో డాలర్ ఇండెక్స్ పెరగడం స్పష్టంగా కనిపిస్తుంది. స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారుల ఉపసంహారణ ఇంకా ముగియలేదు. దీని ప్రభావం రూపాయిపై స్పష్టంగా కనిపిస్తుంది. రూపాయి విలువ క్షీణించి, అమెరికా డాలర్‌తో పోలిస్తే 44 పైసలు తగ్గి 90.78 వద్ద ముగిసింది. బలమైన డాలర్ డిమాండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల మూలధన ప్రవాహాలు రూపాయి పతనంపై మరింత ప్రభావం చూపాయి. అమెరికాభారతదేశం వాణిజ్య చర్చల గురించి ఆం దోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడి దారుల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయని విదేశీ కరెన్సీ వ్యాపారులు తెలిపారు. ముఖ్యంగా ఈ రూపాయి క్షీణత 2026 తర్వాత ఇదే గరిష్ఠం. ఇంటర్‌బ్యాంక్ విదేశీ కరెన్సీ మారక మార్కె ట్లో డాలర్‌కు రూపాయి విలువ 90.37వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో ఇది డాలర్‌కు 90.89కనిష్ట స్థాయికి చేరుకుంది. చివరికి డాలర్‌తో పోలిస్తే 90.78 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేసిన సుంకాల చర్యలు డాలర్ డిమాండ్ పెరుగుదలకు కారణం అయ్యింది. భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహారణలు కూడా రూపాయి క్షీణతకు ప్రధాన కారణంగా నిలిచాయి. శుక్రవారం విదేశీ పెట్టుబడిదారులు రూ.4,346.13 కోట్ల విలువైన లాభాలను బుక్ చేసుకున్నారని స్టాక్‌డేటా చెపుతోంది. అదే సమయంలో ప్రస్తుత సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుంచి రూ.22,530కోట్లను ఉపసంహారించుకున్నారు. ఈ నెలలో సెన్సెక్స్, నిఫ్టీ ఇప్పటికే దాదాపు 2 తగ్గాయి. ఇది రూపాయి విలువపై ప్రభావం చూపుతోంది.




## ఐడిబిఐ బ్యాంకు నికరలాభం రూ.1935.45కోట్లు

**ముంబయి, జనవరి 18:** జీవితభీమాసంస్థ ఆధ్వర్యంలోనడుస్తున్న ఐడిబిఐ బ్యాంకు డిసెంబరు త్రైమాసికంలో నికరలాభం రూ.1.4 శాతం పెరిగి రూ.1935.45కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది అదే ఏడాదిక్రితం రూ.1908.27 కోట్లుగా ఉన్న లాభం స్వల్పంగా పెరిగింది. నికరవడ్డీ ఆదాయం రూ.3209.5 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలోరూ.4228.2 కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ డెడ్‌లైన్ కొద్దిలో మిస్ అయింది. నికర నిరర్థక ఆస్తుల్లో క్షీణత కనిపించింది. గత త్రైమాసికంలో ఉన్న రూ.425.3కోట్లనుంచి రూ.474.2కోట్లకు తగ్గాయి.

నిరర్థక ఆస్తులు నికరంగా 0.21శాతంనుంచి 0.18శాతానికి వచ్చాయి. స్థూల నిరర్థక ఆస్తులు రూ.6242కోట్లుగా ఉన్నాయి. అదే గత త్రైమాసికంలో 6281 కోట్లుగా ఉన్నట్లు బ్యాంకుప్రకటించింది. 2.57శాతంతగ్గాయి. కేటాయింపుల నిష్పత్తి కూడా 99.33శాతంగా ఉంది. బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.5.46 లక్షలకోట్లుగా ఉంది. 12శాతం వృద్ధితో ఉంది. డిపాజిట్లురూ.3.07 లక్షలకోట్లుగా ఉన్నాయి. నికర లడ్వాన్సులు 15శాతంపెరిగి రూ.2.39 లక్షలకోట్లుగా ఉన్నాయి. కాసా డిపాజిట్లు కూడా రూ.1,35,632 కోట్లుగా ఉనానయి. కాసా నిష్పత్తి కూడా 44.06శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది.

## మూడో త్రైమాసికంలో 11శాతం పెరగనున్న ఫార్మా రాబడులు

**న్యూఢిల్లీ, జనవరి 18:** దేశీయంగా పెరిగిన అమ్మకాలు ఫార్మాకంపెనీల్లో రాబడులను మూడో త్రైమాసికంలో ఎనిమిదినుంచి 11శాతంవరకూ పెంచుతాయన్న అంచనాలున్నాయి. కేన్సర్ డ్రగ్ జనరిక్ రెవ్లిమిడ్ అమెరికాలో విక్రయాలు కూడా కొంత కీలకం కానున్నాయి. బ్రోకరేజి సంస్థల అంచనాల ప్రకారం కంపెనీల్లో నికరలాభాలు రెండునుంచి నాలుగుశాతం వరకూ పెరుగుతాయి. ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ కంపెనీల్లో కూడా పటిష్ఠమైన రాబడులు నమోదవుతాయని, 20 నుంచి 22శాతం వార్షిక వృద్ధి ఉంటుందని తేలింది.



భారత్ ఫార్మా మార్కెట్‌లో రెండంకెల వృద్ధి ఉంటుందని, 16శాతం కార్డియాక్ చికిత్సలు, ఆంకాలజి 26శాతం, యాంటిడయాబెటిక్స్ 14శాతం చొప్పున ఈత్రైమాసికంలో వృద్ధి ఉంటుందని తేల్చారు. అలాగే యాంటి ఇన్ఫెక్షన్స్ రెండుశాతం, నొప్పులు ఏడుశాతం, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, డెర్మటాలజీ థెరఫీలు 8శాతం వృద్ధి ఉంటుందని ఫార్మారంగ నిపుణులు పేర్కొంటున్నారు. యువామా ఆర్థికవేత్తలు అంచనాలప్రకారం లూపిన్ 8 నుంచి 10శాతం వృద్ధిఉ ంటుందని, సన్‌ఫార్మా, టొరెంట్‌ఫార్మా, డా.రెడ్డీస్ ల్యాబ్స్ కూడా 12శాతంవరకూ రాబడులు పెంచుకోవచ్చని అంచనావేసింది. సిప్లా ఆల్కెమ్, జైడస్ కంపెనీలుకూడా తొమ్మిదినుంచి 10శాతంవరకూ దేశీయ వ్యాపారంలో వృద్ధినమోదుచేస్తాయని తేలింది. అమెరికా మార్కెట్‌లో జెనరిక్ రెవ్లిమిడ్ కీలకంగా ఉంది. కాంట్రాక్టు అభివృద్ధి, ఉతయారీ సంస్థలు (సిడిఎంఒలు)కొంత మందగమనం నెలకొనడంతోమూడోత్రైమాసికంలో కొంత వెనకబడిందనే చెప్పాలి. ఇటీవలికాలంలో రెవ్లిమిడ్ మార్కెట్ కొన్ని బిలియన్ డాలర్ల జనరిక్ మం దుగా విస్తరించింది. టెవా, నాట్కో, డా.రెడ్డిస్,సిప్లా, సన్‌ఫార్మాలు ఇపుడు ఈ ఔషధ ఉత్పత్తిలోకి వస్తున్నాయి. ఇక డయాగ్నస్టిక్స్‌పరంగా లాల్‌పాథ్‌ల్యాబ్స్ 11శాతం, మెట్రోపాలిస్ హెల్త్‌కేర్ 15శాతం, వృద్ధిని నమోదుచేసినట్లు రేటింగ్ సంస్థలు చెపుతున్నాయి. ఇక ఆసుపత్రుల రంగంలో అపోలో ఆసుపత్రి 65శాతం వృద్ధితో ఉన్నట్లు తేలింది. సగటురాబడి ప్రతి బెడ్‌కు 13శాతంపెరిగిందని నిపుణుల అంచనా. ఫోర్టిస్ కంపెనీ 67శాతంగా ఉంది. ప్రతి బెడ్‌కురాబడి వ1ద్ధిఐదుశాతంగా ఉంది. మాక్స్ హెల్త్‌కేర్ పదిశాంగా ఉన్నట్లు నువామా అంచనావేసింది.

## కేంద్ర బడ్జెట్, కార్పొరేట్ ఫలితాలే కీలకం

### ఈ వారం మార్కెట్లపై స్టాక్‌బ్రోకింగ్ అంచనాలు




**ముంబయి, జనవరి 18:** డాలర్‌రూపాయి కదలికలతోపాటు కార్పొరేట్‌మూడో త్రైమాసిక ఫలితాలు,దావోస్ సదస్సుల్లో వెలువడే పెట్టుబడుల నిర్ణయాలు,కేంద్ర బడ్జెట్ వంటివి ఈ వారం మార్కెట్లకు కీలకం అవుతాయని మార్కెట్ నిపుణుల అంచనా. వీటికితోడు మధ్యప్రాచ్యంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల ప్రభావంకూడా స్టాక్ మార్కెట్లపై పడుతుందని అంచనా. అలాగే విదేశీ ఇన్వెస్టర్ల ధోరణులు, పెట్టుబడుల రాక వంటివికూడా కొంత మార్కె ట్లకు దిక్సూచిగా మారతాయి. రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐబ్యాంకుల త్రైమాసిక ఫలితాల ఆధారంగా ఇన్వెస్టర్లు ట్రేడింగ్ ఉంటుంది. ఆ తర్వాత రానున్న భారీ కంపెనీల క్యూ3 ఫలితాలు, మిడ్‌క్యాప్ కంపెనీలపైనా ఈ ట్రేడింగ్ ధోరణులు ప్రస్ఫుటం అవుతాయని అంచనా. ఇక గ్లోబల్ పరంగా అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు, జిడిపి వృద్ధి, నిరుద్యోగ డేటా, పిఎంఐ నివేదికలతోపాటు కరెన్సీ కదలికలు కూడా కొంత కీలకం కాగలవు. అలాగే భారత్ అమెరికాలమధ్య జరిగే ట్రేడ్‌డీల్ చర్చలు కూడా మార్కెట్లను ప్రభావితం చేస్తాయని రెలిగేర్‌బ్రోకింగ్ ఎస్వీపీ అజిత్ మిశ్రా తెలిపారు. అన్నింటికంటే ముఖ్యంగా కేంద్ర బడ్జెట్ ఈసారి ట్రేడింగ్‌కు కీలకం కానున్నది. బడ్జెట్ కేటాయింపుల ఆధారం గానే విభిన్న రంగాల్లో కంపెనీ షేర్లలో మార్పులుంటాయని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సంతోష్ మీనా అన్నారు. ఇక వచ్చే వారంలో భెల్,ఎల్టీఐ మైండ్‌ట్రీ, పిఎన్‌బి, ఎయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు, ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాంక్ ఆఫ్ ఇం డియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, డిఎల్‌ఎఫ్, బిపిసిఎల్, ఆదాని గ్రీన్ ఎనర్జీల ఫలితాలు రానున్నాయి. గతవారం మిశ్రమఫలితాలతో ముగిసిన మార్కెట్లు ఈ వారం బడ్జెట్‌ప్రభావంతో కొంత మార్పులు ఉండవచ్చని స్టాక్‌బ్రోకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

## మూడు టాప్ కంపెనీల్లో రూ.76 వేలకోట్ల ఎంక్యాప్ వృద్ధి




**ముంబయి, జనవరి 18:** దేశంలోపి పది టాప్ కంపెనీల్లో మూడు కంపెనీల మార్కెట్ విలువలు రూ.75,855.43 కోట్లు పెరిగినట్లు స్పష్టం అయింది. భారతీయ స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్ సంస్థలు భారీ స్థాయిలో లాభపడ్డాయి. ఇతర సంస్థలు మందగమనంతోనే ఉన్నట్లు ఈక్విటీ మార్కెట్లలో రుజువయింది. ఐసిఐసిఐబ్యాంకు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్ సంస్థలు భారీ లాభాలు ఆర్జిస్తే, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టాటా కన్సల్టెన్సీ సర్వీసులు, భారతి ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్‌అండ్‌టి సంస్థలు మొత్తంగా 75,549.89 కోట్లు క్షీణించినట్లు కనిపించింది. ఈ ఏడు సంస్థల మార్కెట్ విలువల క్షీణత కనీసం ఈ లాభాలు పొందిన మూడు సంస్థల స్థాయిలోకూడా లేదు. ఎస్‌బిఐ మార్కెట్ విలువలు 39,045.51కోట్లుపెరిగి రూ.9,62,107.27 కోట్లకుచేరి అతిపెద్ద సంస్థగా నిలిచింది. ఇన్ఫోసిస్ కూడా రూ.31,014.59 కోట్లు పెరిగి రూ.7,01,889.59 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు రూ.5795.33కోట్లుపెరిగి మొత్తం విలువలు రూ.10,09,470.28 కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి సంస్థ విలువలు 23,501.8 కోట్లు క్షీణించి రూ.5,30,410.23కోట్లకు చేరాయి. హెచ్‌డిఎఫ్‌సి విలువలు కూడా రూ.11,615.35కోట్లు కోతకు గురయి రూ.14,32,534.91 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.6443.38 కోట్లు క్షీణించి రూ.11,49,544.43కోట్లు టర్నోవర్‌తో నిలిచింది. ఇక బజాజ్‌ఫైనాన్స్ కూడా రూ.6253.59 కోట్లు క్షీణించి రూ.5,91,447.16 కోట్లతో ఉంది. హిందూస్థాన్ యూనిలివర్ రూ.3312.93 కోట్లు క్షీణించి రూ.5,54,421.30 కోట్లుగా ఉంది. ఇక టెక్నాలజీ దిగ్గజం టిసిఎస్ విలువలు కూడా రూ.470.36 కోట్లు క్షీణించి రూ.11,60,212.12కోట్లకు చేరాయి.

## ఆమ్వే ఇండియాకు తప్పని నష్టాలు: యేడాది మొత్తంగా రూ.74.25 కోట్ల నష్టం




**ముంబయి, జనవరి 18:** ఆమ్వే ఇండియా కంపెనీ మొత్తంనష్టం రూ.74.25 కోట్లుగా ఉంది. కేలండర్‌సంవత్సరంలో నష్టాలు మరింతపెరిగాయని కంపెనీ చెపుతోంది. రాబడులు కూడా 10.56 శాతం క్షీణించి రూ.1148.16 కోట్లకు తగ్గాయి. మొత్తం పూర్తి ఆర్థికసంవత్సరానికిగాను రాబడులు రూ.1174.85 కోట్లుగా ఉన్నాయి. ఆమ్‌వే ఇండియా మొత్తం నష్టం రూ.53.38 కోట్లుగా ప్రకటించింది. గతఏడాది ఇదే కేలండర్‌సంవత్సరంలో 1283.75 కోట్లు సాధించిందని బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వెల్లడించింది. గడచిన రెండేళ్లుగా సంస్థ మందగమనంతో కూడిన వృద్ధిని నమోదుచేస్తోంది. ఆమ్‌వే ఇండియా వ్యయాలు కూడా రూ. 36.20 కోట్లకు చేరాయి. అమెరికా మాతృసంస్థకు రాయల్టీ రూపంలో రూ.55.43కోట్లు చెల్లించింది. ఏజెంట్ విక్రేతలకు రూ.366.91 కోట్లు చెల్లించినట్లు కంపెనీ తెలిపింది. ఆమ్వే ఇండియా మొత్తం వ్యయాలు కేలండర్ సంవత్సరంలో రూ. 1249.10 కోట్లుగా ఉంది. మిచిగాన్‌కు చెందిన అల్టికర్ గ్లోబల్ హోల్డింగ్స్ ఇంక్ అనుబంధంగా కొనసాగుతున్న సంస్థ ప్రత్యక్ష విక్రయాల సంస్థగాలిస్ట్ అయింది. న్యూట్రిషన్ వెల్‌నెస్ విభాగంలో రాబడులు పదిశాతం తగ్గి 2025లో రూ.703.58 కోట్లుగా ఉంది. ఇక హోమ్‌కేర్ ఉత్పత్తుల ద్వారా రూ.120.29 కోట్ల రాబడు లున్నాయి.బ్యూటీ ఉత్పత్తుల విభాగంలో రూ.96.59 కోట్లు సాధించినా 12శాతం తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. అంతర్జా తీయంగా టాప్ పది మార్కెట్లలో ఒకటిగా ఉన్న ఆమ్వే నేరుగా విక్రయాలుజరిపే సంస్థల్లో టాప్ ఐదులో ఒకటిగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.